

సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



భారత్,అమెరికా ఒప్పందంతో 'డేటా కాలనీ'గా దేశం 05

తప్పడు సమాచారం పట్ల జాగ్రత్త

ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆందోళన



సంపుటి 09, సంచిక: 83 | శనివారం | 21-02-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00





## ట్రంప్ అదనపు సుంకాలు కొట్టివేత

- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- ప్రత్యేక టారిఫ్‌లు విధించే అధికారం దేశాధ్యక్షుడికి లేదని స్పష్టీకరణ

**వాషింగ్టన్:** వివిధ దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చుక్కెదురైంది. పెంచిన పలు టారిఫ్‌లను అమెరికా సుప్రీం కోర్టు కొట్టివేసింది. ట్రంప్ జాతీయ అత్యవసర పరిస్థితి పేరుతో విధించిన విస్తృత సుంకాలు ఆయన అధికార పరిధిని మించి ఉన్నాయని కోర్టు నిర్ధారించింది. ఇది ఆయన రెండో పదవీకాలంలో ఎదురైన అరుదైన న్యాయపరమైన వెనకడుగుగా పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ కేసులో ప్రధానంగా 1977లో అమల్లోకి వచ్చిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఇఇపిఎ) చట్టాన్ని ట్రంప్ ప్రభుత్వం ఎలా వినియోగించిందన్న అంశం పరిశీలనకు వచ్చింది. ఆ చట్టం ప్రకారం, దేశానికి అసాధారణ, అత్యవసరమైన ముప్పు ఉందని అధ్యక్షుడు ప్రకటించిన సందర్భంలో దిగుమతులు, ఎగుమతులను నియంత్రించడానికి కొన్ని అధికారాలు ఉంటాయి. అయితే ఆ చట్టంలో సుంకాలు విధించే అధికారం స్పష్టంగా పేర్కొనబడలేదు. అయినప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆధారంగా తీసుకొని ప్రపంచ దేశాలపై విస్తృత సుంకాలు విధించింది. సుప్రీంకోర్టు 6:3 మెజారిటీతో ఇచ్చిన తీర్పులో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెల్లడించిన అభిప్రాయం కీలకమైంది. అధ్యక్షుడు ఎలాంటి కాలపరిమితి లేకుండా, విస్తృత స్థాయిలో సుంకాలు విధించే అసాధారణ అధికారం తనకు ఉందని తరువాయి 12లో



ఎఐ పరిణామాల నిశిత పర్యవేక్షణకు

# జాతీయ ఎఐ వార్ రూమ్

- భారతదేశాన్ని ప్రపంచ ఎఐ పవర్‌హౌస్‌గా నిర్మించాలి
- తెలంగాణలో ఎఐ స్టార్టప్ విలేజ్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం
- ఢిల్లీలో ఎఐ సమ్మిట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం

ప్రజాపక్షం/హైదరాబాద్

సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడే విధంగా కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధి ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఎఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సిఎం ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఎఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఎఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సిఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం తరువాయి 2లో



## రాష్ట్ర బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్లు?

- వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ తుది మెరుగులు
- సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు

**సన్నవడ్లకు బోనస్, 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, పింఛన్లు 4 వేల పెంపుపై దృష్టి !**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వార్షిక బడ్జెట్(2026–27) ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ తుది మెరుగులు దిద్దుతోంది. ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిన ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 28న శాసనసభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) రూ.3.04లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టగా, 2026–27 బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్ల నుండి రూ.3.25 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బడ్జెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. 2026–2027 బడ్జెట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. ముఖ్యంగా సన్న బియ్యం పండించే రైతులకు బోనస్, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ. 2,500ల ఆర్థిక సాయం, పెన్షన్లను రూ.4వేలకు పెంపు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. రాష్ట్రం అధిక అప్పు, పరిమిత ఆదాయ సమస్య తదితర పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొనసాగుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి తగినంత తరువాయి 2లో







విజె సాయి కెమికల్ కంపెనీలో అగ్ని ప్రమాదం 03

కార్మికుడి సజీవదహనం


## రాష్ట్రానికి మరో రూ.387.53 కోట్లు విడుదల

- '15వ ఆర్థిక సంఘం' నిధులు విడుదల చేసిన కేంద్రం
- పెండింగ్‌లో మరో రూ.2వేల కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో '15వ ఆర్థిక సంఘానికి' సంబంధించిన పెండింగ్ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా మూడో విడతగా తెలంగాణ రాష్ట్రానికి రూ. 387.53 కోట్లను కేంద్రం విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రానికి మొత్తం రూ. 1034.42 కోట్ల నిధులు అందాయి. కాగా మరో రూ. 2వేల కోట్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగేందుకు ఈ నిధులు కీలకంగా ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తరువాయి 12లో

## 'పాక్స్ సిలికా'లోకి భారత్



**న్యూఢిల్లీ :** అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమి 'పాక్స్ సిలికా'లో భారతదేశం శుక్రవారం చేరింది. ఇది కీలకమైన ఖనిజాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన స్థిరమైన సప్లయ్ చైన్‌ను నిర్మించే లక్ష్యంతో ఏర్పడింది. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో జరిగిన కార్యక్రమంలో ఈ సంకీర్ణ కూటమిలో చేరే ఒప్పందంపై సంతకాలు జరిగాయి. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మే షన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్, యుఎస్ అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఎకనామిక్ అఫైర్స్ జాకబ్ హె ల్‌బర్గ్, భారతదేశంలో యుఎస్ రాయబారి సెర్గి యో గోర్ తదితరులు హాజరయ్యారు.ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి, తీవ్ర ఒత్తిడి అనంతరం ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి అనేక చొరవలను ముందుకు తీసుకెళ్లడానికి ఇరువైపులా కొనసాగిన ప్రయత్నాల నేపథ్యంలో సంకీర్ణంలో చేరాలనే నిర్ణయం జరిగింది. 'పాక్స్ సిలికాలో భారతదేశం ప్రవేశించడం కేవలం ఒక ప్రతీకాత్మక చర్య మాత్రమే కాదు. ద్వైపాక్షిక సంబంధాల మొత్తం పథాన్ని మరింత బలోపేతం చేసే వ్యూహాత్మక చర్య' అని అమెరికా రాయబారి గోర్ వ్యాఖ్యానించారు. పాక్స్ సిలికా రూపకల్పన కింద భారతదేశంతో విశ్వసనీయ ఎఐ టెక్నాలజీలను అమెరికా పంచుకోవచ్చని సెర్గియో గోర్ సూచించారు. సంకీర్ణంలో చేరాలనే భారత్ నిర్ణయాన్ని అమెరికా అండర్ సెక్రటరీ జాకబ్ హెల్‌బర్గ్ ప్రశంసించారు. పాక్స్ సిలికా సభ్యదేశాలలో ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, జపాన్, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్ ఉన్నాయి. వ్యూహాత్మక కూటమిలో చేరాలని ఢిల్లీని ఆహ్వానించినట్లు అమెరికా రాయబారి సెర్గియో గోర్ గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే.

'వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్' బిల్లు

## సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- వర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్ర
- పేద వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేసే బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి
- ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ డిమాండ్




ప్రజాపక్షం/నిజామాబాద్

కేంద్ర బిజెపి సర్కారు 'విబిఎస్‌ఎ– 2025' బిల్లు తీసుకువచ్చి కేంద్రం తన స్వంత ఎజెండాను వర్సిటీలలో అమలు పర్చేందుకు కుట్రలు చేస్తుందని, వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్‌ఎ) బిల్లు 2025 పేరుతో యూనివర్సిటీలను దెబ్బ తీసి ఉన్నత విద్యకు పేద వర్గాలను దూరం చేస్తోందని, విబిఎస్‌ఎ బిల్లు, యుజిసి నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గోసేరెడ్డి కళ్యాణ మండపంలో 3వ రోజు జరిగిన ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు మహాసభలకు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోత్ రఘురాం, బొజ్జ జ్యోతిల అధ్యక్షత వర్గంగా వహించారు. ఈ మహాసభల ముఖ్యఅతిథులుగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర నాయకులు ఇటి నర్సింహ, విశిష్ట అతిథులుగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్‌ఎ స్టాలిన్, జాతీయ నాయకులు బందెల నాసర్ జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ మాట్లాడుతూ దేశంలో 12 ఏళ్ల కాలంగా అధికారంలో ఉన్న మోదీ దేశ విద్యారంగాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బ తీసేలా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగమే విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ జాతీయ విద్యావిధానం పేరుతో విద్య కాషాయీకరణకు పూనుకున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ దేశ విద్య రంగాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని విమర్శించారు. దేశంలో ప్రభుత్వపాఠశాలలను 93,000 పైగా మూసివేసి ప్రభుత్వ పాఠశాల విద్య కూడా పేదలకు అందకుండా చేస్తోందని, బిజెపి పరిపాలన తరువాయి 12లో



## ఎసిబి వలలో కోర్టు సిబ్బంది

- భూపాలపల్లి జిల్లా కోర్టులో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు

ప్రజాపక్షం/భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో ఎసిబి అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటుండా ముగ్గురు కోర్టు సిబ్బందిని అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నా రు. ఎసిబి డిఎస్‌పి సాంబయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్న పాలకుర్తి సాయి చరణ్, పున్నం రజిత, కొమ్ము సునీతల ఐదు వేలు లంచం తీసుకుంటూ ఉండగా తరువాయి 12లో

ప్రభుత్వంలో టిజిఎస్ ఆర్‌టిసి

# విలీనం ఇంకెప్పుడు?



**24న 'చలో సెక్రటేరియెట్'కు సిద్ధమవుతున్న కార్మికులు**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ జీవనాడి అయిన రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ఆర్‌టిసికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు గళమెత్తుతున్నారు. ముఖ్యంగా ఈ నెల 24న నిర్వహించనున్న 'చలో సెక్రటేరియెట్' కార్యక్రమం ద్వారా తమ ఆవేదనను ప్రభుత్వానికి వినిపించేందుకు ఆర్‌టిసి జెఎసి సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది ఆర్‌టిసి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటారని సమాచారం. గతంలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు బిల్లు ఆమోదం పొందినా, క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వ సంస్థగా పూర్తిస్థాయిలో గుర్తించి, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. విలీనం జరిగితేనే కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

**ఉచిత బస్సు పథకంతో పెరుగుతున్న ఒత్తిడి..**

'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం శుభపరిణామమే అయినా, దానికి తగిన మౌలిక తరువాయి 2లో

## ఇండోనేషియాతో యుఎస్ వాణిజ్య ఒప్పందం




**వాషింగ్టన్:** ఇండోనేషియాతో అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బోర్డ్ ఆఫ్ పీస్ సమావేశంలో పాల్గొనడానికి ఇక్కడికి వచ్చిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవొ సుబియాంతో, ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. అధికారిక ప్రకటనను అనుసరించి, ఇండోనేషియా అమెరికా వస్తువులలో 99 శాతం మీద ఉన్న దిగుమతి సుంకాలను తొలగించనుంది. అయితే అమెరికా, ఇండోనేషియా ఉత్పత్తులపై 19 శాతం సుంకాలను కొనసాగిస్తుంది. అలాగే కీలక ఖనిజాలు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులపై ఉన్న పరిమితులను సడలించేందుకు ఇండోనేషియా అంగీకరించింది. ఇరు దేశాల కంపెనీలు సోయాబీన్స్, మొక్కజొన్న, పత్తి, గోధుమల కొనుగోలు సహా సుమారు 38.4 బిలియన్ డాలర్ల విలువైన 11 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి బోర్డ్ ఆఫ్ పీస్ సమావేశంలో సుబియాంతో పాల్గొన్నారు. గాజాలో స్థిరీకరణ దళానికి 8,000 మంది సైనికులను పంపేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, అమెరికా–చైనా పోటీ నేపథ్యంలో కీలక ఖనిజాల సరఫరా భద్రతకు కూడా దోహదపడుతుందని భావిస్తున్నారు.

# అమెరికా ద్వంద్వ ప్రమాణాలు

## సౌదీ అరేబియాతో అణు చర్చలపై భయాందోళనలు

**దుబాయ్:** అణు ఒప్పందాలు.. యురేనియం నిక్షేపాల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సౌదీ అరేబియాతో జరుగుతున్న అణు చర్చలు... ఇరాన్‌పై తీసుకుంటున్న కఠిన వైఖరి... ఇందుకు ప్రతీకలు. ఒక వైపు, అమెరికా సౌదీ అరేబియాకు యురేనియం సమృద్ధి సాంకేతికత అందించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. మరోవైపు, అదే సమృద్ధి కార్యక్రమం కారణంగా ఆంక్షలు విధిస్తామని, సైనిక చర్య తప్పదని హెచ్చరికలు జారీ చేస్తున్నది. పది రోజుల్లోగా తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే, తీవ్ర పరిణామాలు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. అమెరికన్ కాంగ్రెస్ పత్రాలను అనుసరించి, ట్రంప్ సర్కారు ప్రపంచవ్యాప్తంగా 20అణు ఒప్పందాలు కుదుర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ జాబితాలో సౌదీ అరేబియా ఒకటి. ప్రతిపాదిత ఒప్పందం ద్వారా సౌదీ భూభాగంలో యురేనియం సామర్థ్యం విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ఆయుధ నియంత్రణ సంస్థ (ఎసిఎ)కు చెందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ ఒప్పందాలు ఉన్నప్పటికీ, ఒకసారి సమృద్ధి సాంకేతికతకు అవకాశం ఏర్పడితే, భవిష్యత్తులో ఆయుధీకరణ ప్రమాదం పూర్తిగా నిరాకరించలేమని నిపుణులు అంటున్నారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇప్పటికే ఇరాన్ అణుబాంబు సాధిస్తే తామూ అదే దిశగా వెళ్తామని స్పష్టం చేశారు. అంతేకాక, సౌదీ అరేబియా అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన పాకిస్తాన్‌తో పరస్పర రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేసింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి అవసరమైతే తమ అణు కార్యక్రమాన్ని సౌదీకి అందుబాటులో ఉంచుతామని చెప్పడం, ఆయుధ వ్యాప్తి భయాలను పెంచింది. ఇదే సమయంలో, ఇరాన్‌పై అమెరికా మరింత కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇరాన్ ఇప్పటికే 60శాతం స్థాయికి యురేనియం శుద్ధిని సమృద్ధి చేసిందని, ఇది 90శాతానికి చేరితే, అణ్వస్త్ర తయారీ సాధ్యమవుతుందని అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలు కూడా అంటున్నాయి. ఈ పరిణామాలను తీవ్రమైన భద్రతా ముప్పుగా పేర్కొంటున్నాయి. అయితే ఇరాన్ తన అణు కార్యక్రమం శాంతియుతమని వాదిస్తోంది. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఎఇఎ) పర్యవేక్షణలో ఇరాన్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ సౌదీ విషయంలో అదే ప్రమాణాలు ఎంత కఠినంగా అమలు అవుతాయన్నది స్పష్టంగాలేదు. యురేనియం శుద్ధి స్థాయి, అత్యాధునిక సాంకేతికత అనేవి రెండు అంచుల కత్తిలా పని చేస్తాయి. దీనిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించుకోవచ్చు. అయితే, ఆయుధ తయారీకి కూడా ఇదే సాంకేతికత ఉపయోగపడుతదంఇ. ఇరాన్ విషయంలో అమెరికా దీనిని ప్రమాదకరంగా పరిగణిస్తే, సౌదీ విషయంలో అదే సూత్రాన్ని పాటించడం లేదు. సౌదీ అరేబియాతో ఒప్పందాన్ని వ్యాపార, భౌగోళిక రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా సడలింపులు ఇస్తున్నది. ఇది అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలకు తిరుగులేని నిదర్శనం. ఏదిఏమైనా, అమెరికా తన వ్యూహాత్మక మిత్రదేశాలకు ఒక విధమైన సడలింపు, ప్రత్యర్థి దేశాలకు మరొక విధమైన కఠిన విధానం అనుసరిస్తోందనే భావన ప్రపంచ దేశాల్లో క్రమంగా బలపడుతోంది. అణు వ్యాప్తి నిరోధం నిజంగా లక్ష్యమైతే, సమాన ప్రమాణాలు, పారదర్శక నియంత్రణలు, అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబాట్లు అన్ని దేశాలకూ సమానంగా వర్తించాలి. ఇరాన్‌కు ఒక రకంగా, సౌదీ అరేబియాకు మరో రకంగా కాదు.





## ఉత్తర కొరియా అధికార వర్కర్స్ పార్టీ మహాసభ ప్రారంభం

**ప్యాంగ్యాంగ్:** ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో అధికార వర్కర్స్ పార్టీ మహాసభ ప్రారంభమైంది. ఈ సమావేశంలో నాయకుడు కిమ్ జాంగ్ ఉన్ వచ్చే ఐదేళ్ల కాలానికి తమ దేశీయ, విదేశాంగ విధానాలకు రూపకల్పన చేసి, ఆమోదింప చేసుకుంటారని సమాచారం. కాగా, 2021లో కరోనా ప్రభావం మధ్య జరిగిన మహాసభ తరువాత దేశం ఆర్థికంగా పురోగతి సాధించిందని, రాష్ట్ర స్థానం తిరుగులేని విధంగా బలపడిందని కిమ్ పేర్కొన్నారు. సామ్యవాద నిర్మాణాన్ని వేగవంతం చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తమ ముందున్న ప్రధాన లక్ష్యాలని ఆయన అన్నారు. ప్రభుత్వ మీడియా 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' ప్రకారం, ఈ ప్రసంగంలో అమెరికా, దక్షిణ కొరియాతో ఉన్న ఉద్రిక్తతలపై లేదా అణు కార్యక్రమంపై ప్రత్యక్ష వ్యాఖ్యలు లేవు. అయితే గత కొన్నేళ్లుగా ఉత్తర కొరియా రష్యాతో సంబంధాలను బలోపేతం చేస్తూ, ఉక్రేన్ యుద్ధ నేపథ్యంలో మాస్కోకు సైనిక సహాయం అందించినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో చైనాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించడం ఆర్థిక పునరుద్ధరణకు దోహదపడిందని నిపుణుల అభిప్రాయం. సుమారు 5,000 మంది ప్రతినిధులు పాల్గొంటున్న ఈ మహాసభలో అణు, క్షిపణి సామర్థ్యాల విస్తరణపై తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. అలాగే కిమ్ కుమార్తె కిమ్ జూ అయ్‌ని వారసురాలిగా ప్రోత్సహించే సంకేతాలు ఇవ్వవచ్చని దక్షిణ కొరియా గూఢచారి సంస్థ అంచనా వేస్తోంది. అమెరికాతో 2019 నుంచి నిలిచిపోయిన రాజనీతిక చర్చలు ఇంకా పునరుణకు నోచుకోలేదు. దీంతో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

## శరణార్థులపై మరింత కఠినం

### ఆదేశాలు జారీ చేసిన అమెరికా ప్రభుత్వం




**మిన్నియాపొలిస్:** అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం శరణార్థులపై మరింత కఠినంగా వ్యవహరించేలా కొత్త ఆదేశాన్ని జారీ చేసింది. ఈ ఆదేశం ప్రకారం, అమెరికాలో చట్టబద్ధంగా ఉంటున్నప్పటికీ, ఇంకా శాశ్వత నివాస హక్కును కల్పించే గ్రీన్ కార్డ్‌ను పొందిన శరణార్థులను, వారు దేశంలో ప్రవేశించిన ఒక సంవత్సరం పూర్తయ్యాక అధికారులు మళ్లీ ఫెడరల్ కస్టడీలోకి తీసుకొని వారి దరఖాస్తులను సమీక్షించవచ్చు. ఈ విషయాన్ని మిన్నెసోటాలో జరిగిన ఫెడరల్ కోర్టు విచారణకు ముందుడిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ దాఖలు చేసిన మెమోలో పేర్కొంది. సమీక్ష ప్రక్రియ పూర్తయ్యే వరకు కస్టడీలో ఉంచే అధికారం తమకు ఉందని తెలిపింది. ఈ నిర్ణయం దాదాపు 2 లక్షల శరణార్థుల్లో ఆందోళన, అయోమయం సృష్టించింది. ముఖ్యంగా జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అమెరికాకు వచ్చిన శరణార్థులపై తీవ్ర ప్రభావం ఉండవచ్చని అంటున్నారు. మిన్నెసోటా ఫెడరల్ న్యాయమూర్తి జాన్ టన్‌హీన్ ఇప్పటికే అక్కడి శరణార్థులను అరెస్ట్ చేయకుండా తాత్కాలిక రక్షణ ఉత్తర్వు జారీ చేశారు. శరణార్థులు ఒక సంవత్సరం పూర్తయ్యాకే గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటారని, అదే సమయంలో నిర్బంధం తప్పనిసరి చేయడం తార్కికం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక శరణార్థుల హక్కుల కోసం పనిచేసే హెచ్ఐఎస్ వంటి సంస్థలు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ప్రభుత్వం జాతీయ భద్రత, ఆర్థిక కారణాలు చూపుతున్నప్పటికీ, నిపుణుల ప్రకారం శరణార్థులు ఇప్పటికే కఠిన పరిశీలన తర్వాతే దేశంలోకి వచ్చేందుకు అనుమతి పొందుతారు. ఆపరేషన్ పారిస్ పేరిట మిన్నెసోటాలో వేలాది కేసులను మళ్లీ సమీక్షించడం, వేలాది ఫెడరల్ అధికారులను మోహరించడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. కాగా, అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఈ కొత్త విధానం కోర్టుల్లో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.

## జెఫ్రీపై వచ్చిన ఆరోపణల విచారణ పునఃప్రారంభం



**అల్‌బుకెర్కీ:** దివంగత ఆర్థికవేత్త జెఫ్రీ ఎప్‌స్టైన్ కొనుగోలు చేసిన జొర్రో రాంచ్ ఆస్తులు, అప్పట్లో వెల్లువెత్తిన అక్రమాల ఆరోపణలను అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్ర అటార్నీ జనరల్ రాల్ టొరెజ్ మళ్లీ విచారిరిస్తున్నారు. జెఫ్రీ పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన ఎఫ్‌బీఐ పత్రాలను పరిశీలించిన తరువాత, అప్పటి కేసును మరోసారి విచారించాలని నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. 2019లో న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్ల అభ్యర్థనపై రాష్ట్ర స్థాయి విచారణను నిలిపివేశారు. అయితే తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలు మరింత దర్యాప్తు అవసరమని రాష్ట్ర న్యాయ శాఖ భావిస్తోంది. రాష్ట్ర న్యాయ శాఖ ప్రకారం, ఈ కేసును సంపూర్ణంగా విచారించలేదని, కాబట్టి, అప్పటి ప్రాసిక్యూషన్ పత్రాలను వెంటనే అప్పగించాలని కోర్టును టొరెజ్ కోరారు. వివిధ సంస్థలతో కలిసి ఈ కేసును మళ్లీ విచారిస్తున్నట్టు తన అభ్యర్థన పత్రంలో ఆయన పేర్కొన్నారు. రాంచ్‌లో లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా వంటి ఘటనలు నిజంగానే జరిగాయా? లేదా? అనే అంశంపై టొరెజ్ నేతృత్వంలో దర్యాప్తు జరుగుతుంది. జెఫ్రీపై న్యూ మెక్సికోలో కేసులు నమోదు కాకపోయినప్పటికీ, 2019లో కొంత మంది బాధితులను అధికారులు విచారించినట్లు అప్పట్లో ధృవీకరించారు. జెఫ్రీ 1993లో, రాంచ్‌లో జెఫ్రీ భారీగా ఆస్తులు కొన్నాడు. అక్కడ ఒక విలాసవంతమైన భవనాన్ని కూడా నిర్మించాడు. 2023లో ఈ ఆస్తులను అమ్మకానికి పెట్టగా, డాన్ హఫైన్స్ కుటుంబం కొనుగోలు చేసింది. వారు దీనిని సాన్ రాఫెల్ రాంచ్‌గా పునర్నామకరణ చేసి క్రైస్తవ శిబిరంగా నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైతే విచారణకు పూర్తి సహకారం అందిస్తామని యజమానుల ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఎఐ వార్ రూమ్ (మొదటి పేజీ తరువాయి)

యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు (ఎఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో 'ప్రత్యేక ఎఐ మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. ఎఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఎఐ సమ్మిట్‌లో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్‌నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో సిఎం గుర్తు చేశారు. ఎఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచంలో ఎఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సిఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని సిఎం హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.దేశానికి తక్షణ జాతీయ ఎఐ రోడ్‌మ్యాప్ అవసరమని సిఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. ఎఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జిపియు సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఎఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్ల విషయంలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సిఎం సూచించారు.

**జాతీయ ఎఐ నిధి ఏర్పాటు చేయాలి**

ఎఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ చర్యల ద్వారా ఎఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. యువతను ఎఐ ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని సిఎం పిలుపునిచ్చారు. స్టార్టప్లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఎఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఎఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఎఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఎఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఎఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని సిఎం కోరారు.

## లక్షల కోట్లు ?

(మొదటి పేజీ తరువాయి)

కేటాయింపులు చేయడానికి వీలుగా వివిధ శాఖల అవసరాలను అంచనా వేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల అమలుపై దృష్టి సారిస్తూనే ఆ ప్రధాన రంగాలకు కేటాయింపులను హేతుబద్ధీకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆర్థిక శాఖ అధికారుల అంచనా ప్రకారం డిసెంబర్ చివరి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1.9 లక్షల కోట్లుగా నమోదైనట్లు తెలిసింది. ఇది బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.2.84 లక్షల కోట్లలో 67.01 శాతం. వసూళ్లలో ఎక్కువ భాగం, అంటే మూడింట ఒక వంతు, రూ.65,930 కోట్ల రుణాల రూపంలో ఉంది. బడ్జెట్ అంచనాలలో రూ.1.75 లక్షల కోట్లతో పోలిస్తే, మూడవ త్రైమాసికం చివరి వరకు పన్ను ఆదాయాలు రూ.1.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆదాయం రాబడి అంచనాలలో 80 శాతం కంటే ఎక్కువగా ఉండటంతో చివరి త్రైమాసికంలో పన్ను ఆదాయాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు విశ్వసిస్తున్నారు. ఇక కేంద్ర పన్నులలో రాష్ట్రం తన వాటాగా రూ.14,982 కోట్లు పొందింది, ఇది అంచనా వేసిన రూ.21,195 కోట్లలో 70.9 శాతం కాగా నాలుగవ త్రైమాసికంలో ఈ మొత్తం పెరిగే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**కేంద్రం నుంచి గరిష్ట నిధులు సాధించాలి**

కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ వికేంద్రీకరణల ద్వారా గరిష్ట నిధులను పొందడంపై దృష్టి పెట్టాలని అధికారులను ఇప్పటికే సిఎం ఆదేశించారు. తద్వారా రుణాలపై ఆధారపడటం, వడ్డీ చెల్లింపు భారం ఆ మేరకు తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2026–27లో కేంద్ర పన్నుల వాటాలో స్వల్ప పెరుగుదల రూ.33,181కోట్లకు పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఆర్థిక సంఘం దాదాపు రూ 6 వేల కోట్లు అందిస్తుందని భావిస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దగా ప్రయోజనాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపుల ఖరారులో జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించింది.

## అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ దాడులు



### 4 వాహనాలు సీజ్, 19 మంది అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. గురు, శుక్ర వారాల్లో వరుసగా నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో మూడు జిల్లాల్లో కొనసాగుతున్న ఇసుక మాఫియా నెట్‌వర్క్‌ను ఛేదించామని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భారీ యంత్రాలు, వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అరెస్టు చేశామన్నారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా కరీంనగర్, వరంగల్, ఆర్‌సి పురం ప్రాంతాలకు చెందిన విజిలెన్స్ బృందాలు సమన్వయంతో జగిత్యాల, హనుమకొండ, నిజామాబాద్ జిల్లాల్లోని కీలక మండలాల్లో దాడులు నిర్వహించాయి. జగిత్యాల జిల్లా బొమ్మెన గ్రామం, హనుమకొండలో కక్కిరాలపల్లి ఎక్స్ రోడ్డు–ఆకేరువాగు పరిసరాలు, నిజామాబాద్ జిల్లా సిరికొండ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు

**245 మెట్రిక్ టన్నుల ఇసుక స్వాధీనం**

అక్రమ తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న మొత్తం 24 వాహనాలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీటిలో 6ఎక్స్కవేటర్లు, 2లారీలు, 1టిప్పర్, 15 ట్రాక్టర్లు ఉన్నాయి. అదనంగా చట్టవిరుద్ధంగా తవ్విన సుమారు 245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో నిర్వాహకులతో కలిపి 30 మంది నిందితులను గుర్తించగా, వారిలో 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

**పగలు నిల్వ రాత్రి తరలింపు: మాఫియా వ్యూహం బట్టబయలు**

దర్యాప్తులో ఇసుక సిండికేట్ అమలు చేస్తున్న ద్విదశ వ్యూహం బయటపడింది. పగటిపూట ట్రాక్టర్ల ద్వారా నదీ గర్భాల నుంచి ఇసుక తవ్వి సమీపంలోని ప్రైవేట్ పొలాల్లో నిల్వ చేస్తుండగా, రాత్రివేళల్లో భారీ జెసిబిలతో లారీలు, టిప్పర్లలో వేగంగా లోడ్ చేసి తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విధంగా అధికారుల పర్యవేక్షణను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించారు.

రాష్ట్ర ఆస్తుల దోపిడీని అరికట్టడం, ప్రజా ఆదాయం పక్కదారి పడకుండా చూడడం తమ లక్ష్యమని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. ప్రభుత్వ వనరులకు సంబంధించిన అక్రమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 14432ను విడుదల చేశారు.

## రూ.13 వేల కోట్ల ఆన్‌లైన్ గేమింగ్ మాఫియా బట్టబయలు

### ఫేక్ కెవైసితో షెల్ కంపెనీలు
### భారీ సంఖ్యలో ఖాతాలు ఫ్రీజ్, కీలక వ్యక్తులు అరెస్టులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో భారీ ఆన్‌లైన్ గేమింగ్ సిండికేట్ మోసం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.13,000 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిపిన మాఫియాను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ)అధికారులు ఛేదించారు. ఈ కేసులో భాగంగా అడ్‌సమ్ అడ్వైజరి సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ పంకజ్ కుమార్‌ ను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఫేక్ కెవైసి ఆధారంగా షెల్ కంపెనీలను ఆన్‌బోర్డ్ చేసి, వాటి ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ పేరిట భారీగా డబ్బు సేకరించి మళ్లించినట్లు బయటపడింది. పేమెంట్ అగ్రిగేటర్లు, పేమెంట్ గేట్‌వేలు, ఫిన్‌టెక్ సంస్థల సహకారంతో యుపిఐ ఇంటిగ్రేషన్ ద్వారా అక్రమ నిధుల ప్రవాహం సాగినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని ఆర్థిక సంస్థలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియంత్రణలో ఉన్నప్పటికీ, మోసపూరిత వెరిఫికేషన్లు జరిగాయని అనుమానం వ్యక్తమవుతోంది. ఈ నేర లాభాల్లో పంకజ్ కుమార్ కూడా లబ్ధిదారుడిగా డిజిజిఐ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు భారీ సంఖ్యలో బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయగా, మరికొంతమంది కీలక మాస్టర్‌మైండ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనుబంధ సంస్థలు, ఫిన్‌టెక్ నెట్‌వర్క్‌లపై దర్యాప్తు కొనసాగుతోంది.ఈ కేసు దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో జరుగుతున్న ఆర్థిక మోసాలపై పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తుండగా, డిజిజిఐ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పదవి బిసిలకు ఇవ్వాలి

### బిసి నాయకులు యాదగిరిపై కిడ్నాప్ చేసి, దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేయాలి
### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ పార్టీకి ఏ మాత్రం బిసిల పట్ల చిత్తశుద్ధి ఉన్న, తక్షణమే జోక్యం చేసుకొని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా బిసిలకు అవకాశం కల్పించాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే బిసి నాయకులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేసి, దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం బిసి జెఎసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో జనరల్ స్థానం నుంచి కౌన్సిలర్‌గా గెలిచి, జనరల్ స్థానంలో మున్సిపల్ చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని బిసి సమాజవర్గానికి చెందిన యాదగిరి అడిగినందుకు బిఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎంఎల్‌ఎ మంచిరెడ్డి కిషన్ రెడ్డి జనరల్ స్థానంలో 'నువు బిసివి నీకెందుకు ఇస్తాం' అంటూ అవమానపరిచడమే కాకుండా యాదగిరిని కిడ్నాప్ చేసి, శారీరకంగా మానసికంగా హింసించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి బిసిలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.

**బిసిలు మున్సిపల్ చైర్మన్లు కాకూడదా? కెటిఆర్, సిఎం న్యాయం చేయాలి : ఆకుల యాదగిరి**

మూడుసార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి ఎంపిటిసిగా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పాటు నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తూ రాజకీయాలలో ఉన్న తనను బిఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అనగదొక్కాడని, మున్సిపల్ చైర్మన్ పదవి అడగగానే 'బిసిలకు ఎందుకు చైర్మన్ పదవి' అంటూ అవమానించడమే కాకుండా శారీరకంగా మానసికంగా తీవ్ర వేధింపులకు గురి చేశాడని, హైకోర్టు జోక్యంతో కిడ్నాప్ బారి నుండి బయటపడ్డానని ప్రస్తుత కౌన్సిలర్, బిసి నాయకుడు ఆకుల యాదగిరి అన్నారు.

ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ స్పందించి ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా బిసికి అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యామ్ కుర్మా, బి. మనిమంజరి సాగర్, గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విలీనం ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు లేకపోవడం సిబ్బందికి శాపంగా మారింది. బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే అదనపు భారం పడుతోంది. రోజుకు 16 నుంచి 18 గంటల పాటు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా డ్రైవర్లు, కండక్టర్లు గుండెపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఆక్యుపెన్సీ రేషియోకు అనుగుణంగా ప్రభుత్వం నుండి రావాల్సిన రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు..**

* చిన్న చిన్న సాంకేతిక కారణాలతో (టికెట్ మెషిన్ పనిచేయకపోవడం వంటివి) ఉద్యోగాల నుంచి తొలగించిన వెయ్యి మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.
* ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తీసుకోవడం మానేసి, పర్మినెంట్ నియామకాలు చేపట్టాలి. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా రద్దు చేసిన కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి. రిటైర్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్, కార్మికులు దాచుకున్న పొదుపు డబ్బును వెంటనే విడుదల చేయాలి.
* ఆర్‌టిసి ఆస్తులను, రూట్లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల కోసం డిపోలను, మౌలిక సదుపాయాలను ఆర్‌టిసివే వాడుకుంటూ లాభాలను మాత్రం ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే విధానాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఆర్‌టిసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, బడ్జెట్ సమావేశాల్లో దీనిపై స్పష్టమైన ప్రకటన రావాలని సామాన్య ప్రజలు సైతం కోరుకుంటున్నారు.

**ఆర్‌టిసి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలి: ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న**

కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి రెండు సంవత్సరాలు పూర్తయిన కూడా ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. ఛలో సెక్రటేరియట్ కార్యక్రమంతో ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో మిలియన్ మార్చ్ తరహా ఉద్యమం చేపడతామని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- కానిస్టేబుల్ సౌమ్య బలిదానం వృథా పోనివ్వం
- ఎక్సైజ్ అధికారుల డైరీ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 'మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోంది, ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయి. తలిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే మన లక్ష్యం కావాలి' అని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు.

**ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు..**

స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని జూపల్లి ప్రకటించారు. అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అభినందించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి అధికారులు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ఈ పోరాటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అధికారుల వెంటే ఉంటుందని, అవసరమైన వనరులు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన సహాయ సాకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క–సారలమ్మ జాతర

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- మేడారం జాతరపై కాఫీ బుక్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి పండుగ ప్రత్యేకత కలిగి ఉన్నప్పటికీ, మేడారం జాతర తన ప్రత్యేక వైభవంతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్. దనసరి అనసూయ సీతక్క అన్నారు. జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జానపద దేవత – సమ్మక్క సారలమ్మ జాతర కాఫీ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మంత్రి సీతక్క కాఫీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మల త్యాగగాథ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిందని, ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను తరతరాలు స్మరించుకుంటాయని మంత్రి అన్నారు. మేడారం జాతర అరుదైన చిత్రాలను సంకలనం చేసి కాఫీ బుక్ రూపంలో తీసుకువచ్చిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ గ్రంథంలోని ప్రతి చిత్రం ఒక చరిత్రను ప్రతిబింబిస్తోందని, ప్రపంచ పటంలో మేడారాన్ని నిలబెట్టిన ఫోటోగ్రాఫర్ల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. వరల్డ్ హెరిటేజ్ కట్టడంగా రామప్ప దేవాలయానికి గుర్తింపు దక్కడం తెలంగాణకు గర్వకారణమని, ఆ గుర్తింపు సాధనలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించిందని మంత్రి తెలిపారు. అదే విధంగా లివింగ్ హెరిటేజ్ విభాగంలో ఇప్పటికే బెంగాల్‌లో దుర్గా పూజ, దీపావళి పండుగలకు హెరిటేజ్ హోదా లభించిన నేపథ్యంలో, మేడారం జాతరకు కూడా అంతర్జాతీయ వారసత్వ గుర్తింపు తీసుకొచ్చేలా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మేడారం కాఫీ టేబుల్ బుక్‌కి తమ అద్భుత చిత్రాలతో తోడ్పాటు నిచ్చిన ప్రముఖ పేయింటర్ ఏలే లక్ష్మణ్, ఫోటోగ్రాఫర్లు రామ వీరేశ్ బాబు, పి.విజయ భాస్కర్ రెడ్డి, శరత్ బాబు, డి.ఎం. అర్జున్, శ్రీశైలం, అన్నవరం శ్రీనివాస్, సృజన్ పున్న, అనుమల్ల గంగాధర్, సత్యనారాయణ గొల్ల, డి.రవీందర్ రెడ్డి, కందుకూరి రమేష్ బాబు, వినీద్ బాబు వి, బిలుక ప్రభాకర్, ఎన్.ఆర్. సుధాకర్ గౌడ్ సేవలను కొనియాడారు. వారి ఫోటోలు జాతర వైభవాన్ని సజీవంగా ఆవిష్కరించాయని ప్రశంసించారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు కాఫిటేబుల్ బుక్ ఎడిటర్ బి.నర్సింగరావు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు బి.వి.పాపారావు, బి.పి. ఆచార్య, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎం.రతన్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, జె.శ్రీధర్ రావు తదితరులు హాజయ్యారు.

# మేయర్‌గా బిసి బిడ్డకు బాధ్యతలు

- బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎన్నికల వరకే రాజకీయాలు, తర్వాత అభివృద్ధే లక్ష్యం
- సిఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌పై ప్రత్యేక దృష్టి : మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా బిసి బిడ్డకు బాధ్యతలు అప్పగించామని, ఇది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని, జిల్లా అభివృద్ధిలో కాంగ్రెస్ మార్క్ కచ్చితంగా చూపిస్తామని బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత అభివృద్ధి తమ లక్ష్యమని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్‌గా కూరగాయల ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించారని, మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడం తమ బాధ్యత అన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత అభివృద్ధి తమ లక్ష్యమన్నారు. నగరంలోని అన్ని డివిజన్లకు సమన్యాయం చేయాలని మేయర్‌కు సూచించినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించారని, అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కూడా ఇవ్వాలని కోరామన్నారు. కార్యక్రమంలో సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి, కార్పోరేటర్లు పాల్గొన్నారు.

## విజె సాయి కెమికల్ కంపెనీలో అగ్నిప్రమాదం..

# కార్మికుడి సజీవదహనం





**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విజె సాయి రసాయన కంపెనీలో భద్రత ప్రమాణాల లోపం కారణంగా అగ్నిప్రమాదం జరిగి సీనియర్ కెమిస్ట్ మృతి చెందిన సంఘటన పోచంపల్లి మండలం దోతి గూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. డిఎస్పి మధుసూదన్ రెడ్డి, కంపెనీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ట్రోలిన్ రసాయనం కలిగిన డ్రమ్ము నుండి ఎర్త్ వేయకుండా డిప్పింగ్ రాడ్‌తో లెవెల్ చెక్ చేస్తున్న క్రమంలో రష్ కావడం చేత ఫైర్ జనరేట్ అయ్యి ఒక్కసారిగా డ్రం పేలింది. పక్కనున్న రసాయన డ్రమ్ముల మీద పడడంతో డ్రమ్ములు పేలి పెద్దగా మంటలు వ్యాపించి యూనిట్ మొత్తం అంటుకున్నాయి. ఆపరేటర్ సీనియర్ కెమిస్ట్ దార పవన్ (36) అక్కడికక్కడే మంటల్లో చిక్కుకొని సజీవదహనమయ్యాడు. మృతుడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామవాసి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వారు మంటలను ఆర్పేశారు. కానీ కార్మికుడి ప్రాణాలు మంటల్లో కలిసిపోయాయి. ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. సమాచారం అందుకున్న ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి డిఎస్పి, సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి, ఆర్‌ఐ గుత్తా వెంకట్ రెడ్డి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేస్‌కి తెలిపారు. కాగా మృతుడి భార్య సౌజన్య సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. భార్య, బాధిత కుటుంబ సభ్యులు కంపెనీ యజమాన్యం న్యాయం చేయాలని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కంపెనీలో బైఠాయించి ఆందోళన చేశారు. మృతుడికి నర్సరీ ఒకటవ తరగతి చదువుతున్న కూతురు కుమారుడు ఉన్నారు.

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి

# శాఖలో భారీగా పదోన్నతులు

మంత్రి సీతక్క చొరవ ఫలితం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి సీతక్క చొరవతో ఈ ప్రక్రియ వేగవంతమైంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఆమోదం తెలిపారు. తాజా నిర్ణయం ప్రకారం 27 మంది డిప్యూటీ సిఈఓలను సిఈఓలుగా పదోన్నతి కల్పించగా, 55 మంది ఎంపిడిఓలను డిప్యూటీ సిఈఓలుగా ప్రమోట్ చేశారు. చాలా కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అధికారులకు ఇది ఆనందకర పరిణామంగా మారింది. పదోన్నతులు పొందిన అధికారులు హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో మంత్రి సీతక్కను కలిసి సన్మానించారు. తమకు న్యాయం జరిగిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు అర్హత కలిగిన వారికి సమయానుకూలంగా పదోన్నతులు కల్పించడం తమ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. శాఖ బలోపేతం ద్వారా ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ఖాళీగా ఉన్న 28 ఎంపిడిఓ పోస్టుల నుంచి డిప్యూటీ సిఈఓలుగా, 15 మంది డిప్యూటీ సిఈఓల నుంచి సిఈఓలుగా పదోన్నతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎంపిడిఓల నుంచి కార్యాలయ సహాయకుల వరకు ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను దశలవారీగా భర్తీ చేసి, పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిఓ అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్ రా వు, సిఈఓ, డిప్యూటీ సిఈఓ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొంపల్లి నర్సింహులు, ఎంపిడిఓ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలపై వ్యాఖ్యలు సరికావు

సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేద వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు వ్యాఖ్యలు పేద వర్గాల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపే విధంగా ఉన్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మొండి బకాయిల పేరుతో బ్యాంకుల నుంచి కార్పొరేట్ సంస్థలు పొందిన లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు సుప్రీంకోర్టు ఎందుకు వ్యాఖ్యనించలేకపోయిందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు కార్పొరేట్స్‌కు ఊడిగం చేసి, వారికి సంపద పెంచి పోషించినా హైకోర్టు, సుప్రీంకోర్టు మాట్లాడలేదని కానీ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే అంశంలో వ్యాఖ్యలు చేసిందని అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు ఉపాధి లేనప్పుడు ప్రభుత్వాలు కచ్చితంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆ పథకాలు లేకపోతే వారు బతకడం కష్టమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ప్రజలను కించపర్చే విధంగా సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను ఇవ్వాలని, కార్పొరేట్స్‌కు దోచిపెడుతున్న సంపదను అడ్డుకట్ట వేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో యువతను మోసం

- లావోస్ దేశానికి అక్రమంగా తరలింపు
- మోసానికి పాల్పడ్డ నలుగురు అరెస్టు, పరారీలో ఒకరు
- వివరాలు వెల్లడించిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** విదేశీ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసి లావోస్ దేశానికి అక్రమంగా తరలించిన గ్యాంగ్‌ను జగిత్యాల జిల్లా పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శుక్రవారం గ్యాంగ్‌లోని నలుగురు సభ్యులను అరెస్టు చూపించి వారివద్ద నాలుగు సెల్‌ఫోన్లతో పాటు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకుని పూర్తి వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఒబులాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ విజయేందర్, సారంగపూర్ మండలం పెంబట్ల, ఒడ్డెర కాలనీలకు చెందిన మీసాల రాజశేఖర్, దండుగుల కళ్యాణ్, ధర్మపురికి చెందిన శ్యాంరావు రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్ ప్రాంతానికి చెందిన రాజు అనే ఐదుగురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడ్డారు. యువతకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అందినకాడికి దండుకుని మోసాలకు పాల్పడడం ప్రవృత్తిగా మార్చుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి గ్రామానికి చెందిన కేశవత్తుల అరవింద్ అనే యువకుడికి ఇస్లావత్ విజయేందర్ అనే వ్యక్తి, మరికొందరితో కలిసి లావోస్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నమ్మబలికాడు. దీంతో జగిత్యాలతో పాటు ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పలువురు యువకులు విజయేందర్ మాటలు నమ్మి పాస్‌పోర్టులతో పాటు నగదును తీసుకున్నాడు. థాయ్‌లాండ్ దేశానికి మొదటగా కొంతమంది యువకులను తరలించి అక్కడ ఉద్యోగం ఇస్తానని అక్కడి నుండి అక్రమంగా లావోస్ దేశానికి తరలించి సైబర్ ఫ్రాడ్ చేయాలని ఇదే మీ ఉద్యోగం అంటూ విజయేందర్ మోసానికి పాల్పడ్డాడు. బాధితుడు జగిత్యాల రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నిందితుడు విజయేందర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని శంశాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుకుని అరెస్టు చేశారు. పోలీసుల




విచారణలో విజయేందర్ 2024లో లావోస్ దేశం వెళ్లి సైబర్ ఫ్రాడ్ నెట్‌వర్క్‌లో చేరినట్లు గుర్తించారు. సైబర్ ఫ్రాడ్ నెట్‌వర్క్ సంస్థలో తెలిసిన యువకులను రిక్రూట్ చేస్తే రూ. 1.75 లక్షల కమీషన్లను ఇస్తామని విజయేందర్‌కు ఆఫర్ ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో విజయేందర్ పలువురి యువకులను బ్యాంకాంగ్ కాల్ సెంటర్ ఉద్యోగం పేరుతో థాయిలాండ్‌కు తరలించి అక్కడ చైనా కంపెనీల ఆధ్వర్యంలో నడుస్తున్న సైబర్ కాల్ సెంటర్లలో పనిచేయాలని యువకులను బలవంతం చేసేవాడని ఎస్పీ వివరించారు. అమెరికాలోని ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు చేసేలా యువకులను మోసం చేసినట్లు వివరించారు. ఈ కేసులో విజయేందర్ అనే వ్యక్తి తన స్నేహితులైన రాజశేఖర్, కళ్యాణ్, శ్యాంరావు రాజశేఖర్, రాజుల సహాయంతో జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురి యువకులను మోసం చేసినట్లు గుర్తించామని ఎస్పీ పూర్తి వివరాలు వెల్లడించారు. నిందితుల్లో రాజు పరారీలో ఉండగా నలుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. విదేశీ ఉద్యోగాలు, త్వరితగతిన వీసాలు ఇస్తామని చెప్పే ఏజెంట్ల చేతుల్లో యువత మోసపోవద్దని ఎస్పీ అశోక్ కుమార్ కోరారు. ఈ సమావేశంలో సైబర్ క్రైం డీఎస్పీ వెంకట రమణ, జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు ఉమాసాగర్, దినేష్ తదితరులు ఉన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు సర్కిల్–46, శేరిలింగంపల్లి జోన్

**Short Tender Notice No. Engg-33/CMC/PTC-C-46/2025-26, తేది: 20.02.2026**

NIT No. Engg-33/CMC/PTC-C-46/2025-26, తేది: 05.02.2026, పని పేరు: 02 పనుల కొరకు సిసి రోడ్లు & బిటి రోడ్ల నిర్వహణ, అంచనా విలువ / ఇసివి : రూ.16.00 లక్షలు, డౌన్‌లోడ్‌కు ప్రారంభ తేది : 21.02.2026న ఉ.10.30గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 24.02.2026న మ.3.00గం.ల వరకు. ఇ.ఇ. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఫోన్ నెం. 9154167950. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 15706-PP/CL/ADVT/1/2025-26, Date: 20-02-2026

**రామగుండం నగర్ పాలక సంస్థ**

బహిరంగ ప్రకటన

నెం. G1/217/TPS/RMC/2026 తేదీ: 18-02-2026

విషయము: రామగుండం నగర పాలక సంస్థ - పట్టణ ప్రణాళిక విభాగము - భూమి వినియోగ మార్పు - అనగా నివాస యోగ్య భూమి వినియోగము నుండి వాణిజ్య యోగ్య భూమి వినియోగము నకు సర్వే సంఖ్య 133 మరియు 137 లో 2927.66 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న భూమి మల్కాపూర్ శివారు, ఎన్‌టీపీసీ పర్మనెంట్ టౌన్ షిప్- ప్రకటన - ప్రచురనార్థము - గురించి

సూచిక :
1. సంచాలకులు, పట్టణ ప్రణాళిక శాఖ గారి లేఖ సంఖ్య: 2231/2025/W (799763), తేదీ: 11-06-2025
2. ప్రభుత్వ మేమో సంఖ్య: 10822/Plg.II/2025, తేదీ: 08-07-2025
3. సంచాలకులు, పట్టణ ప్రణాళిక శాఖ గారి లేఖ సంఖ్య: 2231/2025/W (799763), తేదీ: 18-08-2025.
4. భూ వినియోగ మార్పు కమిటీ నిర్వహించిన మినిట్స్ సమావేశం, తేదీ: 26-08-2025.
5. ప్రభుత్వ మేమో సంఖ్య: 10822/Plg.II/2025, తేదీ: 29-09-2025.
6. సంచాలకులు, పట్టణ ప్రణాళిక శాఖ గారి లేఖ సంఖ్య: 2910/2025/W ( 809485), తేదీ: 15-11-2025.
7. ప్రభుత్వ మేమో సంఖ్య: 10822/Plg.II/2025, తేదీ: 03 -01 -2026.

***

ఇందు మూలముగ రామగుండం నగర పాలక సంస్థ పరిధి లోని ప్రజలకు తెలియజేయునది ఏమనగా తెలంగాణ ప్రభుత్వము మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వారు తమ మేమో సంఖ్య 10822/Plg.II/2025, తేది: 03-01-2026 ఎన్‌టీపీసీ పర్మనెంట్ టౌన్ షిప్, సర్వే సంఖ్య. 133 మరియు 137 లో 2927.66 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న భూమి మల్కాపూర్ శివారు, నివాస యోగ్య భూమి వినియోగము నుండి వాణిజ్య యోగ్య భూమి వినియోగము లోనికి సదరు భూమి వినియోగాన్ని మార్పు నిమిత్తము ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఈ ప్రకటన అనుసరించి గల ముసాయిద తేడా (డ్రాఫ్ట్ వేరియేషన్) షెడ్యూల్ ను ఈ క్రింద జతపరచనైనది. ఎవైన అభ్యంతరములు మరియు సూచనలు ఉంటే (15) రోజుల లోపు నేరుగా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ, తెలంగాణ, సచివాలయము, హైదరాబాద్ వారికి పంపవచ్చును.

హద్దుల షెడ్యూల్ :
ఉత్తరము : ఎన్‌టీపీసీకి చెందిన భూమి
దక్షిణము : 12.00 మీటర్ల వెడల్పు గల రోడ్డు
తూర్పు : ఎన్‌టీపీసీకి చెందిన భూమి
పడమర : 14.00 మీటర్ల వెడల్పు గల రోడ్డు

సం/- కమీషనర్
రామగుండం నగర పాలక సంస్థ

DIPR R.O. No. : 15668-PP/CL/ADVT/1/2025-26 Date: 20-02-2026

## ప్రతిపక్ష పార్టీలుగా బిజెపి, బిఆర్ఎస్ విఫలం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిపక్ష పార్టీలుగా బిజెపి, బిఆర్ఎస్ విఫలమయ్యాయని, అందుకే ప్రజలకు ఇష్టం లేకపోయినప్పటికీ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జ్యోతి రావు పూలే విగ్రహం ట్యాంక్‌బండ్‌తోపాటు అసెంబ్లీలో కూడా పెట్టాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూ పార్క్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు పనులను కవిత శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, బిసి బిల్లుల ఆమోదం కోసం ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలని సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యార్థుల పరీక్షలను కూడా పట్టించుకోకుండా వరుస ఎన్నికలు పెడుతున్నారన్నారు. బడ్జెట్‌లో బిసిలకు రూ.20 వేల కోట్ల నిధులను కేటాయించి వాటిని పూర్తిగా ఖర్చు చేయాలని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై కేవలం ఒక పూలే విగ్రహమే ఏర్పాటు చేస్తారా? లేదా సావిత్రిభాయితో కలిపి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారా అనే అంశంపైన ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించలేదని, రానున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లోనైనా 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నారు. బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ తల్లి కాదని, బలవంతంగా ఒక ప్రతీకను ప్రజల మీద రుద్దే ఏ ప్రభుత్వాన్ని ప్రజలు హర్షించబోరన్నారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

# వయోపరిమితి 61 ఏళ్లకు పెంచాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్మినెంట్ ఉద్యోగుల తరహాలోనే కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. యూనియన్ పోరాట ఫలితంగానే కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు లోనికి వచ్చిందన్నారు. టూరిజంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం పెంచిన సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతిని శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలలో కొంత వరకు ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయని చెప్పారు. రానున్న రోజులలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాధించుకుంటామన్నారు. ఈ సందర్భంగా టూరిజం యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతి, మధుర, మౌలాలి, హేమ, రషీద్, చైతన్య, రమేష్, రమాదేవి, సుధాకర్, విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, బాల్ రెడ్డి, అనిత, నేత్ర, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎం) కార్యాలయం, ఎంఎంసి(హెచ్‌క్యూ), తార్నాక హుడా కాంప్లెక్స్, హైదరాబాద్.
ఇ-మెయిల్: eem.mulhq@gmail.com

కొటేషన్ నోటీసు

కొటేషన్ నోటీసు నం. EE/MMC(HQ)/2025-26/05, తేదీ: 19-02-2026

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది. వీటిని తేదీ 21-02-2026న లేదా అంతకుముందు కింద సంతకం చేయబడిన వారికి తప్పక అందజేయాలి. కొటేషన్‌ను తేదీ21-02-2026న లేదా అంతకుముందు సాయంత్రం 4గంటల వరకు స్వీకరించబడుతుంది. అది సాయంత్రం 4-30గంటలకు తెరువబడుతుంది. ఇతర వివరాలను ఆఫీసు పనివేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (M) నుండి పొందగలరు.

| క్ర. సం. | వివరణ | యూనిట్ | కొటేషన్ ధర (రూ.) |
|---|---|---|---|
| 1 | ప్రతీబోర్డుపై శామ్‌సంగ్ బ్యాక్ LED లైట్లను అమర్చడంతో పాటు SS గోల్డ్ లెటర్స్‌తో 3mm తెల్లటి ACP షీట్ బ్యాక్ గ్రౌండ్ MS ఫ్రేమ్ ఫ్యాబ్రికేషన్ సరఫరా ఫిక్సింగ్ మరియు బోర్డు పరిమాణం 50'-0"X 6'-0" వర్షానికి నిరోధకత కలిగిన విద్యుత్ సరఫరా. | 1 నెం. | |
| 2 | ప్రతీ బోర్డుపై రెండువైపులా శామ్‌సంగ్ బ్యాక్ LED లైట్ల సంస్థాపనతో SS గోల్డ్ లెటర్స్‌తో 3mm తెల్లటి ACP షీట్ బ్యాక్ గ్రౌండ్ MS ఫ్రేమ్ ఫ్యాబ్రికేషన్ సరఫరా మరియు ఫిక్సింగ్ మరియు బోర్డు పరిమాణం 24'-0"X 6'-0" వర్షానికి నిరోధకత కలిగిన విద్యుత్ సరఫరా. | 2 నెం.లు | |
| 3 | ప్రతీ బోర్డుపై శామ్‌సంగ్ బ్యాక్ LED లైట్ల సంస్థాపనతో SS గోల్డెన్ లెటర్స్‌తో 3mm తెల్లటి ACP షీట్ బ్యాక్ గ్రౌండ్ MS ఫ్రేమ్ ఫ్యాబ్రికేషన్ సరఫరా మరియు ఫిక్సింగ్ మరియు బోర్డు పరిమాణం 14'-0"X 6'-0" వర్షానికి నిరోధకత కలిగిన విద్యుత్ సరఫరా. | 1 నెం. | |

షరతులు:
1. కొటేషన్లు 21-02-2026న లేదా అంతకుముందు సాయంత్రం 4గంటల వరకు స్వీకరించబడతాయి. వాటిని 4.30గంటలకు హైదరాబాద్ తార్నాకలోని హుడాకాంప్లెక్స్‌లో MMC (హెడ్‌క్వార్టర్స్)లోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (M) కార్యాలయంలో తెరువబడును.
2. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC (హెడ్‌క్వార్టర్స్)కి ఏ కారణం చేతనైనా కొటేషన్లను రద్దు చేసే హక్కు ఉంటుంది.

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M), MMC(HQ), తార్నాక, MMC, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (M)
MMC(HQ), తార్నాక.

DIPR R.O. No. : 15722-PP/CL/ADVT/1/2025-26, Date: 20-02-2026

## కన్నతండ్రిని కడతేర్చిన కసాయి కొడుకు

తాగుడు మత్తులో దారుణం -సమభావన సంఘం డబ్బులపై వివాదం



**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెం గ్రామంలో గురువారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. తాగుడు మత్తులో కుమారుడు కన్న తండ్రిని హత్య చేసిన సంఘటన స్థానికులను కలచివేసింది.గ్రామానికి చెందిన బుర్రె సత్తయ్య యాదవ్ (60) భార్య లింగమ్మ (55) అవసరాల కోసం సమ భావన సంఘం నుంచి కొంత మొత్తాన్ని తీసుకుంది. ఆడబ్బులు తనకు ఇవ్వాలని కుమారుడు బుర్రె బాలకృష్ణ (32) తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. మద్యం కోసం డబ్బులు కావాలని అతడు ఒత్తిడి చేసినట్లు సమాచారం. మాటల తగాదా తీవ్రరూపం దాల్చడంతో బాలకృష్ణ ఇంట్లో ఉన్న తండ్రి సత్తయ్యను బయటకు లాగి సీసీ రోడ్డుపై బలంగా నెట్టివేశాడు. తలకు తీవ్ర గాయమై సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.బాలకృష్ణకు మద్యం, గంజాయి అలవాటు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిత్యం మద్యం సేవించి ఇంట్లో గొడవలు సృష్టించేవాడని తెలిపారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

అధికారుల కనుసన్ననలో ఇసుక అక్రమ రవాణా

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలోని బిక్కేరువాగు నుండి ఉదయం రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ వాగు నుండి ఇసుకను మొత్తం తోడేస్తున్నారని, అధికారుల కనుసన్ననలో ఈ అక్రమ ఇసుక దందా సాగుతూ మూడు ట్రాక్టర్లు ఆరు టిప్పర్లుగా కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురుస్తుందని అధికారుల మామూళ్ల మత్తులో మునిగి ఇసుకను మొత్తం వాగు నుండి తోడేస్తుండడంతో కాలువపై ఆధారపడి పంటలను పండిస్తున్న రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని, వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో ఇసుక మొత్తం వాగు నుండి తోడేస్తే వాగు చుట్టుపక్కల గ్రామాలలో రైతులు వేసిన పంటలకు భూగర్భ జలాలు లేక ఎండిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బొట్ల సుదర్శన్ ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

## నల్లగొండ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ని సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి శుక్రవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్‌కు శాలువా కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా ఆదిరెడ్డి మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా వంటి అంశాలలో మేయర్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో శాంతి సంఘీభావ సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ కయ్యూం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 రిజర్వేషన్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు

బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాబోయే ఎంపిటిసి,జడ్‌పిటిసి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి లకు పాత విధానంలో 17 శాతం మాత్రమే అమలు చేసి ఎన్నికలకు వెళితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం అవుతాయని అన్నారు.42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.గత ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు,ధర్నాలు, ర్యాలీలు,నిరాహార దీక్షలు,రౌండ్ టేండ్ సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడబోయిన సాయికుమార్,అనంత్ నాగరాజుగౌడ్,కొంపెల్లి రామన్న గౌడ్,కుందారపు శివ,తాడూరి మహేష్,వీరేటి కృష్ణ,అంబటి స్వామి,భాషపాక శ్రీహర్ష,బైరగోని చందు,గుండబోయిన చరణ్ తేజ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సిఎం కప్ కబడ్డీ పోటీలకు చెరుకుపల్లి విద్యార్థులు

**ప్రజాపక్షం/డిండి;** నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సిఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గుండ్లపల్లి మండలం, చెరుకుపల్లి జెడ్పిహెచ్ఎస్ విద్యార్థినులు ఎంపికయ్యారు. కబడ్డీ బాలికల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఇస్లావత్ మౌనిక పదవ తరగతి, జర్పుల రేణుక, తొమ్మిదవ తరగతి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ (బాలికల విభాగం) ఇస్లావత్ మౌనిక, జర్పుల రేణుక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెరుకుపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను మండల విద్యాశాఖ అధికారి ఇస్లావత్ గోప్యానాయక్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వకారణం అని, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటి జిల్లా కు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.




# కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో వరుస విజయాలతో దూసుకుపోతూ కాంగ్రెస్ బలమైన శక్తిగా ఎదుగుతుందని ప్రజల్లో బలమైన విశ్వాసం పెరిగిందని రానున్న రోజుల్లో రెండో దఫా రాష్ట్రంలో అధికారం చేపడుతుందని రెండవసారి రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అవుతారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన తడక వెంకటేశ్వర్లు పదవి బాధ్యల స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీ చైర్మన్లు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం అభివృద్ధి సంక్షేమానికి ఓటర్లు జై కొట్టారని సంతోషం వ్యక్తం చేశారు. తను ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది సంవత్సరాల్లోనే పోచంపల్లి పట్టణానికి దాదాపు రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసి మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు : చైర్మన్**

పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోచంపల్లి మున్సిపాలిటీలో అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా డాక్టర్లను నియమించాలని ఎమ్మెల్యేని కోరారు. విద్యార్థులు, వ్యాపారస్తులు నిత్యం పట్టణానికి హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారిలో వాళ్లకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు బస్సులు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్స్ కొండమడుగు ఎల్ల స్వామి, రావుల జంగయ్య, దేవరాయ కుమార్, జింకల లావణ్య, యాదగిరి ముదిరాజ్, సూరేపల్లి రాధిక రమేష్ పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లాలో డ్రగ్స్ అరికట్టేందుకు చర్యలు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో డ్రగ్స్ వినియోగం , అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలల్లో కొత్తగా ఎన్ని కేసులు నమోదు అయ్యాయని ఆరా తీసి డ్రగ్స్ ఏమైనా పట్టుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మూత పడిన కంపెనీలు, చిన్న చిన్న కంపెనీల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. మూత పడిన కంపెనీలలో ఏమైనా డ్రగ్స్ తయారీ, సరఫరా చేస్తున్నారా అని తనిఖీ చేసి రీ ఓపెన్ చేస్తే కేసులు నమోదు చేసి తగు చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ షాపులు కూడా నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పడినందున సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా సర్పంచ్‌లకు కూడా మత్తు పదార్థాల నియంత్రణ పై శిక్షణ ఇచ్చి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మున్సిపాలిటీలలో కొత్త పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి కాబట్టి వార్డ్ మెంబర్‌లకు కూడా అవగాహన కల్పించి వార్డులలో ఏమైనా గంజాయి, మత్తు పదార్థాలు వాడుతున్నా, ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో అంద రూ సమన్వయంతో డ్రగ్స్ నిర్మూలన జిల్లాగా ఉండేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీ నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహ రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

మేకల అభినవ్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సిఎం కప్ ఖో..ఖో పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలోరాష్ట్రస్థాయి సీఎం కప్ ఖో..ఖో క్రీడా పోటీలను కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు.క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలు క్రీడాకారులకు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు పేద విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటూ ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో..ఖో.. పోటీలు నిర్వహించడం 33 జిల్లాల క్రీడాకారులు కష్టపడి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి విద్యార్థులను గుర్తించి తోడ్పడదించడమే సిఎం కప్ పోటీల ముఖ్య ఉద్దేశం అని అన్నారు.రాష్ట్రస్థాయిజూనియర్ బాలికలకు, బాలురకు కోకో పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు.

# పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

ఇంటర్ విద్య జాయింట్ డైరెక్టర్ భీమ్‌సింగ్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఇంటర్ విద్య జాయింట్ డైరెక్టర్ భీమ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిఐఈఓ భానునాయక్ అధ్యక్షతన నిర్వహించిన సిఎస్ డిఓల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పరీక్షలకు గత మూడు నెలలుగా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి కళాశాలలో అధ్యయన తరగతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కళాశాలలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరెంట్ డిపార్టుమెంట్ ఆఫీసర్‌తోపాటు ప్రైవేటు జూనియర్ కళాశాల సెంటర్లలో ఏసిఎస్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను మానిటరింగ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష కేంద్రాలలో ఉన్న సిసి కెమెరాలను అనుసంధానం చేసి హైదరాబాద్ కమీషనరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ప్రత్యేకంగా 13 ఒకేషనల్ సెంటర్లు ఏర్పాటు చేయగా అందులో మూడు ప్రత్యేక సెంటర్లు ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా అనుభవం ఉన్న అధ్యాపకులను నియమించినట్లు వివరించారు. డిఐఈఓ భాను నాయక్ మాట్లాడుతూ ఈసారి పరీక్షలకు అనుభవజ్ఞులైన సీనియార్టి అధ్యాపకులను బోర్డు నుంచే నియమించినట్లు తెలిపారు. సిఐఆర్‌టి ప్రకారం జాబితాలను బోర్డుకి పంపించగా ర్యాండమైజేషన్‌లో అధ్యాపకులకు డ్యూటీలు వేశారని పేర్కొన్నారు. శుక్రవారం నుంచే నియమించబడిన ఉద్యోగులు వారి వారి డ్యూటీలో జాయిన్ కావాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చైర్మన్‌గా, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు నిరంతరం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సీనియర్ అధ్యాపకుల బృందం ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. సిఎస్‌డిఓలుగా నియమింపబడిన అధ్యాపకులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి విధిగా పేపర్లు తీసుకురావడం పరీక్షలు పూర్తయిన తరువాత మళ్లీ పోస్ట్ఆఫీసులో డిపార్ట్ చేయడం వారి బాధ్యత అన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగిన సిఎస్‌డిఓలతోపాటు గదులలో మాల్ ప్రాక్టీస్ నిర్వహిస్తే ఇన్విజిలేటర్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసి సభ్యులు రాజమోహన్, వీడిసి ప్రసాద్, ప్రిన్సిపాల్స్ పెరుమాళ్ల యాదయ్య, విజయ నాయక్, మారం హరిప్రసాద్, మృత్యుంజయ, మద్దిమడుగు సైదులు, శీను పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రారంభిస్తున్న శ్రీలేఖ హస్పటల్ యాజమాన్యం మెరుగైన వైద్యసేవలందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు సూచించారు. శుక్రవారం హుజూర్‌నగర్ రోడ్డులో చైర్‌పర్సన్ ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడారు. లక్షలాది రూపాయలు వెచ్చించి చికిత్స నిమిత్తం దూర ప్రాంతాలకు వెళాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని హంగులతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఆర్థిక పరిస్థితులను గమనించి రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ వ్యాపార దృక్పదంతో రోగులకు సేవలందించాలన్నారు. ఎండి, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు మీసా రోహిత్, ప్రసూతి వైద్యురాలు కూరపాటి శ్రీలేఖతో పాటు మరో ఇరువురు యువ వైద్యులు సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కారింగుల అంజన్‌గౌడ్, డాక్టర్ దశరథ, వైద్యులు రామారావు, అశోక్, గౌరినాథ్, ప్రసాద్, కరుణశ్రీ, సురేష్, కొత్తమాసు జానార్ధన్ పాల్గొన్నారు.



## నల్లగొండ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్

కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలో సహజ,ఆధ్యాత్మిక,చారిత్రక ప్రాధాన్యత గల ప్రదేశాలను అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో టూరిజం పై నిర్వహించిన సమావేశంలో పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు.పచ్చల ఛాయా సోమేశ్వర ఆలయం, లతీఫ్ సాబ్ గుట్ట, కాపురాల గుట్టపై రోప్‌వే ఏర్పాటు, డిండి ప్రాజెక్ట్ వద్ద బోటింగ్ సదుపాయాల విస్తరణ,దేవరచర్ల శివాలయం, కాశిరాజుపల్లి ఏలేశ్వరం, ఏకేబీఆర్ అజిలాపురం జలపాతం, పాలెం లక్ష్మీనరసింహాస్వామి ఆలయం,నెల్లికల్లు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాలను అభివృద్ధి చేసే అంశాలపై చర్చించారు. గుట్టల ప్రాంతాల్లో రోప్‌వేలు, వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక అనుభవం కల్పించాలని, సంబంధిత ప్రాజెక్టులకు సాంకేతిక సాధ్యత నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.జలపాతాలు,అడవి ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేసి ప్రకృతి సంరక్షణకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఏఎస్పీ రమేష్, ఆర్డీవోలు, జిల్లా యువజన క్రీడల అధికారి అక్బర్ అలీ, బుద్ధవనం ఇంచార్జ్ శ్యాంసుందర్,టూరిజం,అటవీ,ఆర్కియాలజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పారిశ్రామిక సంస్థలు,రైస్ మిల్లర్లు,వాణిజ్య బ్యాంకులు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అవసరమైన రంగాలలో క్రమ పద్ధతిలో జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా అతిపెద్ద జిల్లా అని ,అనేకమంది నిరు పేదలకు వివిధ రంగాలలో సహకారం అవసరం ఉందని,దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా విద్య,వైద్యం,సంక్షేమ రంగాలలో పేద ప్రజలకు సహకారం అందించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పరిశ్రమలు,రైస్ మిల్లులు,వాణిజ్య బ్యాంకుల వంటివి సంస్థలు ముందుకు రావాలని కోరారు.ఒకే ప్రాంతంలో, కొన్ని రంగాలలో మాత్రమే పారిశ్రామిక సంస్థలు, ఇతరులు సిఎస్ఆర్ నిధులు అందజేయడం వల్ల ఒక ప్రాంతం మాత్రమే అభివృద్ధి చెందుతుందని,అలా కాకుండా ఒక క్రమ పద్ధతిలో అన్ని రంగాలలో సహకారం అందిస్తే బాగుంటుందని తెలిపారు.ఇందుకుగాను ఆయా పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు,బ్యాంకర్లు, రైస్ మిల్లర్లు అంగీకరించడమే కాకుండా జిల్లా కలెక్టర్ చర్యకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్,వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు,రైస్ మిల్లర్లు,బ్యాంకు నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

## తప్పని యూరియా తిప్పలు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని శెట్టి పాలెం గ్రామానికి చెందిన రైతులు యూరియా కోసం కోఆపరేటివ్ బ్యాంకు దగ్గర పడిగాపులుగా, రైతులు తెలిపిన వివరాల ప్రకారం పంట చేతికి వచ్చే దశలో యూరియా అందక పంట అంతా నేలపాలయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని గత పది రోజులుగా యూరియా కోసం ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ కోఆపరేటివ్ బ్యాం కు చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నామన్నారు. ప్రతిరోజు కోపరేటివ్ బ్యాం కు అధికారులు సాయంత్రం వస్తుంది రేపు ఉదయం 6 గంటలకు వస్తుందని కాలం వెళ్లదీస్తున్నారు తప్ప యూరియా అందించలేకపోతున్నారన్నారు.



# యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

మత్స్యావతారంలో మెరిసిన స్వామివారు!

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** లోక రక్షకుడైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీస్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శోభాయమానంగా అలంకరించిన మత్స్యావతార మూర్తిని తిరువీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు నీరాజనాలు పలికారు.

**మత్స్యావతార విశిష్టత..**

శ్రీమన్నారాయణుని దశావతారాల్లో మొదటిదైన మత్స్యావతారం భక్త రక్షణకు ప్రతీక. వేదాలను అపహరించిన సోమకాసురుడిని సంహరించి, సృష్టి చక్రం ఆగిపోకుండా బ్రహ్మదేవునికి వేదాలను అప్పగించిన ఘట్టాన్ని ఈ అలంకారం స్మరింపజేస్తుంది. లోకమంతా తన సంతానమని, వారిని తన చల్లని చూపులతో సంరక్షించే పరమాత్మ తత్త్వం ఈ అవతారంలో దాగి ఉందని అర్చకస్వాములు తెలిపారు. ఘనంగా నిర్వహించిన అధికారులు, పండితులు.. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితుల బృందం ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్యనిర్వహణాధికారి భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఉప కార్య నిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**రాత్రి 'శేష వాహన' సేవ..**

రాత్రి స్వామివారు పడగ విప్పిన ఆదిశేషునిపై శేష వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.భూమండలాన్ని తన శిరస్సుపై మోసే ఆదిశేషుడు, భగవంతునికి శయ్యగా, ఆసనంగా, పాదుకలుగా కైంకర్యం చేస్తూ భక్తులకు సేవాభావాన్ని చాటి చెబుతారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఈ వాహన సేవ నిర్వహించడం విశేషం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు కనువిందు చేస్తున్నాయి.



## తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త



**వ్యవసాయం, విద్యలో 'ఎఐ సాంకేతికత'పై ఎఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఒలతో ప్రధాని మోదీ చర్చ**

**న్యూఢిల్లీ :** వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం, వివిధ రంగాలలో కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించుకునే అవకాశాల గురించి శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఒలతో చర్చించారు. ప్రధానమంత్రి మోదీతో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో 16మంది ఎఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల సిఇఒలు, వ్యవస్థాపకులు తమ ఆలోచనలు, పని వివరాలను విపులీకరించారు. ఈ సందర్భంగా మోదీ బలమైన డేటా గవర్నెన్స్ ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తప్పుడు సమాచారం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. భారతదేశ అవసరాలకు అనుగుణంగా పరిష్కారమార్గాలను అన్వేషించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ యుపిఐని సరళమైన, విస్తరించదగిన డిజిటల్ ఆవిష్కరణలకు ఒక నమూనాగా పేర్కొన్నారు. భారతీయ కంపెనీలపై విశ్వాసాన్ని, దేశీయ ఉత్పత్తులపై నమ్మకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అంతరిక్షరంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రభుత్వం విస్తరిస్తున్న తీరును మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి వివిధ రంగాలలో ఆర్టిఫీషియల్ టెక్నాలజీని ఉపయోగించుకునే సామర్థ్యాన్ని, పంట ఉత్పాదకతను పర్యవేక్షించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ఎరువుల వినియోగాన్ని గురించి ప్రధానమంత్రి వారితో లోతుగా చర్చించారు. భారతీయ భాషలు, సంస్కృతిని ప్రోత్సహించడం ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. మాతృభాషలో ఉన్నత విద్య కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను విస్తరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. సాహసోపేతమైన రిస్క్‌లను స్వీకరించి ప్రభావవంతమైన పరిష్కారాలను నిర్మించినందుకు మోదీ ఆవిష్కర్తలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ గ్రూప్‌లో సైబర్ భద్రత, నైతికత, అంతరిక్షం, న్యాన్ని స్థానిక భాషలో యాక్సెస్ చేయడం ద్వారా సామాజిక సాధికారతపై దృష్టి సారించిన వెంచర్‌లు ఉన్నాయి. ఈ రౌండ్ టేండ్ సమావేశానికి ఎబ్రిడ్జి, అదాలత్ ఎఐ, బ్రెయిన్ సైట్ ఎఐ; ఎకాకేర్, గ్లీన్, ఇన్నోగిల్, ఇన్‌వీడియో, మైకో, ఒరిజిన్, ప్రోఫేజ్, రాసెన్, రుబ్రిక్, సాట్‌స్యూర్, సూనర్‌నోవా, సైఫా ఎఐ సిఇఒలు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పి.కె.మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ2 శక్తికాంత దాస్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

### భారత్-అమెరికా మధ్య ఒప్పందం

# త్వరలో కార్యరూపం

- ఏప్రిల్‌లో అమలులోకి రానుందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వెల్లడి
- వచ్చేవారం వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రధాన సంధానకర్తల సమావేశం

**న్యూఢిల్లీ:** భారతదేశంఅమెరికా నడుమ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి త్వరలోనే ఒక ముందడుగు పడనుంది. ఇరుదేశాల మధ్య ఈ మధ్యంతర వాణిజ్య ఒప్పందం మార్చిలో కుదిరే అవకాశం ఉందని, ఈ ఒప్పందం ఏప్రిల్‌లో అమలులోకి రానున్నదని శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. భారతదేశంఅమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కోసం ఈ నెల ప్రారంభంలో ఒక ముసాయిదాను ప్రకటిస్తూ ఇరుదేశాలు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశ విధివిధానాలను ఖరారు చేయడానికి ఇరుదేశాలకు చెందిన ప్రధాన సంధానకర్తలు వచ్చే వారం వాషింగ్టన్‌లో సమావేశం కానున్నారు. రెండు టీమ్‌ల మధ్య మూడు రోజుల సమావేశం ఫిబ్రవరి 23న ప్రారంభం కానుంది. పియూష్ గోయల్ ఇ క్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఒప్పందంపై మార్చిలో సంతకం చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అయితే ఏప్రిల్‌లో అమలు జరిగే అవకాశం కూడా లేక పోలేదని వివరించారు. ఇక్కడ జరిగిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో యుఎస్ అంబాసిడర్ సెర్జియో గోర్ మాట్లాడుతూ భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై త్వరలో సంతకం చేయనున్నట్లు చెప్పారు. కీలకమైన ఖనిజాల కోసం స్థిరమైన సప్లయ్ చెన్‌ను నిర్మించే లక్ష్యంతో భారతదేశం అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమి 'పాక్స్ సిలికా'లో శుక్రవారం చేరింది. వాణిజ్య ఒప్పందం నుండి 'పాక్స్ సిలికా'వరకు రక్షణ సహకార



రంగంలో మన రెండు దేశాలు కలిసి పనిచేయడానికి ఉన్న సామర్థ్యం నిజంగా అపరిమితమైనదని సెర్జియా గోర్ వ్యాఖ్యానించారు. ఈనెల ప్రారంభంలో భారతదేశంఅమెరికా ఇరుదేశాలు విడివిడిగా విడివిడిగా విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన మధ్యంతర వాణిజ్య ఒప్పందం రూపురేఖలను నిర్దేశిస్తుందని, ఇవి ఇప్పుడు చట్టపరమైన ఒప్పందంగా అనువదించబడ్డాయని, దీనికోసం ఇరుపక్షాలు వచ్చే వారం సమావేశం కానున్నాయన్నారు. భారతదేశం బృందానికి ప్రధాన సంధానకర్తగా దార్పన్ జైన్ నేతృత్వం వహిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం ఇరుదేశాలు తమ మధ్య వర్తకం జరిగే అనేక వస్తువులపై పరస్పరం సుంకాల రాయితీల ఒప్పందాలను పొడిగిస్తాయి. భారత వస్తువులపై 25శాతం నుంచి 18శాతానికి పరస్పర సుంకాలను తగ్గిస్తున్నట్లు యునైటెడ్ స్టేట్స్ ప్రకటించింది. రష్యా ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారతదేశంపై శిక్షాత్మక సుంకాలను ఇప్పటికే తొలగించింది. అమెరికా నుంచి 100శాతం సుంకాలను ఎదుర్కొంటున్న దేశీయ పరిశ్రమకు ఈ సుంకాల తగ్గింపు పెద్ద ఉపశమనం కానుంది. సుంకాలను 18 శాతానికి తగ్గించే ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ట్రంప్ పరిపాలన ఈ నెలలో జారీ చేస్తుందని పియూష్ గోయల్ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రమోషన్ మిషన్ (ఇపిఎం)లోని ఎడు భాగాల ప్రారంభోత్సవంలో గోయల్ మాట్లాడుతూ భారత వాణిజ్య ఒప్పందం భారత ఎగుమతిదారులకు భారీ వ్యాపార అవకాశాలకు తలుపులు తెరిచిందని అన్నారు. అగ్రికల్చర్ సహా అన్ని సున్నితమైన రంగాలను భారతదేశం రక్షించిందని ఆయన చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ భారతదేశం చాలా ఇచ్చి చాలా తక్కువగా పొందుతున్నదని చెబుతూ ఇది 'ఘోరమైన లొంగిపోవడం' అని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ విమర్శలపై మంత్రి పియూష్ గోయల్ ఘాటుగా స్పందించారు. మేము 1.4బిలియన్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నాం. వారు కూడా అభివృద్ధిలో వాటాదారులుగా ఉన్నారు' అని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ జోడించారు. భారతదేశంపై పరస్పర సుంకాలు ఇప్పుడు దాని పోటీదేశాలతో పోలిస్తే అత్యల్పంగా ఉన్నాయన్నారు. ఈ దేశాలలో చైనాపై సుంకాలు (35శాతం), థాయ్‌లాండ్ (19శాతం), మయన్మార్ (40శాతం), కంబోడియా (19శాతం), ఇండోనేషియా(19శాతం), బ్రెజిల్ (50శాతం), వియత్నాం (20శాతం) ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌జనవరి కాలంలో అమెరికాకు దేశ ఎగుమతులు 5.85శాతం పెరిగి 72.46 బిలియన్ డాలర్లకు చేరుకోగా దిగుమతులు 13.87శాతం పెఇరగి 43.92 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.





## ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో జరుగుతున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టారు. హాల్ నంబర్ 5లోకి ప్రవేశించిన సుమారు 10 మంది నిరసనకారులు ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలతో కూడిన టీషర్టులతో ఆందోళన చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను విమర్శిస్తూ, ప్రధాని మోదీ ట్రంప్‌తో రాజీపడ్డారని ఆరోపించారు. యూత్ కాంగ్రెస్ నిరసనలు చేపట్టిన నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన తర్వాత భారత్ మండపం లోపల భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు ఎఐ సమ్మిట్ వద్ద చేపట్టిన నిరసనను యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సమర్థించారు. ఈ నిరసన దేశ వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతలోని ఆగ్రహానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. 'ఈ రోజు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎఐ సమ్మిట్ వద్దకు వెళ్లి ప్రధాని మోదీ రాజీపడ్డారని నినాదాలు చేశారు. ఈ ఆగ్రహం కేవలం మా కార్యకర్తలది మాత్రమే కాదు. నేడు నిరుద్యోగులుగా ఉన్న యువతది. మన ప్రధాని రాజీపడ్డారని వారిలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అమెరికాతో చేసుకున్న ట్రేడ్ డీల్ వల్ల మన రైతులు, పౌరులు నష్టపోతారు. ఈ ఒప్పందం వల్ల కేవలం అమెరికాకు మాత్రమే ప్రయోజనం. కనుక ప్రజల తరపున గళమెత్తడం మా బాధ్యత. మన దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. కనుక మేము ఎక్కడైనా శాంతియుతంగా నిరసన చేపట్టవచ్చు' అని అన్నారు. నిరసనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తమ పార్టీ కార్యకర్తలు దేనికీ వెనకడుగు వేయరని చిబ్ చెప్పారు. 'బిజెపి ఎ స్థాయికైనా వెళ్లవచ్చు. కానీ మేము రాజ్యాంగ సైనికులం, రాహుల్ గాంధీ సైనికులం. మేము వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు. దేశ యువత కోసం నిరంతరం గళమెత్తుతూనే ఉంటాం' అని ఐవైసి జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ స్పష్టం చేశారు.

## భారత్,అమెరికా ఒప్పందంతో 'డేటా కాలనీ'గా దేశం

**ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ**

**న్యూఢిల్లీ :** అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శలను మరింత ముమ్మరం చేశారు. భారతదేశం చాలా ఎక్కువ ఇచ్చి, చాలా తక్కువ పొందుతున్నట్లు కనిపించే ఒప్పందానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు అంగీకరించారనే దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందంతో భారతదేశం 'డేటా కాలనీ'గా మారబోతోందని పేర్కొన్నారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ.. ఒప్పందం ద్వారా మోదీ సర్కార్ అమెరికాకు అమ్ముడు పోయిందని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ఇటీవల పార్లమెంటులో తాను చేసిన ప్రసంగాన్ని ప్రస్తావించారు. అందులో ఆయన జియు–జిట్సు సారూప్యతను ఉపయోగించారు. 'వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటు ప్రసంగంలో నేను జియు–జిట్సు సారూప్యతను ఎందుకు ఉపయోగించాను? అమెరికన్లను సంతోషపెట్టడానికి మన రైతులను ఎందుకు బలి ఇచ్చారు? అమెరికా మన చమురు సరఫరాలను నిర్దేశించడానికి అనుమతించడం ద్వారా భారతదేశ ఇంధన భద్రత ఎందుకు రాజీ పడింది? పరస్పర వాగ్దానం లేకుండా సంవత్సరానికి 100 బిలియన్ల యుఎస్ దిగుమతులను పెంచడానికి ఎందుకు అంగీకరించాలి? ఈ ఒప్పందం భారతదేశాన్ని డేటా కాలనీగా మార్చగలదని నేను ఎందుకు చెప్పాను? భారతదేశం చాలా ఇచ్చి చాలా తక్కువ పొందుతున్నట్లు కనిపించే ఒప్పందానికి మోదీ జీ ఎందుకు అంగీకరిస్తారు? ఈ దారుణమైన లొంగుబాటుకు సమాధానం ప్రధానమంత్రిపై ఉంచిన 'గ్రిప్స్' 'చోక్స్'లో ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు. గాంధీ తన పార్లమెంటు ప్రసంగంలో జియు–జిట్సు సారూప్యతను ఎందుకు ఉపయోగించారని చాలా మంది తనను అడిగారని చెప్పారు. 'నేను గ్రిప్, చౌక్ అనే ఆలోచనను ఉపయోగించటానికి కారణం ఆ పదాలు జియు–జిట్సులో ఉన్నాయి. ఆ క్రీడలో మీరు ప్రత్యర్థిని ఎలా నియంత్రిస్తారో అలాంటివి రాజకీయ రంగంలో కూడా ఉన్నాయి. నా రాజకీయ అనుభవంలో, రాజకీయ పట్టులు, రాజకీయ చౌక్‌లు ఎక్కువగా దాగి ఉన్నాయని నేను చూశాను. సగటు వ్యక్తి వాటిని చూడలేడు' అని అతను చెప్పారు. ఒకవైపు అమెరికాలో వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై క్రిమినల్ కేసు, మరోవైపు ఎప్‌స్టిన్ కుంభకోణం ఉందని రాహుల్ అన్నారు. 'మూడు మిలియన్ల ఫైళ్లు విడుదల కాలేదు. ఫైళ్లలో (కేంద్ర మంత్రి) హర్దీప్ పూరికి, అనిల్ అంబానీకీ ప్రమేయం ఉందని మాకు తెలుసు. ప్రధానమంత్రి పేరు కూడా కనిపిస్తుంది, ప్రధానమంత్రికి ఇకా ప్రమేయం ఎక్కువగా ఉంటుంది' అని ఆయన అన్నారు. మరోవైపు, చైనా ఉందని చెబుతూ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే విడుదల కాని పుస్తకాన్ని ప్రస్తావించారు.'ఒకవైపు మన సరిహద్దులో కూర్చున్న చైనీయులు ఉన్నారు, మరోవైపు అమెరికా ఉంది. మన ప్రధాని ఈ పట్టుల మధ్య నలిగిపోతున్నారు. ఇరువైపులా ఆయన చిక్కుకున్నారని అందరికీ తెలుసు, అందరూ దానిని చూడగలరు. ఇక్కడ సమస్య ఎమిటంటే, నరేంద్ర మోదీపై నిజమైన పట్టు ఆయన నిర్మించిన నకిలీ ఇమేజ్, అది ఆయన కోసం నిర్మించబడింది, భారీ మొత్తంలో డబ్బు అవసరమైన ఇమేజ్' అని రాహుల్ ఆరోపించారు. ఆ ఇమేజ్‌కి కీ ఇప్పుడు అమెరికా చేతుల్లో ఉంది. అందుకే భారత రైతులు, భారతీయ వస్త్రాలకు నష్టం వాటిల్లుతోంది. మనం అమెరికా నుండి బలవంతంగా దిగుమతులను కొనుగోలు చేయవలసి వస్తుందన్నారు. అయితే అతి ముఖ్యమైనది డేటా అని, దానిని నరేంద్ర మోదీ అమెరికన్ కంపెనీలకు, అమెరికాకు అతి తక్కువ ధరకు అందజేస్తున్నారనేది వాస్తవం అన్నారు. 'నా మాటలను గమనించండి, మనం డేటా కాలనీగా మారబోతున్నాం. భారతదేశం అంత పెద్ద దేశం మన డేటా, వస్త్ర పరిశ్రమ, మన వ్యవసాయ రంగం సహా ప్రతిదాన్ని ఎందుకు అప్పగించింది, ఎందుకు సమాధానం ప్రధానమంత్రిపై వర్తించే పట్టులు, ఉక్కిరిబిక్కిరి చేయడంలో ఉంది' అని గాంధీ ప్రశ్నించారు. ఈ ఒప్పందానికి అంగీకరించడంలో మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు లొంగిపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఒప్పందం రాష్ట్రాలలోని కోట్లాది మంది రైతుల జీవనోపాధిని నాశనం చేస్తుందని, భారతదేశ ఇంధన భద్రత, డిజిటల్ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వావలంబనను త్యాగం చేస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది. వాణిజ్య ఒప్పందాలు ఒక దేశ సార్వభౌమత్వాన్ని త్యాగం చేయడం ద్వారా బానిసత్వానికి మార్గంగా మారకూడదని, వాణిజ్య ఒప్పందం ముసుగులో జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెట్టలేమని పేర్కొంది.



## అత్యధిక కేసులు ఎదుర్కోవడం గౌరవ చిహ్నంగా మారింది!

**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ**

**గువాహటి :** ప్రస్తుత రాజకీయ వాతావరణంలో అత్యధిక సంఖ్యలో కేసులు ఎదుర్కోవడం గౌరవ చిహ్నంగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకాగాంధీ అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని 2018 పరువు నష్టం కేసులో సమర్థించారు. అసోంలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రియాంక మాట్లాడారు. వివిధ ఏజెన్సీలు బహుళ కేసులతో లక్ష్యంగా చేసుకోవడం సరైన మార్గంలో ఉన్నట్లే అనే సంకేతమని వాద్రా అన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసి ప్రజలను దోపిడీ చేసే రాజకీయాలు నడుస్తున్నాయని, తాము చాలా సంవత్సరాలుగా దీనిని సహిస్తున్నామని, తన సోదరుడు పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరు కావడం గురించి అడిగినప్పుడు ప్రియాంక ఈ విధంగా స్పందించారు. రాహుల్ గాంధీ శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు ముందు హాజరయ్యారు. అప్పటి బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో తన





వాంగ్మూలాన్ని నమోదు చేశారు. 'సత్యం, అభివృద్ధి, ప్రజల కోసం నిలబడేవారు, సానుకూల రాజకీయాలను కోరుకునే వారు ప్రభుత్వం నుండి అత్యధిక దాడులను ఎదుర్కొంటారని ఇది ఒక గుర్తింపుగా మారింది. అత్యధిక సంఖ్యలో కేసులు, ఇడి, ఐటి దాడులు ఆ వ్యక్తిపై జరుగుతాయి. మేము సరైన మార్గంలో ఉన్నామనడానికి ఇది గౌరవ చిహ్నం, అందుకే మాపై దాడి జరుగుతోంది' అని వాద్రా అన్నారు.

**పాక్ సంబంధిత ఆరోపణలపై గగోయ్ కుటుంబాన్ని లాగడం తగదు**

పాకిస్తాన్ సంబంధాలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ గౌరవ్ గగొయ్‌పై విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మండిపడ్డారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను అందులోకి లాగడం తప్పుడు రాజకీయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గువాహటి శివారు సోనాపూర్‌లో ఉన్న జుబీన్ క్షేత్రలోని జుబీన్ గార్గ్ శ్మశానవాటికలో జుబీన్ గార్గ్‌కు ప్రియాంక నివాళి అర్పించారు. గాయకుడు రాజకీయాలకు అతీతంగా ఉన్నారని, జీవితాంతం ప్రేమ సందేశాన్ని వ్యాప్తి చేశారని వాద్రా అన్నారు. 'రాజకీయాల్లో రెండు రకాల నాయకులు ఉంటారు. ఒకరు సానుకూల రాజకీయాలు చేసేవారు, మరొకరు ధ్రువణీకరణ చేసేవారు. గౌరవ్ గొగోయ్ ప్రేమ రాజకీయాలు చేస్తున్నారు' అని అసోం కాంగ్రెస్ చీఫ్ శర్మ పాకిస్తాన్ సంబంధాలపై పదేపదే చేస్తున్న దాడుల గురించి అడిగినపుడు ఆమె స్పందించారు. గొగోయ్ 'సానుకూల వ్యక్తి, రాజకీయాల్లో సానుకూలతను తీసుకురావాలనుకుంటున్నారని చెప్పారు. 'అందుకే ఆయనపై ఇటువంటి దాడులు జరుగుతున్నాయని, అసోం, ప్రజలు దీనిని అర్థం చేసుకుంటారని చెప్పారు. కానీ గౌరవ్, అతని కుటుంబంపై దాడులు తప్పుడు రాజకీయాలని, కుటుంబం, పిల్లలపై ఎవరూ దాడి చేయకూడదని ప్రియాంక పేర్కొన్నారు. అలాంటి రాజకీయాలకు బదులుగా, అసోం ముఖ్యమంత్రి 'ఉద్యోగాల కోసం చూస్తున్న రాష్ట్రంలోని యువత, మహిళల గురించి మాట్లాడాలని హితవు పలికారు.

## గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరిలో 69 లక్షల ఓట్ల కుదింపు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (సర్) పూర్తయిన తర్వాత గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఓటర్ల సంఖ్య దాదాపు 69 లక్షలు తగ్గిపోయింది. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల సంఘం గణాంకాలను వెల్లడించింది. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గుజరాత్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఇటీవల తమ తుది ఓటర్ల జాబితాను ప్రచురించాయి. గత స వత్సరం అక్టోబర్ 27న సర్ ప్రకటించే ముందు, గుజరాత్, రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో కలిపి ఓటర్ల సంఖ్య 5.19 కోట్లుగా ఉంది. తుది జాబితాల ప్రచురణ తర్వాత, వారి మొత్తం ఓటర్ల సంఖ్య 4.50 కోట్లకు తగ్గింది. గుజరాత్‌లో సర్‌కు ముందు ఓటర్ల సంఖ్య 5.08 కోట్లుగా ఉండగా, ఆ తరువాత 4.40 కోట్లకు తగ్గింది. లక్షద్వీప్‌లో ఓటరు జాబితా సవరణకు ముందు ఓటర్ల సంఖ్య 57,813గా ఉంది. కానీ తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత, అది 57,607కి తగ్గింది. ఎన్నికలు జరగనున్న పుదుచ్చేరిలో సర్ ప్రారంభానికి ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 10.21 లక్షలకు పైగా ఉంది. తుది జాబితా ప్రచురించబడినప్పుడు 9.44 లక్షలకు కుదించబడింది.

## ఎపిలో ఎఐ, క్వాంటం ఎకో సిస్టం కోసం ఏడు ఒప్పందాలు

**నైపుణ్య శిక్షణ-మౌలిక వసతుల కల్పన లక్ష్యం**
**ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఎపి సిఎం సమక్షంలో ఎంఒయులు**

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ టెక్నాలజీ రంగంలో ఛాంపియన్ గా నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిని క్వాంటం వ్యాలీగా అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈ క్రమంలో ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియాఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఎడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఈ ఒప్పందాలు సిఎం చంద్రబాబు సమక్షంలో కుదిరాయి. ఎపిలో క్వాంటం ఎఐ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన దిశగా ఈ ఒప్పందాలు ఉపయోగపడనున్నాయి. ఎపిని క్వాంటంఎఐ హబ్ గా తీర్చిదిద్దడం అమరావతిలోని క్వాంటం వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి, ఎపిలో ఎఐక్వాంటం ఎకో సిస్టం పెంపొందించడానికి బాటలు వేసేలా ఈ ఎడు ఎంఒయులను ప్రభుత్వం కుదుర్చుకుంది. అలాగే భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఎఐ క్వాంటం రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎఐక్వాంటం వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. సిఎం చంద్రబాబు సమక్షంలో కుదుర్చుకున్న 7 ఒప్పందాల వివరాలు ఇలా ఉన్నాయి. క్వాంటం, ఎఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో ఈ ఎడాది చివరి నాటికి ఎఐ





క్వాంటం ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంఒయూలో పేర్కొన్నారు. ఎఐక్వాంటం డిజిటల్ ఎంబసిగా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించేలా ఈ ఎంఒయూ ఉపకరించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి యూఎన్ఐసిసి డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. మరో ఒప్పందంలో గ్లోబల్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫాం ద్వారా ఐటీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేలా ఐబీఎం అంగీకరించింది. భారత్ లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా టెక్ వర్క్ ఫోర్సును సిద్ధం చేసుకునే లక్ష్యాల్లో భాగంగా ఐబీఎం శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. ఒప్పందం కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రీసెర్చ్ లాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ తదితరులు హాజరయ్యారు.ఎపిలో క్వాంటం ఎఐ యూనివర్సిటీ ఏర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎన్ఐఈఎల్ఐటీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దక్షిణ భారతదేశంలో మొట్ట మొదటి ఎఐ, క్వాంటం డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ప్రణాళిక రూపొందించింది. మౌలిక సదుపాయాలకు కేంద్రం నిధులు కల్పించనుంది. అలాగే భూమి, క్వాంటం హార్డ్‌వేర్ ను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ లో నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి ఎఐ టెక్ హబ్5 లేయర్డ్ స్వదేశీ ఎఐ స్టాక్ నిర్మించేలా భారత్ జెన్ నెక్స్ జెన్‌ఐబీఎంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించేలా ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం కార్యక్రమంలో భారత్ జెన్ సిఈఓ హాషీకేశ్ మోహల్ బాల్, ప్రతినిధి రామకష్ణన్ లు నెక్స్ జెన్ సిఈఓ రాజగోపాల్, ఎఐ ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్, నైపుణ్య శిక్షణ వంటి అంశాలపై ఫోకస్ పెట్టేలా కాలిబో సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం కుదుర్చుకుంది. ఈ ఎంఒయూ కార్యక్రమంలో రాజ్ వట్టికూటి, అరబిందో సాహూ, విపుల్ వలంజీ, పింటో జోయ్సన్, జోహాన్నెస్ ష్రోడర్ తదితరులు పాల్గొన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసేలా వైజర్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఎడాది చివరి నాటికి 3.50 లక్షల మంది ఎఐక్వాంటం లెర్నర్లు, 2027 నాటికి 6 లక్షల మందిని సిద్ధం చేసేలా ఈ ఒప్పందం ఉంది. ఈ ఎంఒయూలో క్వాంటం సొల్యూషన్స్ హెడ్ వర్ధన్ సెహగల్, రాజ్ వట్టికూటి బందం పాల్గొంది.ఎపిలో ఎఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఎంఒయూ కుదిరింది. ఈ కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామ కోటి, ప్రొఫెసర్ మితేష్ పాల్గొన్నారు.

## మళ్లీ అధికారంలోకి వస్తాం : స్టాలిన్

**చెన్నై:** రెండు నెలల్లో డిఎంకె తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టిఎంకె తిరిగి అధికారంలోకి వస్తుందని పేర్కొంటూ, తాను అనేక అభివృ ద్ధి కార్యక్రమాలను ఉత్సాహంగా ప్రారంభిస్తానని అన్నారు. 'తమిళనాడు ప్రజల మాదిరిగానే, రానున్న 2 నెలల్లో డిఎంకె ప్రభుత్వ ం మళ్లీ ఏర్పడుతుందని విశ్వసిస్తున్నానని స్టాలిన్ అసెంబ్లీలో పేర్కొన్నారు. మన సొం త విజయాలను అధిగమించే ద్రవిడ మోడ ల్ 2.0 ప్రభుత్వం ఉంటుందన్నారు. తనకు సేవ చేయడానికి గొప్ప అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపు తూ, 'పెరియార్ (హేతువాది నాయకుడు ఇ.వి. రామసామి, పెరరిగ్నార్ అన్నా (మా జీ ముఖ్య



మంత్రి సి.ఎన్. అన్నాదురై), ముత్తమిళరిగ్నార్ కలైగ్నార్ (దివంగత ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి) మార్గంలో ఒక ద్రవిడ నమూనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. 'నాకు ఇచ్చిన బాధ్యతను నేను చాలా బాగా నిర్వహించానని భావిస్తున్నాను. తమిళనాడును మరింత సంపన్నం చేయగలనని నేను గ్రహించాను. నాకు అవకా శం ఇచ్చినందుకు తమిళనాడు ప్రజలకు నే ను కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఈ ఎ న్నికల సంవత్సరంలో చివరి అసెంబ్లీ సమావేశాల ముగింపు సమావేశంలో స్టాలిన్ అ న్నారు. రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఉన్న ఎ ఐఎడిఎంకె పాలనకు ముగింపు పలికిన త ర్వాత మే 2021లో ఆయన ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వికరించారు.2026–27 స వత్సరానికి తాత్కాలిక బడ్జెట్ సమర్పణతో ఫిబ్రవరి 17న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ 'రాబోయే రె ండు నెలల్లో మేము తిరిగి వచ్చినప్పుడు క చ్చితంగా వేగంగా పనిచేస్తామని' అన్నారు. గవర్నర్ ఆర్.ఎన్. రవితో తన సంబంధాలపై స్టాలిన్ మాట్లాడుతూ 'నాకు, గవర్నర్‌కు మధ్య వ్యక్తిగత విభేదాలు ఎవీ లేవన్నారు. అయితే, తమిళ సంస్కృతి, సం ప్రదాయాన్ని కాపాడుకుంటూ ఆయనకు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని స్పష్టం చేశారు

## దగ్గు మందు మరణాలపై 'సుప్రీం' ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఉజ్బెకిస్థాన్, గాంబియా దేశాలలో భారతీయ దగ్గు మందుల వల్ల పిల్లలు మరణించిన ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. నాణ్యతా ప్రమాణాలు లేని ఔషధాల తయారీ, అమ్మకాలకు పాల్పడిన ఫార్మా సంస్థ, దాని అధికారులకు సమన్లు జారీ చేసింది. డబ్బు కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారా... మీ చర్యల వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది అని ధర్మాసనం మండిపడింది.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS07UB 5592 | Banothu Yakanna | Chevrolet Tavera NEO-P | 2015 |
| 2 | TG27 T0247 | Bhanothu Upendar | Mahindra Jeeto Strong BS6 Diesel | 2024 |
| 3 | TS30TA 6250 | Bhukya Narendar | Mahindra Jeeto BS6 16HP | 2023 |
| 4 | TS30D 4129 | Prashanth Bandi | Kubota MU5501 Combine Harvester | 2019 |

AUCTION DATE:21-02-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793

# మరోసారి డిఎంకె కూటమికే అవకాశం!

తమిళనాడు 16వ శాసనసభ చివరి సమావేశాలు శుక్రవారం ముగిసాయి. అదే సమయంలో త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యం లో తమిళ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సినీనటుడు విజయ్ రాజకీయ ప్రవేశంతో ఈ సారి పోటీ ముక్కోణంగా మారింది. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె కూటమి, మాజీ ముఖ్యమంత్రి పళని స్వామి నేతృత్వంలో బిజెపితో కూడిన ఎన్‌డిఎ కూటమి, సినీ హీరో విజయ్ కొత్త పార్టీ తమిళగ వెట్టి కళగం (టివికె)లు ఎన్నికల్లో తలపడనున్నాయి. వరుస ఎన్నికల్లో డిఎంకె కూటమి విజయపరంపరను కొనసాగిస్తోంది. అయితే, గత ఏడాది ఏర్పాటైన టివికె పార్టీతో రాజకీయ సమీకరణల్లో మార్పులు రావొచ్చనే సంకేతాలు వెలువడ్డాయి. దానిని అడ్డుకట్ట వేసేందుకు స్టాలిన్ తనయుడు, సినిమాలలో ప్రవేశమున్న ఉప ముఖ్యమంత్రిని ఉదయనిధి స్టాలిన్‌ను డిఎంకె ప్రయోగించింది. అలాగే ఇటీవల జరిగిన డిఎంకె యువజన విభాగం సమావేశానికి భారీ సంఖ్యలో యువకులు హాజరవడం ఆ పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. దివంగత సినీనటుడు విజయకాంత్ ఏర్పాటు చేసిన డిఎండికె పార్టీ సైతం డిఎంకెతో చేతులు కలిపేందుకు రెండు రోజుల క్రితమే ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు ఎన్‌డిఎ కూటమిలో ఉన్న ఆ పార్టీ ఇకపై డిఎంకె కూటమిలో చేరనున్నట్లు విజయకాంత్ సతీమణి ప్రేమలత ప్రకటించారు. ఈ పరిణామం డిఎంకెకు రెండు విధాల కలిసొచ్చింది. స్వంత కూటమిలో ఊగిసలాటను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టడమే కాకుండా, విజయ్‌కాంత్ అభిమానులను తన వైపు తిప్పుకోవడంతో విజయం సాధించినట్లే. ఎక్కువ స్థానాలతోపాటు, మంత్రివర్గంలో చోటు ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ అవసరమైతే టివికెతో వెళ్ళేందుకు సిద్ధమన్నట్లుగా కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్, రాజకీయ వ్యూహకర్త ప్రవీణ్ చక్రవర్తి పరోక్ష సంకేతాలిచ్చారు. డిఎండికె పొత్తు పరిణామం ద్వారా కాంగ్రెస్ పార్టీకి డిఎంకె విషయం అర్థమయ్యేలా చేసింది. గతంలో బిహార్‌లో సైతం బేరమాడి అధిక సీట్లు పొంది చతికిల పడినప్పటికీ కాంగ్రెస్ గుణపాఠం నేర్చుకోవడం లేదు. తాను నేతృత్వం వహించే కూటమిలో మాత్రం మిత్రపక్షాల విషయంలో చివరి వరకు తెమల్చకుండా, ఆఖరు నిమిషంలో సీట్లు కేటాయించే ఆ పార్టీ, స్థానబలం లేనిచోట తనకు ఎక్కువ సీట్లు కావాల్సిందేనని పట్టుబట్టడం విడ్డూరం. స్టాలిన్ నేతృత్వంలోని 19 రాజకీయ పార్టీలతో కూడిన సెక్యూలర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ఆదర్శవంతమైన కూటమిగా సాగుతోంది. కూటమి భాగస్వాములతో గౌరవప్రదంగా వ్యవహరిస్తూ, తగిన స్థానాలు కల్పిస్తూ దేశంలోనే రాజకీయ కూటములకు ఆదర్శంగా నిలిచారు స్టాలిన్. గత ఏడాది శాసనసభలో ఇచ్చిన మాటను నిలపుకుంటూ ఇటీవల చెన్నైలో కారల్ మార్క్స్ నిలువెత్తు విగ్రహాన్ని సైతం ఆవిష్కరించారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాక, తాజాగా 1.31 కోట్ల మంది మహిళల ఖాతాల్లో కళైగ్నార్ మహిళా హక్కుల పథకం కింద రూ.5వేల నగదు జమ చేసి ప్రత్యర్థులకు అందనంత ఎత్తుకు చేరుకున్నారు.

ఇక అత్యధిక పారితోషికం పొందుతున్న తమిళ నటుడైన విజయ్‌కు యువతలో క్రేజ్ ఉంది. అలాగే రాష్ట్రమంతా ఫ్యాన్ క్లబ్బులే ఆయన పార్టీకి పునాది. ఆది నుంచి సినిమా ప్రభావం తమిళరాజకీయాలపై మెండుగానే ఉంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పని చేసిన కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జె.జయలలితలు సినీ రంగానికి చెందిన వారే. కాబట్టి, జయలలిత మరణంతో ఏర్పడిన రాజకీయ శూన్యతను తన గ్లామర్‌తో భర్తీ చేయవచ్చనే నమ్మకంతో విజయ్ రాజకీయాలలోకి ప్రవేశించారు. ఒక దశలో ఆయన బిజెపితో కలిసి వెళ్తాడని వార్తలు వచ్చాయి. ద్రవిడ రాజకీయాలు, హిందీ వ్యతిరేకతను జీర్ణించుకున్న తమిళనేలపై ఉత్తరాది పార్టీగా పేరుబడిన బిజెపితో ఆరంభంలోనే కలిసివెళ్ళడం దుస్సాహసమే అవుతుందని దూరంగా ఉన్నారు. తాను మత రాజకీయాలకు వ్యతిరేకమనే ప్రకటన కూడా చేశారు. అనుకున్నట్లుగానే ఆయన సభలకు పెద్ద సంఖ్యలో యువత రావడం మొదలైంది. కానీ, ఆయన ప్రభావం తమ పై పడకుండా ఉండేందుకు డిఎంకె అన్ని రకాలుగా చర్యలు తీసుకుంది. గత ఎన్నికల్లో స్వంతంగా పోటీ చేసి ఓడిపోయిన కమల్ హాసన్ పార్టీని అక్కున చేర్చుకోవడమే కాకుండా, ఆయనను రాజ్యసభ సభ్యుడిని చేసింది.

ఇక ఎన్‌డిఎ కూటమి ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆ పార్టీ ద్వితీయ స్థానం కోసం పోటీ పడాల్సిన పరిస్థితి. సోషల్ మీడియా వీడియోలతో ప్రచారం పొందిన మాజీ ఐపిఎస్ అధికారి అన్నామలైతో గత ఎన్నికల్లో చేసిన ప్రయోగం వికటించడంతో బిజెపి ఆయనను పక్కనబెట్టింది. అన్నాడిఎంకె ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేసిన నయనార్ నాగేంద్రన్‌ను చేర్చుకొని తమిళనాడు పగ్గాలను అప్పగించింది బిజెపి. ఒంటరి పోరుతో గత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమిని మూటగట్టుకున్న అనుభవంతో ఆయన అనివార్యంగా ఈసారి తన పాత మిత్రుడు పళని స్వామి నేతృత్వంలోని అన్నా డిఎంకె పంచన చేరాల్సి వచ్చింది. అన్నాడిఎంకె అంతర్గత పోరుతో ఆగిపోలేదు. ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేత ఎస్.రామచంద్రన్ ఎంజిఆర్ ఎడిఎంకె పార్టీని ఏర్పాటు చేశారు. ఈ నెల 24న జయలలిత జయంతి రోజున శశికళ కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. చివరి రోజు అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత ఎఐడిఎంకె మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ అవ్వటం మరో విశేషం.

కాగా అధికారంలో భాగస్వామ్యం, ఎక్కువ సీట్లు డిమాండ్‌లతో తమ పార్టీ కూటమిలో ఇబ్బందులు సృష్టించబోదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల డిఎంకె ఎంపి కనిమొళి ద్వారా స్టాలిన్‌కు స్పష్టమైన సంకేతం పంపారు. టివికెతో పొత్తుపెట్టుకునే సమస్యే ఉత్పన్నం కాదని చెప్పారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరకుండా కూటమిలో కాంగ్రెస్ కొనసాగవచ్చని, అధికారంలో భాగస్వామ్యం కోసం పట్టుదలకుపోతే కూటమి నుంచి వైదొలగవచ్చునని డిఎంకె కాంగ్రెస్‌కు పరోక్ష సంకేతం ఇచ్చినట్లు చెప్పబడుతున్నది. దాంతో కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకున్నట్లుంది. రెండు పార్టీల లక్ష్యం తమిళనాడులో బిజెపి ప్రభావం పెరగకుండా చూడటమే అయినప్పుడు పాత సర్దుబాట్లు, అవగాహన ప్రకారమే ముందుకు సాగటం కూటమికి ప్రయోజనదాయకం. ఈ పరిణామాలన్నీ డిఎంకె కూటమికి సానుకూలంగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షాల నడుమ ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల చీలిక మరింత లాభం చేకూర్చనుంది. తాము అమలు చేసిన సంక్షేమ పథకాలతో కూడిన ద్రవిడ నమూనా 2.0 వేసవిలో జరిగే ఎన్నికల్లో తమకు ఘనవిజయం సాధించిపెడుతుందని శాసనసభలో చివరి రోజున డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ విశ్వాసం వ్యక్తం చేయడంలో అతిశయోక్తేమీ కాదు.



## మరోసారి డిఎంకె ప్రభుత్వం ఖాయం

**డిఎంకె ప్రభుత్వం మళ్లీ ఏర్పడుతుంది. డిఎంకె పాలనపై ప్రజలపై నమ్మకం ఉంది. నేను ఈరోజు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను కలిశాను. గత ఐదు సంవత్సరాలుగా ఆయన విజయవంతంగా సుపరిపాలన అందించారు. అందుకు ఆయనకు అభినందనలు తెలిపాను.**

- తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం



# భారత ఆరోగ్య వ్యవస్థలో ప్రమాద ఘంటికలు

భారతదేశంలో వైద్యం అనేది ఒకప్పుడు పవిత్రమైన సేవగా పరిగణించబడేది, కానీ నేడు అది లాభాలే పరమావధిగా సాగే ఒక క్రూరమైన వ్యాపార సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ఈ విషయాన్ని సామాన్యులే కాదు, స్వయంగా భారత పార్లమెంటరీ కమిటీ కూడా అంగీకరించడం దేశ ఆరోగ్య వ్యవస్థ ఎంతగా దిగజారిందో తెలియజేస్తోంది. ఇటీవలికాలంలో వెలువడుతున్న పరిశోధనాత్మక నివేదికలు భారత ఆరోగ్యరంగం కుప్పకూలే అంచున ఉందని హెచ్చరిస్తున్నాయి. జీ న్యూస్, వివిధ అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల గణాంకాల ప్రకారం, దేశంలో జరుగుతున్న మానవ శస్త్రచికిత్సల్లో సుమారు 44% నకిలీవి, మోసపూరితమైనవి లేదా అసలు అవసరమే లేనివి అని తేలడం అత్యంత విషాదకరం. ఇదే విధమైన దోపిడీ మహిళల ఆరోగ్యం విషయంలో కూడా కొనసాగుతోంది. గర్భాశయ సమస్యలతో వచ్చే మహిళల్లో సుమారు 48% మందికి ఆ అవయవాన్ని తొలగించాల్సిన అవసరం లేకపోయినా, హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించి వారి సహజ శారీరక సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే క్యాన్సర్ ఆపరేషన్ల విషయంలో 47%, మోకాళ్ల మార్పిడి సర్జరీల్లో 48%, మరియు సిజేరియన్ డెలివరీల్లో 45% వరకు కేవలం ఆదాయం కోసమే ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని నివేదికలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల పనితీరులో వస్తున్న ఈ మార్పులకు ప్రధాన కారణం వైద్యులపై ఉన్న టార్గెట్ల ఒత్తిడి. ప్రస్తుతం పెద్ద ఆసుపత్రుల్లో సీనియర్ వైద్యులకు నెలకు రూ.1,00,00, 000(ఒక కోటి రూపాయల) వరకు జీతం ఇస్తున్నారంటే, అది వారి ప్రతిభకు మాత్రమే కాదు, వారు ఆసుపత్రికి తెచ్చే వ్యాపారానికి ఇస్తున్న ప్రతిఫలం. ప్రతి రక్త పరీక్ష, స్కాన్ లేదా ఎక్స్‌రే వెనుక 40% నుండి 50% వరకు కమీషన్లు ఉండటం, రోగికి ఉన్న సమస్య కంటే అతని జేబులో ఎంత డబ్బు ఉందన్న దానిపైనే ఆసుపత్రులు దృష్టిపెట్టడం దురదృష్టకరం.

మరోవైపు, హెల్త్ ఇన్సూరెన్స్ రంగం కూడా ఈ దోపిడీకి ఒక వేదికగా మారిం ది. దేశంలో సుమారు 68% మందికి ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ, అవసరమైనప్పుడు క్లెయిమ్ తిరస్కరించబడటం లేదా స్వల్ప మొత్తమే చెల్లించడం జరుగుతోంది. అనేక కార్పొరేట్ ఆసుపత్రులు నకిలీ బిల్లులతో ఇన్సూరెన్స్ కంపెనీలను మోసంచేస్తూ ఇప్పటికే 3,000 వరకు ఆసుపత్రులు బ్లాక్‌లిస్ట్ అయ్యాయి. మరణించిన రోగులను సైతం బ్రతికే ఉన్నారని నమ్మించి, వెంటిలేటర్లపై ఉంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఉదంతాలు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిపోతున్నాయి. దీనికి తోడు ప్రాథమిక వైద్యులు రోగులను పెద్ద ఆసుపత్రులకు పంపిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ప్రముఖ ఆసుపత్రులు 40 నుండి 75 మంది వరకు రోగులను పంపిన వైద్యులకు రూ.1,00,000 నుండి రూ. 2,50,000 వరకు రివార్డులు, విదేశీ పర్యటనలు ఆఫర్ చేస్తున్నాయంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఔషధ కంపెనీల పాత్ర కూడా ఇందులో తక్కువ ఏమీ కాదు. సుమారు 25 పెద్ద ఔషధ కంపెనీలు ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్ల రూపాయలకు పైగా వైద్యులపై ఖర్చు చేస్తున్నాయి. ప్రజలు తమను తాము రక్షించుకోవాలంటే వైద్యంపట్ల కనీస అవగాహన పెంచుకోవాలి. అనవసర పరీక్షల గురించి ప్రశ్నించడం, శస్త్రచికిత్సలకు ముందు మరో నిపుణుడి అభిప్రాయాన్ని తీసుకోవడం, జనరిక్ మందుల కోసం పట్టుబట్టడం వంటి చర్యలు కొంతవరకు మేలు చేస్తాయి. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే చట్టాలు కఠినతరం కావడమే కాకుండా, సామాన్య ప్రజల గొంతుకలు కూడా ఏకమవ్వాలి. ఈ విస్తుపోయే నిజాలు ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే వ్యవస్థలో కదలిక వస్తుంది.

వెంకగారి భూమయ్య,
9848559863

# భారత్ – చైనా సరిహద్దులో అసలేం జరిగింది?

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

2020లో లద్ధాఖ్‌లో భారతదేశంపై చైనా దురాక్రమణ చేసిన సమయంలో ఇండో–చైనా సరిహద్దులో ఏమి జరిగిందనే అంశం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా వాస్తవాన్ని దాచిపెడుతోంది. చాలా వివరాలు రహస్యంగా ఉంచాల్సినవి కావొచ్చు. వాటిని బహిర్గతం చేయటం వ్యూహాత్మకంగా సరైనది కాకపోవచ్చు. కానీ భారతదేశ రాజకీయ, రక్షణ నాయకత్వాలు ఏమి చేశాయో తెలుసుకునే హక్కు దేశానికి ఉంది. వీటిని తెలుసుకోవడానికి ఏకైక మార్గం ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే రాసిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'. ఇది ప్రచురించినట్లు అధికారికంగా ప్రకటించక ముందే ముద్రించబడి ఆన్‌లైన్ బుక్‌స్టోర్స్‌లో దుకాణాలలో అమ్ముడవుతోంది. దీని కోసం ప్రచురణకర్త రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి చూస్తున్నారు. అది ఎప్పటికీ ఇవ్వబోరు.

ఈలోగా, ఈ పుస్తకం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేతుల్లోకి వచ్చింది. సంక్షోభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రతిస్పందన అంశాన్ని ఆయన లేవనెత్తారు. ప్రభుత్వం వాస్తవానికి సంక్షోభాన్ని సృష్టించిందని, వారి నిర్ణయాలు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నించారు. కానీ ఆయన పుస్తకాన్ని ప్రస్తావించడానికి అనుమతించలేదు. ఇది ప్రభుత్వానికి సంబంధించినంత వరకు 'ప్రచురించబడలేదు'. రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో మీడియాకు పుస్తకం కాపీని చూపించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చి ఉంటే, దానిని ఆయనకు బహుమతిగా ఇచ్చేవాడినని అన్నారు. 'ప్రచురించబడలేదు' అనే పదాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నించినప్పుడు సాంకేతికంగా ప్రభుత్వం చెప్పింది సరైనదే కావ చ్చు. మీరు చేయని పనిని మీరు రద్దు చేయలేరు. అదే విధంగా పుస్తకం ఎప్పుడూ 'ప్రచురించబడకపోతే' 'ప్రచురించబడలే' అని మీరు చెప్పలేరు. పుస్తకం 'ప్రచురించబడలేదు' అనే స్థితి చాలా భిన్నంగా ఉంటుంది. పుస్తక పరిశ్రమలో పుస్తకాలు ముద్రణ తర్వాత పంపిణీదారులకు, దుకాణాలకు పంపిస్తారు. ప్రచురణకర్త అధికారికంగా దాని ప్రచురణను ప్రకటించిన తర్వాత వాటిని విక్రయిస్తారు. 'అధికారిక ప్రకటన' సమయం నుండి పుస్తకం అమ్ముడవుతుంది. ఇక్కడ ఒక ప్రచురణకర్త ఏ కారణం చేతనైనా, మార్కెట్ నుండి ఒక పుస్తకాన్ని 'ప్రచురించకుండా' 'రీకాల్' చేయవచ్చు.

పుస్తకం మార్కెట్లో ఉంది అనేది వాస్తవం. భారతదేశంలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆన్‌లైన్ స్టోర్‌లలో ఎవరైనా తనిఖీ చేయవచ్చు. ఇది అమెజాన్ ఇండియా ఆన్‌లైన్ స్టోర్‌లో అందుబాటులో ఉంది. కానీ ప్రభుత్వం ఇప్పుడు దానిని ఉపసంహరించుకునేలా చేయగలిగింది. ప్రస్తుతం అది ఎక్కడా కనిపించదు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై కేసు నమోదు చేయబడింది. అయితే ఈ 'ప్రచురించని' పుస్తకం అమెజాన్ దుకాణంలో అందుబాటులో ఉందని ఆయన అన్నారు. ఆయన చెప్పింది నిజమే. amazon.com (యుఎస్‌ఎ), amazon. co.uk (UK) వంటి విదేశాలలో అమెజాన్ స్టోర్‌లో పుస్తకాన్ని చూడవచ్చు. అమెజాన్ యుఎస్‌ఎ, యుకె స్టోర్ పుస్తకం చిత్రాన్ని చూపిస్తుంది. amazon.comలో 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ (యాన్ ఆటోబయోగ్రఫీ) హార్డ్ కవర్ మే 1, 2024, మనోజ్ ముకుంద్ నరవనే (రచయిత)' అని, amazon.co.uk టెక్స్ట్ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ:యాన్ ఆటోబయోగ్రఫీ, హార్డ్ కవర్ 31, మే 2024'రాసి ఉండడాన్నిచూడవచ్చు. రెండు స్టోర్లలో ప్రచురణ తేదీ స్పష్టంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, పుస్తకం కాపీలు ప్రస్తుతం అందుబాటులో లేవు అని వర్గీకరించబడ్డాయి. మీరు ఆప్షన్ చూడండి బటన్ క్లిక్ చేసినప్పుడు ఈ అంశం ఎప్పుడు లేదా తిరిగి స్టాక్‌లోకి వస్తుందో మాకు తెలియదు అని చెప్పే పేజీ మీకు కనిపిస్తుంది. యుఎస్ అమెజాన్ వెబ్‌సైట్‌లో ఒక యూజర్ సమీక్ష ఉంది. అది ఇలా చెబుతోంది– "రక్షణ మంత్రిత్వ శాఖ భారతదేశం ప్రచురణకు ఆమోదించక ముందు అంతర్జాతీయంగా అమ్ముడవుతున్న కాపీలను అమెజాన్ ఉపసంహరించుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు పెంగ్విన్, అమెజాన్ ద్వారా ఈ ముందస్తు అనుమతి పొందిన పంపిణీపై భారతదేశంలో వ్యాజ్యం ఉంది... ఇది ఇద్దరికీ, అసంతృప్తి చెందిన జనరల్‌కు ఇబ్బందిని కలిగిస్తుంది." అమెజాన్ వెబ్‌సైట్ ప్రచురణ తేదీని స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అమెజాన్ పుస్తకం ప్రచురణకు సాక్షిగా ఉంది. ఇందులో ISBN సంఖ్యలు కూడా ఉన్నాయి. అమెజాన్ యుఎస్‌లో ప్రొడక్ట్ వివరణ "పబ్లిషర్:పెంగ్విన్ వీర్, ప్రచురణ తేదీ: మే1,2024, భాష: ఇంగ్లీష్, ముద్రణ పొడవు: 448 పేజీలు, ISBN10: 0670099759, ISBN13: 9780670099757, వస్తువు బరువు: 1.43 పౌండ్లు, కొలతలు: 8.46 x 5.51 x 1.14 అంగుళాలు."

అయితే, లోక్‌సభలో రాహుల్ గాంధీ పుస్తకం నుండి కోట్ చేయాలనుకున్నప్పుడు, ప్రభుత్వం 2020 ఇండియా– చైనా సరిహద్దు ప్రతిష్టంభనను ఎలా నిర్వహించిందనే దానిపై ప్రశ్నలు లేవనెత్తడానికి ప్రచురించిన కథనాన్ని ఉపయోగించినప్పుడు, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సహ బిజెపి నాయకులు ఆయన ఉటంకించిన విషయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రచురించని విషయాలను, ముఖ్యంగా రక్షణ విషయాలకు సంబంధించిన వాటిని పార్లమెంటులో ఉటంకించలేమని, పుస్తకం అధికారికంగా అందుబాటులో లేదని వారు వాదించారు. వారి ప్రకటన రెండు విషయాలపై ఆధారపడి ఉంది. మొదటిది రక్షణ మంత్రిత్వ శాఖ ప్రచురణకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. సున్నితమైన వివరాలతో కూడిన సైనిక జ్ఞాపకాల ప్రచురణకు ఇది అవసరం. రెండవది అది 'అధికారికంగా అందుబాటులో లేదు'. పుస్తకం ఉనికిలో లేదని వారు నొక్కి చెప్పారు. ఇది సరైనది కాదు, ఇది పార్లమెంటును తప్పుదోవ పట్టించేది. ఇది సభ సభ్యుల పార్లమెంటరీ హక్కులకు భంగం కలిగిస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం లేకుండా పుస్తకం ముద్రించబడి, ప్రచురించబడి, విక్రయించబడిందని ఇప్పుడు మన దగ్గర రుజువు ఉంది అనేది వాస్తవ స్థితి. ఆ పుస్తకం 'అధికారికంగా అందుబాటులో లేదు' అని పార్లమెంటులో బిజెపి నాయకులు అంగీకరించడం కూడా పుస్తకం వాస్తవ స్థితిని పరోక్షంగా అంగీకరించడమే. అది వాస్తవానికి ఉనికిలో ఉందని కూడా సూచిస్తుంది.




లోకసభ స్పీకర్ ఈ విషయంపై తదుపరి చర్చను నిరోధించడానికి, 'ప్రచురించని మూలాల' నుండి చదవకుండా నిరోధించడానికి పార్లమెంటరీ నియమాలను (నియమం 349 వంటివి) ఉదహరించారు. అయితే, పుస్తకంతోపాటు ఆన్‌లైన్ స్టోర్లలో ప్రచురణ తేదీ, ISBN సంఖ్యలు ఉన్నందున ఇది వాస్తవంగా తప్పు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మాట్లాడటానికి, ఈ అంశం పై కోట్ చేయడానికి అనుమతించకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంపిల నిరసన కారణంగా పార్లమెంటరీ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగింది, సభను వాయిదా వేశారు. రాహుల్ గాంధీ పుస్తకంలోని అంశాలను కూడా ధృవీకరించారు, తద్వా రా అతను పార్లమెంటులో సారాంశాలను చదవగలడు. కానీ ఆయనను అనుమతించలేదు. నిరసనల ఫలితంగా ఎనిమిది మంది ఎంపిలు సస్పెన్షన్‌కు గురయ్యారు.

జనరల్ నరవాణే, ప్రచురణకర్త వివాదంలోకి దించబడ్డారు. మాజీ ఆర్మీ చీఫ్ బహిరంగంగా స్పందించారు. ప్రచురణకర్తలు పుస్తకం స్థితిని స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు ఎవరి ఆదేశాల మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారో ఆ మోదీ ప్రభుత్వం నుండి వచ్చే ఇబ్బందుల నుండి ఇద్దరూ తమను తాము రక్షించుకోవడానికి ఇలా ముందుకు వచ్చారు. ప్రచురించని పుస్తకం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేతుల్లోకి ఎలా వచ్చిందోనని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే జ్ఞాపకాల పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'కి ప్రత్యేకమైన ప్రచురణ హక్కులను కలిగి ఉన్నట్లు, ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని ప్రచురణకర్త పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఒక ప్రకటన చేసింది. ఢిల్లీ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి పుస్తకం అక్రమ సర్క్యులేషన్‌పై దర్యాప్తు ప్రారంభించిన తర్వాత ప్రచురణకర్త ప్రకటన వచ్చింది. 'ప్రచురించని' రచనకు సంబంధించిన లీక్ లేదా ఉల్లంఘనపై వివరణాత్మక దర్యాప్తు కోసం ఈ కేసును స్పెషల్ సెల్‌కు అప్పగించినట్లు సమాచారం. 'భారత సైన్య మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తక ప్రచురణ హక్కులను మేము మాత్రమే కలిగి ఉన్నాము. ఈ పుస్తకం ప్రచురణలోకి రాలేదని మేము స్పష్టం చేయాలనుకుంటున్నాము' అని ప్రచురణకర్త చెప్పారు. ప్రచురణకర్త డిజిటల్ రూపంలో ముద్రించిన కాపీలు ప్రచురించబడలేదు, పంపిణీ చేయబడలేదు, విక్రయించబడలేదు లేదా అందుబాటులో ఉంచబడలేదు' అని కూడా ప్రచురణకర్త చెప్పారు, అయితే దాని అనధికార పంపిణీ కాపీరైట్ ఉల్లంఘనగా పరిగణించబడుతుందని చెప్పారు.

జనరల్ నరవాణే ఫిబ్రవరి 10న ఎఫ్‌ఐఆర్ తర్వాత ఒక రోజు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో 'ఇది పుస్తకం ప్రస్తుత స్థితి' అనే శీర్షికతో ఒక ప్రకటన చేశారు, దాని కింద పెంగ్విన్ ఇండియా ప్రకటనను ఉంచారు.

ఇప్పుడు అసలు ప్రశ్న చైనా దురాక్రమణకు మోదీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతిస్పందనలో నిజం ఏమిటి అనే దాని నుండి పుస్తకం 'ప్రచురించబడిందా', 'ప్రచురించబడలేదా' లేదా 'ప్రచురించబడలేదు' అనే దానివైపు మళ్ళింది. పుస్తకం కాపీ రాహుల్ గాంధీకి చేరుకోవడంలో చట్టవిరుద్ధం ఏమిటి అనే దానివైపు మళ్ళింది. జాతీయ ప్రాముఖ్యత కలిగిన సత్యాన్ని అణచివేసినట్లే. ప్రభుత్వం కొంతమందిని జైలులో పెట్టే అవకాశం కూడా ఉంది. కానీ నిజం ఏమిటి? ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ప్రచురణకర్త ముద్రించిన పుస్తకం వివరణలో, జనరల్ నరవాణే తన జీవితం, వివిధ కాలాలు, ఆయన పాత్ర ను రూపొందించిన అనుభవాల గురించి సరళమైన, హృదయపూర్వకమైన కథనాన్ని రాశారు. బాల్యం నుండి తాను సేవలో ఉన్న సంవత్సరాల వరకు, సోపానక్రమం ద్వారా భారత సైన్యం ఇరవై ఎనిమిదవ అధిపతిగా ఎదిగారు."

పుస్తకం చట్టబద్ధంగా ప్రచురించబడినా, లేకున్నా, అందుబాటులో ఉంది. వాస్తవానికి ఇది ముద్రించబడింది, ప్రచురించబడింది, పంపిణీ చేయబడింది, విక్రయించబడింది. అయితే, అసలు ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. చైనా దురాక్రమణ సమయంలో ఏమి జరిగింది, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రతిస్పందన ఏమిటి? దేశానికి నిజం తెలుసుకునే హక్కు ఉంది. జనరల్ నరవాణే పుస్తకాన్ని ఆమోదించకుండా ఆయన మాటలను అణచివేయకూడదు. నేరుగా సంక్షోభం సాక్షి భారత మాజీ ఆర్మీ చీఫ్ నుంచి వచ్చిన కథనం ఆధారం గా పౌరులు తమ సొంత అభిప్రాయాన్ని కలిగి ఉండటానికి అవకాశం ఇవ్వాలి.

**(ఐపిఎ సర్వీస్)**

# మేధస్సు వ్యవస్థలలో నమ్మకాన్ని నిర్మించడం ఎఐ కర్తవ్యం

కృత్రిమ మేధస్సు పరిశోధనా రంగంగా ప్రారంభమై, ఇప్పుడు ప్రభుత్వం, పరిశ్రమలు దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాంకేతికతగా వేగంగా అభివృద్ధి చెందింది. ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య, భద్రత ప్రజా విధానాల వంటి రంగాల్లో ఎఐ ఆధారిత వ్యవస్థలు కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతాయుత అభివృద్ధి, పరిపాలన అత్యంత అవసరంగా మారింది. బాధ్యతాయుత ఎఐ అనేది మేధస్సుగల వ్యవస్థలు నైతికత, పారదర్శకత, బాధ్యతతో కూడిన సామాజిక విలువలకు అనుగుణంగా రూపకల్పన చేయబడి, అమలు చేయబడి, నిర్వహించబడేలా చేసే ఒక వ్యవస్థీకృత రూపకల్పన. బాధ్యతాయుత ఎఐ అనగా హానిని తగ్గించే, పక్షపాతాన్ని తగ్గించే, గోప్యతను రక్షించే సమానత్వం, భద్రతను ప్రోత్సహించే విధంగా ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఉపయోగించడం. ఇది కేవలం సాంకేతిక పనితీరుకే పరిమితం కాకుండా, సమాజంపై విస్తృత ప్రభావం, చట్టపరమైన అనుసరణ, నైతిక సమన్వయాన్ని కూడా కలిగి ఉంటుంది. నైతిక ఎఐ ప్రధానంగా న్యాయం, మానవ హక్కులు వంటి నైతిక అంశాలపై దృష్టి పెడితే, బాధ్యతాయుత ఎఐ అనేది నైతికత, ప్రమాద నిర్వహణ, నియంత్రణ అనుసరణ, కార్యాచరణ బాధ్యతలను సమగ్రంగా కలిగిన పరిపాలనా నమూనా. 2010 దశకంలో బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ అభివృద్ధి కారణంగా మెషిన్ లెర్నింగ్ విస్తృతంగా ఉపయోగించబడింది. దీనివల్ల అల్గారిథమిక్ పక్షపాతం, అపారదర్శక నిర్ణయ ప్రక్రియలు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం, బాధ్యతాలోపం వంటి నైతిక సవాళ్లు ఉద్భవించాయి. ప్రస్తుతం జనరేటివ్ ఎఐ వ్యవస్థలు సంస్థల్లో వేగంగా అమలవుతున్నందున ఈ సవాళ్లు మరింత ప్రాముఖ్యత పొందాయి.

**నమ్మకపు స్తంభాలు**

ఎఐ స్వీకరణకు నమ్మకం ప్రాథమిక ఆధారం. భాగస్వాములు ఎఐ వ్యవస్థలపై ఆధారపడాలంటే కొన్ని ముఖ్యమైన అంశాలు అవసరం. అనేక ఆధునిక ఎఐ నమూనాలు, ముఖ్యంగా డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లు, బ్లాక్ బాక్స్ లాగా పనిచేస్తాయి. ఒక వ్యవస్థ ఏ నిర్ణయం ఎందుకు తీసుకుందో అర్థం కావాలి. ఖచ్చితత్వం పరీక్షలు, ధృవీకరణ ప్రక్రియలు విశ్వసనీయతను పెంచుతాయి. డేటా మూలాలు, నమూనా ఎంపికలు, ప్రక్రియల డాక్యుమెంటేషన్ ట్రేసబిలిటీ నిర్ధారిస్తుంది.




డేటాలో ఉన్న చారిత్రక అసమానతలు లేదాతక్కువ ప్రాతినిధ్యంవల్ల పక్షపాతం ఏర్పడవచ్చు. విభిన్నమైన, ప్రాతినిధ్య డేటాసెట్‌లు, పక్షపాతం అవగాహన కలిగిన అల్గారిథమ్‌లు, ఫెయిర్‌నెస్ ప్రమాణాలు, సమీక్షా కమిటీలు సమానత్వాన్ని నిర్ధారించడంలో సహాయపడతాయి. అలాగే దృఢత్వం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎఐ వ్యవస్థలు అసాధారణ పరిస్థితులు లేదా దాడులను తట్టుకునేలా ఉండాలి. నిరంతర పర్యవేక్షణ, సైబర్ భద్రతా చర్యలు, పరీక్షలు అవసరం.పారదర్శకత ఎఐ ఎలా నిర్మించబడింది, ఎలా అమలైంది అన్న విషయాల్లో స్పష్టత ఉండాలి. డేటా మూలా లు, శిక్షణ విధానాలు, పరిమితులు వెల్లడించాలి. ఈ మధ్యకాలంలో గోప్యత రక్షణ ప్రముఖంగా వినిపిస్తోంది. ఎఐ వ్యవస్థలు వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించే సందర్భంలో డేటా పరిపాలన, చట్టబద్ధ ప్రాసెసింగ్, అవగాహనతో సమ్మతి, భద్రతా చర్యలు తప్పనిసరి.

**బాధ్యతాయుత ఎఐ ఎందుకు ముఖ్యం?**

ఎఐ 2020లలో అత్యంత ప్రభావవంతమైన సాంకేతికతగా భావించబడుతోంది. వ్యక్తులు, సంస్థలు కీలక నిర్ణయాలకు అల్గారిథమ్‌లపై ఆధారపడుతున్నందున, అవి నమ్మదగినవిగా ఉండాలి. బాధ్యతాయుత ఎఐ పక్షపాతాన్ని తగ్గిస్తుంది, పారదర్శకతను పెంచుతుంది, చట్టపరమైన అనుసరణను నిర్ధారిస్తుంది, భాగస్వాముల నమ్మకాన్ని బలోపేతం చేస్తుంది. ఎఐ జీవచక్రంలో ముందుగానే ప్రమాదాలను గుర్తించడం ద్వారా సంస్థలు చట్టపరమైన, సామాజిక ప్రమాదాలను తగ్గించగలవు. అమలు విధానం బాధ్యతాయుత ఎఐ అమలు ఒకే దశలో పూర్తయ్యే ప్రక్రియ కాదు; ఇది మొత్తం జీవచక్రంలో సమన్వయంతో ఉండాలి. సంస్థలు మొదట తమ విలువలకు అనుగుణమైన స్పష్టమైన సూత్రాలను నిర్వచించాలి. ఎఐనిపుణులు, న్యాయ నిపుణులు, నైతిక శాస్త్రవేత్తలు మరియు వ్యాపార నాయకుల భాగస్వామ్యంతో విధానాలు రూపొందించాలి. ప్రభావ మూల్యాంకనాలు, పక్షపాతం పరీక్షలు, నిరంతర ఆడిట్లు, మానవ పర్యవేక్షణ అనివార్యం. గోప్యత, భద్రతతా చర్యలను నిరంతరం నవీకరించాలి. భవిష్యత్తు దిశ బాధ్యతాయుత ఎఐ ఒక నిరంతర నిబద్ధత. ఎఐ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ పరిపాలనా రూపకల్పనలు కూడా అనుసరించాలి. పరిశ్రమ, అకాడెమియా, విధాన నిర్ణేతలు, పౌర సమాజం కలిసి పని చేయడం ద్వారా మాత్రమే సాంకేతిక నవీనత సామాజిక విలువలకు అనుగుణంగా ఉంటుంది. సమానత్వం, పారదర్శకత, బాధ్యత, గోప్యత, భద్రతను తమ ఎఐ వ్యూహాలలో సమగ్రపరిచే సంస్థలు కేవలం ప్రమాదాలను తగ్గించడమే కాకుండా దీర్ఘకాలిక నమ్మకాన్ని నిర్మించగలవు. అల్గారిథమ్‌ల ఆధిపత్యం పెరుగుతున్న ఈ ప్రపంచంలో, నైతికమైన, నమ్మదగిన మేధస్సు గల వ్యవస్థలకు బాధ్యతాయుత ఎఐ బలమైన పునాది అందిస్తుంది.

ప్రొ. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## ప్రభుత్వ పాఠశాలలకు చేయూత




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సింగరేణి గోలేటి జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డితో కలిసి కలెక్టర్ కంప్యూటర్లను పంపిణీ చేశారు. జిల్లాలోని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న నాలుగు ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, సిపియులు, ప్రింటర్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. సింగరేణి సంస్థ 11 కంప్యూటర్లు, 11 సిపియులు, 5 ప్రింటర్లను సమకూర్చడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కార్పొరేట్ సంస్థలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆధునిక విద్యా బోధనకు ఈ పరికరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ అధికారులు, పాఠశాల ప్రణాళిక సమన్వయకర్త ఆబిద్ అలీ, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్లరికల్ స్టాఫ్ కొరత తీర్చాలి

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్. తిరుపతి



**ప్రజాపక్షం / రెబ్బన :** బెల్లంపల్లి ఏరియాలో క్లరికల్ స్టాఫ్ కొరతను తీర్చడానికి వెంటనే జూనియర్ అసిస్టెంట్లను నియమించాలని ఎఐటియుసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం స్ట్రక్చర్ కమిటీ సమావేశం విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఏరియాలోని పాతబడిన డి టైప్ క్వార్టర్ల పైకప్పులకు బిటుమెన్ షీట్లు వేయించి లీకేజీలను అరికట్టాలని కోరారు. ఖైరగూడ సిహెచ్‌పి, రెబ్బన వ్యాగన్ లోడింగ్ పాయింట్ల వద్ద కార్మికుల కోసం రక్షణ షెడ్లు నిర్మించాలని, మహిళా ఉద్యోగుల కోసం అదనపు రెస్ట్ రూమ్‌లు, శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. యూనియన్ ప్రతినిధులు ఎస్ తిరుపతి, బయ్య మొగిలి, శేషశైనా రావు, రాజేష్, జగ్గయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. అధికారుల తరపున ఎస్‌ఓ టు జిఎం రాజమల్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ నరేందర్, సివిల్ డిజిఎం పాషా, మెహరా, రవికుమార్, పర్సనల్ అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు.

## ధాన్యాగారంగా తెలంగాణ

ప్రభుత్వ అనుమతితో హల్దీవాగులోకి నీటి విడుదల



**ప్రజాపక్షం / గజ్వేల్:** సిఎం రేవంత్ రెడ్డి రైతులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుండడంతో భారత దేశ ధాన్యాగారంగా తెలంగాణ రాష్ట్రం రూపుదిద్దుకుంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అవుసులోని పల్లి శివారులోని కెనాల్ వద్ద హల్దీవాగు లోకి నీటిని ఇరిగేషన్ ఈఈ జితేందర్ రెడ్డితో కలిసి విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా కాపాడే క్రమంలో ప్రభుత్వ అనుమతి తీసుకొని నీటిని విడుదల చేయగా, దారి పొడవునా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు పంటలకు నీరు సంవృద్ధిగా చేరుతుందని స్పష్టం చేశారు. ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ సత్యవాస్, ఇతర అధికారులు మురళీధర్ రెడ్డి, ఇందిర, సాహితీ, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కీసర వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రాపర్టీ టాక్స్ బకాయిలు చెల్లించాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** మునిసిపాలిటీల ప్రజలందరూ తమ ప్రాపర్టీ టాక్స్ ను వెంటనే చెల్లించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శుక్రవారం సా యంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని నిర్మల్,ఖానాపూర్,బైంసా మూడు మునిసిపాలిటీలలో ప్రాపర్టీ టాక్స్ బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయని ఆయన తెలిపారు.ప్రాపర్టీ టాక్స్ బకాయిలు ఉన్న ప్రజలంతా విధిగా తమ పన్నులను చెల్లించాలని వివరించారు.ప్రాపర్టీ టాక్స్ వసూలు కొరకు మూడు మునిసిపాలిటీలలో సోమవారం నుంచి,నెల రో జుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పన్నులు చెల్లించని వారికి నోటీసులు అందించి,చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. చెల్లింపు ద్వారా,మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారుప్రజలంతా తమ బకాయి పన్నులను చెల్లించాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## నర్సింగరావు మృతి ఎఐటియుసికి తీరని లోటు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నర్సింగరావు మృతి ఎఐటియుసికి తీరని లోటని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. శుక్రవారం పి.నర్సింగరావు జిల్లా అధ్యక్షుడు సంతాప సభ గౌతంనగర్‌లో నిర్వహించగా ఓమయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు హాజరై మాట్లాడారు. కా॥ నర్సింహారావు కార్మికుల సంక్షేమం కోసం ఈ జిల్లాలో అలుపెరుగని పోరాటాలు నిర్వహించటం జరిగిందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేసిన గొప్ప వ్యక్తి అని, సమసమాజ స్థాపనే లక్ష్యంగా, ఆర్థిక సమానతలు లేని కుల మత భావాలు లేని సమాజం ఉండాలని భావించిన వ్యక్తి కా॥ నర్సింగ్‌రావు అని ఆయన ఆశయ సాధన కోసం కార్మికులు కార్మిక నాయకులను బలి చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఎఐటియుసి జిల్లా నాయకులు చక్రపాణి, హన్మాండ్లు, దేవేందర్, సాయన్న, భరత్, ఇమ్రాన్‌అలీ, ప్రసాద్, చిన్నుబాయి, నర్సయ్య, గోవర్ధన్, రాధకుమార్, తిరుపతి, నరేందర్ పాల్గొన్నారు.



# క్రీడల్లో పాల్గొనే వారే విజేతలు

గెలుపు ఓటములు ఒకేలా స్వీకరించాలి
ఆటలు కష్టంగా కాకుండా ఇష్టంగా ఆడాలి
ఆదనపు కలెక్టర్ నగేష్, ఎఎస్‌పి మహేందర్

**ప్రజాపక్షం మెదక్ :** క్రీడ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరూ విజేతలేనని, గెలుపు, ఓటములు ఒకేలా స్వీకరించాలని మెదక్ జిల్లా ఆదనపు కలెక్టర్ నగేష్, ఎఎస్పీ మహేందర్ లు తెలిపారు. ఆటలను కష్టంగా కాకుండా ఇష్టంగా ఆ డాలన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేం ద్రంలోని అవుట్ డోర్ స్టేడియంలో సెకండ్ ఎడి షన్ సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు 2025 లో భాగంగా సాఫ్ట్ బాల్ మెన్, వుమెన్ పోటీలు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి గంగాల రమేష్ ఆధ్వర్యంలో ప్రారం భ మయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎఎస్పీ మహేందర్, డీఈఓ విజయ, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శోభన్ బాబు, జిల్లా సైన్స్ అధికారి దాజిరెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎఎస్పీ మహేందర్ లు సీఎం కప్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను జ్యోతి వెలి గించి, జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. మారుమూల గ్రామాల క్రీడా కారుల ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వ హిస్తుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలను మెదక్ జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చి తెలంగాణ కు మంచి గుర్తింపు తేవాలని, అందరికి శుభాకాంక్షలు తెలి యజేశారు. ఆటలో గెలుపు ఓటములు ఒకే లాగా స్వీకరించాలని, క్రీడా స్ఫూర్తితో రా ణించాలన్నారు. ఓటమి ఉంటేనే గెలుపు ఉం టుందని సూచించారు. డీఈఓ విజయ, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శోభన్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి లు మా ట్లాడుతూ సాఫ్ట్ బాల్‌లో రాణించి తెలంగాణ కీర్తని నలు మూలల విస్తరింప చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో




రాణించి క్రీడాకారులు ఒలింపిక్స్ లో ఆడాలని ఆకాక్షించారు. అందరికీ ప్రభుత్వం మంచి ప్రోత్సాహం అందిస్తుందని పే ర్కొ న్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, ఎస్ జి ఎఫ్ నాగరాజు, పేట రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పేట జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సాఫ్ట్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ రావు, పి డి మాధవరెడ్డి తో పాటు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠినచర్యలు : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఐడీఓసీలో గర్భస్త పూర్వ గర్భస్త పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలున్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలన్ని రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, లేనిచో వారికి రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయకూడదన్నారు. పీసీపీఎన్డీటీ చట్టంపై విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా వైద్యారోగ్యాధికారిని డాక్టర్ రాజశ్రీ, పీఓలు సుప్రియ, శిఖర, డిప్యూటీ డీయంఅండ్‌హెచ్‌ఓలు అశ్వినీ, సమత, రెడ్‌క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతోనే విజ్ఞానం

నిర్మల్ జిల్లా ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్,
ఏలేటి మహేశ్వర్ రెడ్డి,రామారావు పటేల్..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్,ఏలేటి మహేశ్వర్ రెడ్డి,రామారావు పటేల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు.నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ మహారాజ్ ఆలయం ఏవిధంగా అయితే నిర్మించారో,అదే విధంగా ముథోల్ నియోజకవర్గం బాసరలో నిర్మించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడి కేంద్రాల్లో మౌలిక వసతు ల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి ,విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలు అంగన్‌వాడి కేంద్రాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి అధికారులు ,ప్రజాప్రతినిదుల మధ్య సమన్వయం పెంపొందించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించి పాఠశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలు కొనసాగుతున్న పనుల జాబితాలను అధికారులు వెంటనే సమర్పించాలని



ఆదేశించారు. పాఠశాలల్లో మంజూరు చేసిన టాయిలెట్ల నిర్మాణం ,మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని ,పనుల నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోను రాజీపడకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడి కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లు మౌలిక సదుపాయాలు పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తియిన వెంటనే కాంట్రాక్టర్లు వాటిని హెడ్ మాస్టర్లకు అప్పగించాలని వాటిని వెంటనే వాడుకలోకి తీసుకురావాలని డీఈఓ కు సూచించారు. ఎస్‌హెచ్‌జి పెడరేషన్ భవన నిర్మాణ వివరాలను సంబందిత అధికారులు తక్షణం అందించాలన్నారు. ఈజిఎస్ పల్లెల్లో అంగన్‌వాడి భవనాలు ,పాఠశాలలలో కంపౌండ్ వాల్ పనులను వెంటనేపూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈజిఎస్ లేటర్ చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పిడీ డిడి ఆర్డి జ్యోతి , పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు విద్యుత్ శాఖ సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 24న 'చలో సెక్రటేరియట్': ఎ.ఆర్.రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/నిర్మల్ :** ఆర్టీసీ పరిరక్షణ కోసం ఉద్యోగుల సమస్యల సాధన కోసం యూనియన్లకు అతీతంగా అందరూ కలిసి రావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.ఆర్.రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం రోజున నిర్మల్ పట్టణంలోని ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కొరారు.ఎన్నో రోజులుగా ఆర్టీసీ ఉద్యోగుల అనేక సమస్యలతో సతమతమవుతున్నారని,అధిక పనిభారంతో అనారోగ్యానికి గురవుతూ కష్ట కాలం గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు మారినా ఆర్టీసీ ఉద్యోగుల తలరాతలు మారడం లేదని,గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని గవర్నర్ ఆమోదం పొందినప్పటికీ అపాయింట్ డేట్ ఇవ్వకుండా కాలయాపన చేసిందని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విధంగా విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని,కొత్త రిక్రూట్‌మెంట్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం అన్ని యూనియన్లు ఏకమై జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఈ పోరాటానికి సిద్ధమయ్యాయని,ప్రతి డిపో నుండి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏ.ఆర్.రెడ్డి కోరారు.ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని,2021 వేతన సవరణను 30 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలని కోరారు.ప్రభుత్వం నుండి రావాల్సిన రూ.2, 500 కోట్ల పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని,మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల చెల్లించాల్సిన రూ.350 కోట్లను ఎటువంటి కోత లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు.వీటితో పాటు ఉద్యోగ భద్రత కల్పించడం,కారుణ్య నియామకాల్లో చేరిన వారిని



పర్మినెంట్ చేయ డం,ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తి ంపు సంఘం ఎన్నికలు ని ర్వహించడం వంటి అంశాలను పరిష్కరించాలని కోరారు.అలాగే ఎలక్ట్రిక్ బ స్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని,ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వరాదని,స్పష్టం చేశారు.మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని,రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని,హయ్యర్ పెన్షన్ నిరాకరించబడిన వారికి మరో అవకాశం కల్పించాలని కోరారు.అందరం కలిసిపోరాడాలని, ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి ఆర్. గంగాధర్, ఏ.ఆర్.రెడ్డి ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

## జక్కన్నపేటలో శుభ్రతకు అధిక ప్రాధాన్యం

సర్పంచ్ సత్యనారాయణ

**ప్రజాపక్షం మెదక్ :** మెదక్ జిల్లా హావేలి ఘనపూర్ మండలం జక్కన్న పేట గ్రామంలో మురికి కాలువల సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు దుర్వాసతో, వ్యాధులకు గురవుతున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ శుభ్రత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురికి నీరు మరియు చెత్త కారణంగా వ్యాధులు వ్యాపంచే ప్రమాదం ఉందని గుర్తించిన ఆయన, గ్రామ పరిశుభ్రత తన బాధ్యతగా భావించి శుభ్రపరిచే పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సుమారు 30 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగిన ఆయన 1995 లో సర్పంచ్‌గా సేవలందించినట్లు తెలిపారు.గ్రామ ప్రజలు ఆయన అనుభవాన్ని గుర్తించి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. గామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు కృషి కొనసాగుతుందని సర్పంచ్ తెలిపారు.




## సంగారెడ్డిని ప్రమాద రహిత జిల్లాగా రూపొందించాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించి సంగారెడ్డి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పరిస్థితిని శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం వంటి అంశలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయం కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రత అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి శాఖ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆర్ అండ్ బి రవాణా ఆర్టీసీ పంచాయతీ రాజ్ ,విద్యుత్ ,వైద్య ఆరోగ్యశాఖ పోలీస్ ట్రాపిక్ అధికారులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ టెండర్లలో నిబంధనల ఉల్లంఘన

సిపిఐ మందమర్రి
పట్టణ కార్యదర్శి దుర్గ రాజ్

**ప్రజాపక్షం/ మందమర్రి :** మందమర్రి ఏరియాలో 90 మంది అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు కోసం నిర్వహించిన టెండర్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని సిపిఐ పట్టణ కార్యదర్శి కామెరా దుర్గ రాజ్ ఆరోపించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాధవ్ సెక్యూరిటీ సర్వీస్, తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన ధృవీకరణ పత్రాలు లేవని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, నేతల అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫైళ్లను వేగంగా కదిలిస్తున్నారని మండిపడ్డారు. ఎల్1 కాంట్రాక్టర్ టెండర్ డ్రా పద్ధతిలో ఎంపికైన తర్వాత హోమ్ డిపార్ట్మెంట్ కు చెందిన పసరా లైసెన్స్‌ను ఒక్క రోజులోనే సృష్టించి సమర్పించారని దుర్గ రాజ్ తెలిపారు. వర్క్ ఆర్డర్ తేదీలు, జిఎస్టి వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని, ఇఎస్ఐ, పిఎఫ్ బిల్లులు, బ్యాంక్ స్టేట్మెంట్లను నిశితంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఎల్ 2 కాంట్రాక్టర్ కు సంబంధించి ఫైనాన్షియల్ ఇయర్ లో ఒక నెల తక్కువగా ఉందని, పసరా లైసెన్స్ వచ్చి రెండు నెలలు కూడా కాకముందే ఏడాది అ నుభవం ఉన్నట్లు పత్రాలు ఎలా సమర్పిస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ 2005 ప్రకారం లైసెన్స్ రాకముందు చేసిన పని అనుభవంగా చెల్లదని స్పష్టం చేశారు. కొన్ని



సంస్థల వద్ద పని చేయకపోయినా చేసినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, పూర్తిస్థాయి డాక్యుమెంట్లు ఉన్న వారికే టెండర్ కేటాయించాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మందమర్రి జనరల్ మేనేజర్ తక్షణమే స్పందించి తనిఖీలు చేపట్టాలని కోరారు.

# యూరియా కరువు.. బ్లాక్ మార్కెట్‌లో దోపిడీ !

ఎఇఒల పర్యవేక్షణ ఏదీ..?
పంట రాకుంటే ఆత్మహత్యలే శరణ్యం

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో యూరియా కొరత తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం,అధికారులు ఎన్ని ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో యూరియా దొరకక,మరోవైపు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్య రైతులనుడ నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే, పంట దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలే శరణ్యమని రైతన్నలు కన్నీటిపర్యంతమవుతున్నారు.

### బ్లాక్ మార్కెట్ దందా..

యూరియా సరఫరాలో పారదర్శకత ఉండాలని ప్రభుత్వం యాప్‌లను తీసుకొచ్చింది.కానీ,ఈ యాప్‌లు రైతులకు శాపంగా మారాయి.అధికారులు స్టాక్ వస్తుందని చెబుతున్న,ఫర్టిలైజర్ షాపుల్లో మా త్రం యాప్‌లో స్టాక్'జీరో' అని చూ పిస్తోం ది.లోకేశ్వరం వంటి మండలాల్లో ఏకంగా రూ.350కి ఒక బస్తా యూరియా అమ్ముతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు,దీనిపై రైతులు ప్రశ్నిస్తే 'మాకు కిరాయిలే ఎక్కువ పడుతున్నాయి.ఇష్టమైతే కొనండి లేదంటే వెళ్లం డి'' అని వ్యాపారులు బరితెగించి మాట్లాడుతున్నారు.ఈ క్రమంలో ఫర్టిలైజర్ షాపుల వద్ద ఏఈ ఓలు ఉండి స్వయంగా యూ రియా పంపిణీ చేయాలని రైతులు డిమాం డ్ చేస్తున్నారు.అధికారుల పర్యవేక్ష ణ లేకపోవడం వల్లే వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### మండలాల్లో తీవ్ర నిరసనలు..

దిలావర్పూర్,నిర్మల్ రూరల్,నర్సాపూర్, సారంగాపూర్, లక్ష్మ ణచంద, మామడ వంటి మండలాల్లో వరి సాగు విస్తారంగా



ఉంది.ప్రస్తుతం యూరియా వేయాల్సిన సమయం మించిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.తెల్లవారుజాము నుండే ఎరువుల దుకాణా ల వద్ద వేచి ఉన్నా,సాయంత్రానికి ఖాళీ చేతులతో వెళ్లాల్సి వస్తోంది.డిమాండ్‌కు తగ్గట్లుగా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేవలం కాగితాలకే పరిమితమైన నివేదికలతో కాలయాపన చేస్తోందని రైతులు మండిపడుతున్నారు.

### ఆత్మహత్యలే శరణ్యమా..?

''రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంటకు యూరియా లేకపోతే గిట్టుబాటు కాదు.ఇలాంటి పరిస్థితుల్లో మేము ఆత్మహత్యలు చేసుకోవాలా.?'అని రైతులు ప్రభుత్వాన్ని సూ టిగా ప్రశ్నిస్తున్నారు.పాత పద్ధతిలోనే సరఫరా చేయాలని,కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఫర్టిలైజర్ షాపుల వద్ద అందుబాటులో ఉంచి, తమకు న్యా యం చేయాలని నిర్మల్ జిల్లా రైతాంగం గళమెత్తుతోంది.

## అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

మున్సిపల్ చైర్మన్ తూమోల్లా దత్తాత్రి

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో అందరి సహకారమంటేనే బైంసా అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ తూమోల్లా దత్తాత్రి అన్నారు.శుక్రవారం ఆరె మరాఠా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఆరె మరాఠా సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.బైంసా ఆరె మరాఠా సంఘం మాజీ అధ్యక్షుడు కంఠాళె రఘువీర్ పాటిల్,గౌరవ అధ్యక్షుడు జాధవ్ పుండలిక్ రావు పాటిల్,అధ్యక్షుడు కదం మోహన్ రావు పాటిల్,ప్రధాన కార్యదర్శి లక్ష్మ ణ్ రావు పాటిల్,సభ్యులు కాశీరాం పాటిల్, సకారాం పాటిల్,సుమీత్ పాటిల్,యోగేష్ పాటిల్, సంతోష్ పాటిల్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేత దారుణ హత్య



**ప్రజాపక్షం/దుబ్బాక:** సిద్ది పేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలకు వెళ్లితే... దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన వంగ బాల్‌రెడ్డి(50) పని నిమిత్తం శుక్రవారం రాజక్కపేటకు తన బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కొందరు గుర్తు తెలియని దుండగులు ఆయనపై కత్తులతో అత్యంత క్రూరంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, దుబ్బాక పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో దర్యాప్తు చేస్తున్నారు. రాజకీయ కక్షలు, భూ వివాదం కోణంతో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పెండింగ్ పనులు వేగవంతం



**ప్రజాపక్షం/జగిత్యాల:** జాతీయ రహదారికి పనులకు సంబంధించి అవార్డు కాపీలను రైతులకు త్వరితగతిన అందజేయడంతో పాటు పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి కార్యక్రమంలో వచ్చిన సమస్యల ధరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలన్నారు. మీసేవ ద్వారా వచ్చిన ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రతి ఇంటి నుండి ఓటరు మాయపు వివరాలు సేకరించేలా అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆర్డీవో మధుసూదన్ గౌడ్, తహసీల్దార్‌లు రాంమోహన్, వరందన్ తదితరులు ఉన్నారు.

## ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ప్రజల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం ప్రవీణ్ అన్నారు. ఇల్లందకుంట మండలంలోని పాతరపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ముగ్గు కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజలకు సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది పేద ప్రజలకు గృహ హక్కు కల్పించాలనే మహోన్నత ఆలోచనతో ప్రారంభమైన గొప్ప సంకల్పమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ సహకారంతో పాతర్లపల్లి గ్రామానికి 24 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజలంతా సంతోషంగా తమ సొంత ఇంటి కల నెరవేరుతుందని సంతోషం వ్యక్తంచేశారని తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకీ, ప్రజా ప్రభుత్వానికే మా మద్దతు ఉంటుందని తెలిపారని అన్నం ప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బైరెడ్డి కొండాల్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మడిపల్లి మంగసంపత్, కొడారి సునీతారాజు, కొడారి లతకొమురయ్య, నాయకులు కోడం నారాయణ, కోడం భిక్షపతి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీళ్లపై ఆంక్షలా? :ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దుబ్బాక:** ప్రాజెక్టుల నిర్మాణం కోసం త్యాగం చేసిన ప్రాంతానికి నీళ్లు విడుదల చేయడానికే ఆంక్షలు విధిస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయపోల్ మండలం మంతూర్ అనాజీపూర్ శివారులో 13డి కాల్వ గోదావరి జలాలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ నియోజకవర్గానికి సాగు నీరు అందించే రామయంపేట కాల్వ నుంచి నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీళ్లు విడుదల చేయడాన్ని అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయంలో ప్రాజెక్టులు, ప్రధాన కాల్వ నిర్మించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం కాల్వ పూడిక కూడా తీయడం లేదని విమర్శించారు. కాల్వ పూడిక కారణంగా రైతులే డబ్బులు వేసుకొని పూడిక తీయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండున్నర ఏళ్లుగా సిద్దిపేట జిల్లా సాగునీటి సమస్యలపై భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. ఉప కాల్వ నిర్మాణంపై అసెంబ్లీలో ప్రస్తావించినా స్పందన లేదన్నారు. దుబ్బాక వ్యవసాయ నియోజకవర్గమని, ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని ఉపకాల్వలు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని, లేకపోతే తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, సర్పంచులు పర్వేజ్, సోమని నిర్మల, ఇస్తారితో పాటు గ్రామాల నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్య

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ సాజీద్ (41) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాజీద్ గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఇదే విషయాన్ని మనసులో పెట్టుకుని జీవితంపై విరక్తి చెంది శుక్రవారం వేకువ జామున తన ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి మాజీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇంటినిర్మాణం పూర్తయినవారికి అకౌంట్‌లో డబ్బులు జమ

### కలెక్టర్ హైమావతి ఆదేశం



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కార్యాలయం సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ గూర్చి ఎంపిడిఓలు. హౌసింగ్ ఎఇ, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మండలాల్లో ఇందిరమ్మ గృహాలు ఎన్ని మంజూరైనాయని. ఎన్ని గ్రౌండింగ్‌లో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్నవి, బెస్‌మెంట్ గోడలు, స్లాబ్ స్థాయిలో ఎన్ని నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో ఎన్ని నిలిచిపోయావో పేమెంట్ వివరాలపై అధికారులతో ఆరా తీశారు. మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇళ్లగ్రౌండింగ్ కావాలని. మంజూరైన కట్టుకోనివారితో చర్చించి ఎందుకు గల కారణాలను తెలుసుకోవాలని, నిర్మాణానికి సుముఖంగా లేని యెడల అప్లికేషన్ డిలిట్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఎంపిడిఓ. ఎంపిఓ ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామం వారిగా అయా స్థాయిలో ఉన్న నిర్మాణాలను తరుచుగా పరావేక్షణ చేస్తూ గృహనిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. అయా స్థాయిలో పూర్తికాగానే ఫోటో క్యాప్చర్ చేయాలని గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పేమెంట్ విషయంలో లబ్దిదారులకు గల ఆపోహాలను తొలగించి తప్పనిసరిగా ప్రభుత్వం లబ్దిదారులకు నిధులు వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఈసమీక్షలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్‌కుమార్, డిఈలు పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియం పునరుద్ధరణ పనులు పరిశీలించిన: కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా కేంద్రం లోని పురాతన పాఠశాల పరిధిలో గల జిల్లా సైన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజియంలో పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్న గదులను పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన ఆర్ట్ క్రాఫ్ట్ ప్రదర్శన గురించి పలు సూచనలు ఇచ్చారు. బిర్లా ప్లాంటోరియం నుండి సప్లై చేయబడిన ఇన్ఫినిటీ వెల్ , డిఎన్ఏ మోడల్, బయాలజికల్ మోడల్స్, గ్లోబ్ మోడల్, మ్యాగ్నెటిక్ లైన్స్, వరల్డ్ క్లాక్, సోలార్ పవర్ వంటి ఎగ్జిబిట్ లను పరిశీలించారు. మ్యూజియంలో ఏర్పాటు చేయబోయే ప్రతి ఎగ్జిబిట్ గురించిన పూర్తి సమాచారం ప్రదర్శించాలని అన్నారు. విద్యార్థులు మ్యూజియం ని సందర్శించి విషయ పరిజ్ఞానాన్ని నేర్చుకుని వెళ్లేలా తీర్చిదిద్దాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి మ్యూజియంను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని సైన్స్ అధికారులను ఆదేశించారు. జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 24న జాబ్ మేళా

### జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ ,యువకులకు సాక్సెస్ ప్రాజెక్టు ఎల్ఎల్పి కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఫిబ్రవరి 24 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో మొత్తం 51 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 50, మార్కెటింగ్ మేనేజర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబిఎ, మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్ డిగ్రీ విద్య అర్హతలు కలిగిన వారు అర్హులని, వయస్సు 18 నుంచి 36 మధ్యలో ఉండాలని అన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 24న ఉదయం 11 గంటలకు సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఎసిపి

**పజాపక్షం/హుస్నాబాద్ :** మండల పరిదిలోని ప్రతి గ్రామా గ్రామాన సీసీ కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని హుస్నాబాద్ ఏసీపి సదానందం గ్రామ సర్పంచులకు, ఉప సర్పంచులకు సూచించారు. శుక్రవారం అయన హుస్నాబాద్ మండల పరిదిలోని నూతన సర్పంచులు, ఉపసర్పంచులతో నేరాల నియంత్రణ, వాటి రక్షణపై ఎస్ ఐ లక్ష్మారెడ్డితో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏ సీ పి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూడళ్ల వద్ద ప్రధాన దారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల మీ గ్రామంలో ఎక్కువ శాతం వ్యవసాయ పనులకు వెళ్లు సమయంలో గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు జరిగిన సమయంలో శాంతి భద్రతల పరిరక్షణపై సీసీ కెమెరాల ద్వారా సమాచారం సేకరించవచ్చని ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఆలాగే గ్రామాల్లో ఏమైన విగ్రహాలు ఏర్పాటు చేయలను కుంటే సంబందిత ఆధికారుల నుండి ఆనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబదనలు పాటించాలని , మైనరులకు వాహనాలు ఇవ్వకూడదని ఆలాగే వాహనం సంబందించిన పేపర్లు ,హెల్మెట్ తీసుకుసుకు పోవాలని అన్నారు.

## శుక్రవారం సభ ద్వారా ప్రజారోగ్యాన్ని పర్యవేక్షణ

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** శుక్రవారం సభల్లో అంగన్వాడి, వైద్య సిబ్బంది ద్వారా నివేదిక తెప్పించుకుని ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చొప్పదండి మండలం చాకుంట అంగన్వాడి కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తల్లీపిల్లల ఆరోగ్యానికి, పోషణకు శుక్రవారం సభ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. పిల్లల ఆరోగ్యం పై ఎలాంటి సందేహాలు ఉన్నా శుక్రవారం సభలో ప్రభుత్వ వైద్యునికి తెలియజేయాలన్నారు. ప్రతినెలా అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామాల వారీగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన నివేదిక తెప్పించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న శిశువుల పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అలాంటి పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అతిగా బరువు తక్కువ ఉన్న చిన్నారులను ఎన్ఆర్సి లో చికిత్స అందించి సాధారణ బరువు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు. శుక్రవారం సభలో 95 శాతం మంది మహిళలు ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారని, 245 మంది మహిళలకు రెండవ దఫా స్క్రీనింగ్ పూర్తయిందని, ఇది మంచి విషయమని అన్నారు. శుక్రవారం సభలో ఏర్పాటు చేసే హెల్త్ క్యాంపులను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళా సర్పంచులు శుక్రవారం సభ నిర్వాహణకు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలు పూర్తయ్యేంతవరకు పిల్లలను కచ్చితంగా ప్రతిరోజు బడికి, ప్రత్యేక తరగతులకు పంపించాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, శిశువులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ పురం మాధవి, ఉపసర్పంచ్ వేముల శేఖర్, సిడిపిఓ నర్సింగారాణి పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో అక్రమాలను ఉపేక్షించం

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో శుక్రవారం లబ్దిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని చింతలపల్లి, ముత్తారం గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. అంతకుముందు లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు అందాల్సిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందకుండా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. లబ్దిదారులకు నేరుగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ సురేఖ, ఎంపిడివో కృష్ణ ప్రసాద్, ఏఈ మల్లేశం, ఎంపివో ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, సర్పంచులు చింతల లావణ్య శ్రీనివాస్, మారవేణి రాజయ్య, రాజేంద్ర ప్రసాద్, తాళ్లపల్లి మొగిలి, మాజీ సర్పంచులు కవ్వ పద్మ, పల్లె సంజీవరెడ్డి, పల్లె పాపిరెడ్డి, నాయకులు మధుకర్, దుర్గం తిరుపతి, రాయిని రమేష్, మహేష్, జంపయ్య, పాల్గొన్నారు.

## యువతకు అగ్నివీర్ పరీక్షల కోసం 90 రోజుల్లో ఉచిత శిక్షణ

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** జిల్లాలో ఆసక్తి గల యువతకు అగ్ని యూపిహెచ్ఎస్ పరీక్షల సన్నద్ధం అయ్యేందుకు వీలుగా 90 రోజుల పాటు శారీరక ,లిఖిత పరీక్షల కోసం ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని యువతకు సైన్యంలో చేరే అర్హత సాధించేందుకు "అగ్నివీర్ యూపిహెచ్ఎస్ శిక్షణ పథకం – 2026" కార్యక్రమ ద్వారా అగ్నివీర్ అభ్యర్థులకు పూర్తి స్థాయి శారీరక లిఖిత పరీక్షల శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్, మెడికల్ పరీక్షల అవగాహన, రాత పరీక్ష కోచింగ్, గ్రౌండ్ ప్రాక్టీస్, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.ఆసక్తి గల యువత ఫిబ్రవరి 23 లోపు తమ పేర్లు ఉచిత శిక్షణ కోసం రిజిస్టర్ చేసుకోవాలని, ఫిబ్రవరి 25న దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ పరీక్షల నిర్వహించి శిక్షణ కొరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఒకటి నుంచి మే 31 వరకు శిక్షణ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లా పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని వీరి వయస్సు 17.5 నుండి 22 మధ్యలో ఉండాలని అన్నారు.శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, శిక్షణ తరగతులు, గ్రౌండ్ ప్రాక్టీస్, స్టడీ మెటీరియల్ అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత తేదీలలో రుద్రమ దేవి స్టేడియం, సెంటెనరీ కాలనీ, రామగిరి నందు ఉదయం 6:00 గంటల నుండి 8:00 గంటల వరకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని మరిన్ని వివరాలకు 9573688952, 9949725997, 8106807784 నెంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి జి.శారద, కవిత సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/కరీంనగర్:** గ్రామం సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ హాజరయ్యారు. చొప్పదండి, చిగురుమామిడి, గన్నేరువరం మండలాలకు చెందిన 50 మంది సర్పంచులకు ఇక్కడ ఈనెల 17 నుండి 21వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, సర్పంచులు పంచాయతీరాజ్ చట్టం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామపంచాయతీ పనుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్క సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, సాంకేతిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా ప్రజా సౌకర్యాలపై మరింత శ్రద్ధ పెట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సర్పంచులు పాల్గొన్నారు.

## వాస్తవాలకు దగ్గరగా ఉండే బడ్జెట్ రూపొందించాలి: హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ రూపొందించాలని .. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో 37 వార్డులో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేది నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తయిందని, ఆనాడు సోనియగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ. రేవంత్‌రెడ్డిలు అందరు బాండ్‌పేపర్ల మీద రాసిచ్చి వంద రోజుల్లో ఆరుగ్యారంటీలను అమలు చేస్తామని హామీలిచ్చారన్నారు. కాని వందరోజులు కాదుకదా, 800 రోజులు పూర్తయిన ఇప్పటికి ఆరుగ్యారంటీలు అమలవుతున్న దాఖలాలు లేవన్నారు. ఎస్సీ డిక్లరేషన్ పేరిట దళితులకు 18శాతం రిజర్వేషన్లు, ఎస్సీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని మోసం చేశారన్నారు. చదువుకునే పిల్లలకు టెన్స్ పాస్ అయితే 10వేలు, ఇంటర్ పాస్ అయితే 25వేలు, డిగ్రీకి 50 వేలు, పీజి చదివితే లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి ఈరోజువరకు ఒక్క విద్యార్థికి కూడ ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని, కనీసం కెసిఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు కూడ రావటం లేదన్నారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైన వాస్తవాలకు ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలన్నారు.

## నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జువ్వాడి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తూ ఎల్లవేళలా కట్టుబడి ఉందని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మిగిలిపోయిన గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం వేగవంతంగా చేపట్టి శుక్రవారం గృహప్రవేశం చేయగా కృష్ణారావు పాల్గొని ఐదువేల రూపాయల నగదును లబ్ధిదారులకు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోల్కొండ కళా రమేష్,ఉప సర్పంచ్ దండావేని రాజేందర్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

## గ్రూప్–1లో టాపర్స్.. గ్రూప్–2లో రెండో ర్యాంకర్లు..

# సెమీస్ గడప తొక్కేది ఎవరు?



పొట్టి ప్రపంచకప్‌లో లీగ్ దశను అజేయంగా ముగించిన నాలుగు జట్లు నాకౌట్ పోరుకు సిద్ధమవుతున్నాయి. టేబుల్ టాపర్స్‌గా గ్రూప్–1లో చోటు దక్కించుకున్న భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వేల మధ్య సూపర్–8 రసవత్తరంగా ఉండనుంది. రెండో ర్యాంక్‌తో గ్రూప్– 2లో నిలిచిన శ్రీలంక, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ సైతం తగ్గ పోరుకు సై అంటున్నాయి. అయితే అందరి కళ్లన్నీ గ్రూప్ 1–మీదే. ఎందుకంటే.. కలల కప్ వేటలో దక్షిణాఫ్రికా, జింబాబ్వే.. మూడో కప్పును ముద్దాడాలని టీమిండియా, విండీస్ పట్టుదలతో ఉన్నాయి. ఈచతుష్టయంలో సెమీస్ గడప తొక్కే రెండు జట్లు ఏవి?అనేది ఆసక్తి రేపుతోంది.

లీగ్ దశలో దూకుడు కనబరిచిన ఎనిమిది జట్లు సూపర్–8 దాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. గ్రూప్–1లో అన్ని టాపర్స్.. గ్రూప్–2లో సెకండ్ ర్యాంకర్స్ ఉండడంతో.. సెమీస్ చేరే జట్లేవే అంచనా వేస్తున్నారు మాజీలు, కామెంటేటర్లు. భారత జట్టుతో మొదలెడితే.. డిఫెండింగ్ ఛాంపియన్ జోరు చూపిస్తూ సూపర్–8లో అడుగుపెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మూడు డకౌట్లతో నిరాశపరిచినా.. ఇషాన్ కిషన్ (నమీబియాపై 61, పాకిస్థాన్‌పై 77) మ్యాచ్ విన్నర్‌గా అవతరించాడు. మిడిల్ ఓవర్లలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(యుఎస్ఎపై 84 పరుగులు), శివం దూబే(నమీబియా, నెదర్లాండ్స్‌పై 66 పరుగులు), హార్దిక్ పాండ్యా( నమీబియాపై 52)లు బ్యాటింగ్ భారం మోస్తున్నారు. బౌలింగ్ యూనిట్‌లో బుమ్రా.. వరుణ్ చక్రవర్తి (9 వికెట్లు) మాత్రమే వికెట్లతో చెలరేగుతున్నారు. సూపర్–8 దాటాలంటే.. ఒకరిద్దరు రాణిస్తే సరిపోదు.. సమిష్టిగా ప్రత్యర్థిని దెబ్బకొట్టాల్సి ఉంటుంది.

**సఫారీ సైన్యం రెడీగా...**చోకర్స్ ముద్ర నుంచి బయటపడి డబ్ల్యూటిసి టైటిల్ కొల్లగొట్టిన దక్షిణాఫ్రికా కూడా టైటిల్‌పై గురి పెట్టింది. గత సీజన్‌లో టీమిండియా చేతిలో 7 పరుగుల తేడాతో ఓడి.. చేజార్చుకున్న ట్రోఫీని ఒడిసిపట్టేందుకు సఫారీ సైన్యం రెడీగా ఉంది. అందుకు తగ్గట్టే గ్రూప్–డిలోని మర్కరమ్ సేన లీగ్ దశను 4–0తో ముగించింది. సారథిగానే కాదు ఓపెనర్‌గా అదరగొడుతున్న మర్కరమ్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. రికెల్టన్, డికాక్, డెవాల్ బ్రెవిస్.. స్టబ్స్, మిలర్‌తో ప్రొటిస్ జట్టు బ్యాటింగ్ యూనిట్ దుర్భేద్యంగా ఉంది. మార్కో యాన్సెన్ బంతితో నిప్పులు చెరుగుతున్నాడు. ఎంగిడి, కేశవ్ మహరాజ్‌లు జట్టు విజయాల్లో కీలకమవుతున్నారు. సూపర్–8లోనూ చెలరేగేందుకు సిద్ధంగా ఉన్న సఫారీలు తొలిసారి పొట్టి కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్నారు.

**ఆటే సంచలనం..** చిన్న జట్టుగా వరల్డ్‌కప్‌లోకి ఎంట్రీ ఇచ్చిన జింబాబ్వే సంచలన విజయాలతో గ్రూప్–బి నుంచి నాకౌట్ చేరింది. తొలి పోరులో ఒమన్‌పై విజయంతో ఖాతా తెరిచిన ఆఫ్రికా జట్టు.. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను వణికించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(64 నాటౌట్) అర్ధ శతకంతో మెరవగా.. పేసర్ బ్లెస్సింగ్ ముజరబని(417), ఎవాన్స్(323)ల జోరుతో ఆసీస్ను 23 పరుగులతో గెలిచి చరిత్ర సృష్టించింది సికిందర్ రజా బృందం. ఐర్లాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం కావడంతో సూపర్–8కు దూసుకెళ్లిన జింబాబ్వే.. చివరి లీగ్ మ్యాచ్‌లో తడాఖా చూపింది. బ్లెస్సింగ్ ముజరబని(238), ఎవాన్స్(235) రాణించగా 179 పరుగుల ఛేదనలో శ్రీలంక స్పిన్ ఉచ్చును ఛేదించింది. బెన్నెట్(63 నాటౌట్), కెప్టెన్ సికిందర్ రజా 26 బంతుల్లోనే 45 రన్స్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పారు.

**సమిష్టిగా రాణిస్తూ...** సన్నాహక సిరీస్‌లో నేపాల్ చేతిలో సిరీస్ ఓటమి నుంచి తేరుకున్న వెస్టిండీస్ మెగా టోర్నీలో పంజా విసురుతోంది. గ్రూప్–సి తొలి పోరులో స్కాంట్‌లాండ్‌ను 35 పరుగులతో, ఇంగ్లాండ్‌ను 30 రన్స్ తేడాతో ఓడించిన విండీస్.. నేపాల్‌పై 9 వికెట్ల విజయంతో నాకౌట్ బెర్తు సాధించింది. ఈసారి ఐపిఎల్ స్టార్లు హెట్‌మైర్, రూథర్‌ఫోర్డులు దంచేస్తుండగా.. కెప్టెన్ షాయ్ హోప్ సైతం కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. ఇక సీనియర్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్(7 వికెట్లు) బంతితో చెలరేగుతున్నాడు. సమిష్టిగా రాణిస్తున్న కరీబియన్ జట్టు ఆల్‌రౌండ్ షోతో నాలుగుకు నాలుగు మ్యాచులలో గెలిచి దర్జాగా సూపర్–8లో పాగా వేసింది. ఇదే జోరును నాకౌట్ దశలోనూ చూపిస్తే రెండుసార్లు డారెన్ సమీ సారథ్యంలో కప్‌ను తన్నుకుపోయిన విండీస్ ఫైనల్ ఆడే అవకాశాలను కొట్టిపారేయలేం.

### సూపర్– 8 షెడ్యూల్

ఫిబ్రవరి 21 న్యూజిలాండ్ VS పాకిస్థాన్, పల్లెకెలె స్టేడియం, రాత్రి 7 గంటల నుంచి
ఫిబ్రవరి 22 ఇంగ్లండ్ VS శ్రీలంక, పల్లెకెలె స్టేడియం, మధ్యాహ్నం 3 గంటలకు
భారత్ VS దక్షిణాఫ్రికా, అహ్మదాబాద్, రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 23 జింబాబ్వే VS వెస్టిండీస్ ముంబై వాంఖడే స్టేడియం రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 24 ఇంగ్లండ్ VS పాకిస్థాన్ పల్లెకెలె స్టేడియం రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 25 న్యూజిలాండ్ VS శ్రీలంక, కొలంబో ప్రేమదాస స్టేడియం, రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 26 వెస్టిండీస్ VS దక్షిణాఫ్రికా, అహ్మదాబాద్, మధ్యాహ్నం 3 గంటలకు
భారత్ VS జింబాబ్వే చిదంబరం స్టేడియం, రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 27 ఇంగ్లండ్ VS న్యూజిలాండ్, ప్రేమదాస స్టేడియం, రాత్రి 7 గంటలకు
ఫిబ్రవరి 28 పాకిస్థాన్ VS శ్రీలంక పల్లెకెల్ స్టేడియం రాత్రి 7 గంటలకు
మార్చి 1 జింబాబ్వే VS దక్షిణాఫ్రికా, అరుణ్ జైట్లీ స్టేడియం, మధ్యాహ్నం 3 గంటలకు
భారత్ VS వెస్టిండీస్, ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కత్తా), రాత్రి 7 గంటలకు
మార్చి 4న తొలి సెమీఫైనల్.. మార్చి 5న రెండో సెమీఫైనల్..
మార్చి 8 న ఫైనల్లో విజేతగా నిలిచిన జట్టు ట్రోఫీని అందుకుంటుంది.

## సైన్స్

# పదార్థంపై కాంతి ప్రభావం?



కొన్ని మినహాయింపులను పక్కకుపెడితే, ఒక పదార్థం గుండా కాంతి ప్రసరించదు. అయితే, కాంతి ఏకంగా పదార్థాన్ని వక్రీభవానికి గురి చేస్తుందని లేదా వంచగలుగుతుందని, అంతర్జాతీయ పత్రికలను ఉటంకిస్తూ వార్తలు వస్తున్నాయి. అన్నిటికీ క్వాంటం సిద్ధాంతాన్ని జోడించడం, అర్థంకాని పదజాలంతో వార్తను నింపేయడంతో, వాస్తవాలు మరుగునపడే ప్రమాదం ఉంది. అనేకానేక చర్యలు శాస్త్రపరంగా సాధ్యమేగానీ, వాస్తవంలో అసాధ్యం. వెలుగు చుంబన శక్తిగా మారి, పదార్థం వక్రీభవనానికి కారణమవుతుందనే ప్రతిపాదన కూడా ఇలాంటిదే. దీనిని క్వాంటం ఆప్టిక్స్, ఘనస్థితి భౌతిక శాస్త్ర విస్తరణలుగా చూడాలి. సాధారణంగా వెలుగు ఒక శక్తి. దీనికి రేఖీయ గతి పరిమాణం (రుజుమార్గంలో ప్రయాణించే తత్వం) ఉంటుంది. రేడియేషన్ ప్రెషర్ వంటి ఘటనలు ఈ సిద్ధాంతాన్ని నిరూపించాయి. అయితే క్వాంటం సిద్ధాంతం ప్రకారం ఫోటాన్లు కోణీయ భ్రమణం (యాంగ్యులర్ మూమెంట్) కూడా తీసుకెళతాయి. ఇందులో స్పిన్ యాంగ్యులర్ మొమెంటమ్ (పోలరైజేషన్‌కు సంబంధించినది), ఆర్బిటల్ యాంగ్యులర్ మొమెంటమ్ (తిరుగుతూ వ్యాపించే తరంగ ముఖరేఖలకు సంబంధించినది) ఉంటాయి. ఇలాంటి కాంతిని స్ట్రక్చరల్ లైట్ లేదా ట్విస్టెడ్ లైట్ అని వ్యవహరిస్తారు. ఈ కోణీయ భ్రమణం కలిగిన కాంతి పదార్థంలోని ఎలక్ట్రాన్లతో పరస్పర చర్యలోకి వచ్చినప్పుడు, వాటి సమూహ కదలికలో మార్పులు కలిగించగలనరై వాదన ప్రస్తుతం బలంగా వినిపిస్తున్నది. ముఖ్యంగా ఇన్వెర్స్ ఫారాడే ఎఫెక్ట్ అనే ప్రభావం ఇక్కడ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సాధారణ ఫారడే ప్రభావంలో మాగ్నెటిక్ ఫీల్డ్ కాంతి ధ్రువీకరణాన్ని ప్రభావితం చేస్తుంది. కానీ ఇన్వెర్స్ ఫారాడే ఎఫెక్ట్ వృత్తాకార ధ్రువీకరణ (సర్క్యులర్ పోలరైజేషన్) గల కాంతి ఒక పదార్థంపై పడినప్పుడు, ఆ పదార్థంలో తాత్కాలిక మాగ్నెటిక్ మొమెంట్‌ను ప్రేరేపించగలదు. ఇది బయటి మాగ్నెట్ లేకుండానే జరుగుతుంది. ఈ ప్రభావం వెనుక ఉన్న భౌతికతను సూత్రప్రాయంగా పరిశీలిస్తే, ఎలక్ట్రాన్లు ఛార్జ్ కలిగిన కణాలు కావడంతో కాంతి యొక్క ఎలక్ట్రిక్, మాగ్నెటిక్ ఫీల్డ్‌తో పరస్పరం చర్యలోకి వస్తాయి. వృత్తాకార ధ్రువీకరణ గల కాంతి ఎలక్ట్రిక్ ఫీల్డ్ కాలానుగుణంగా తిరుగుతూ ఉంటుంది. ఇది ఎలక్ట్రాన్లలో ఒక సమన్విత కదలికను ప్రేరేపించి, సమూహ స్థాయిలో అది మాగ్నెటిక్ ఆర్డరింగ్ మార్పుగా వ్యక్తమవుతుంది. ఇది నిజమైన స్థిర మాగ్నెట్ కాదు. అల్ట్రాఫాస్ట్, తాత్కాలిక, కాంతి ఆధారిత మాగ్నెటిక్ ప్రతిస్పందన మాత్రమే. కాగా, ప్రస్తుత మాగ్నెటిక్ నియంత్రణ పద్ధతులు ప్రధానంగా విద్యుత్ ప్రవాహాలపై ఆధారపడి ఉంటాయి. విద్యుత్ ప్రవాహం ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది, శక్తి నష్టాన్ని కలిగిస్తుంది, వేగ పరిమితులు కలిగి ఉంటుంది.ఇది అల్ట్రాఫాస్ట్ స్పిన్‌ట్రానిక్స్, తక్కువ ఉష్ణ నష్టంతో డేటా నిల్వ, క్వాంటం నియంత్రణలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే ఇది ఇంకా ప్రయోగశాల స్థాయి పరిశోధన. అధిక తీవ్రత గల లేజర్లు, నియంత్రిత నమూనాలు, ప్రత్యేక పదార్థాలు అవసరం. వినియోగదారుల ఎలక్ట్రానిక్స్‌లో ప్రత్యక్ష అమలు దూరంలోనే ఉంది. సాంకేతిక మార్పిడికి పదార్థ శాస్త్రం, పరికర ఇంజనీరింగ్, స్థిరత్వ విశ్లేషణలో మరింత పురోగతి అవసరం. శాస్త్రీయ దృష్టిలో ఇది ముఖ్యమైన అంశాన్ని స్పష్టంచేస్తుంది.

### ఆర్కిటిక్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఇటీవలి శాస్త్రీయ అధ్యయనాలు ఆర్కిటిక్ ప్రాంతంలో వేగంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు అక్కడి సున్నితమైన జీవవ్యవస్థలను విదేశీ ఆక్రమణ మొక్కల ప్రమాదానికి గురిచేస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. గతంలో ఆర్కిటిక్‌లో తీవ్ర చలి, చాలా చిన్న పెరుగుదల కాలం, శాశ్వత మంచు నేలలు (పర్మాఫ్రాస్ట్), మానవ జోక్యం తక్కువగా ఉండటం వలన విదేశీ మొక్కలు స్థిరపడే అవకాశాలు చాలా తగ్గేవి. అయితే ఇప్పుడు ఉష్ణోగ్రతలు వేగంగా పెరగడం వల్ల ఈ సహజ నిరోధకాలు బలహీనపడుతున్నాయి. మంచు కరుగుదల పెరగడం, పెరుగుదల కాలం పొడవు కావడం, నేల ఉష్ణోగ్రతలు పెరగడం వంటివి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఒక తాజా నమూనా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 2,554 రక్తనాళిక మొక్కల జాతులు వేడెక్కుతున్న ఆర్కిటిక్‌లో అనుకూల వాతావరణాన్ని పొందే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్కిటిక్ వ్యాప్తంగా 341 విదేశీ టాక్సాలను గుర్తించగా, అందులో 188 సహజీకరించబడ్డాయి. స్వాల్‌బర్డ్ ద్వీప సమూహంలో సాధారణంగా కనిపించే 'కామన్ మీడో ర్యూ' వంటి విదేశీ జాతులను గుర్తించారు. ఇది ప్రమాదం ఊహ కాదు, వాస్తవమని సూచిస్తోంది. పశ్చిమ అలాస్కా, దక్షిణ పశ్చిమ మరియు దక్షిణ తూర్పు గ్రీన్‌లాండ్ ఉత్తర ఐస్లాండ ఫెనోస్కాండియా, కానిన్–పెచోరా ప్రాంతాలు ప్రధాన ఆక్రమణ హాట్‌స్పాట్‌లుగా గుర్తించబడ్డాయి.

### వాయువులు, ధూళితో నిండిన నెబ్యులా



నెబ్యులర్ సిద్ధాంతం సౌర కుటుంబం ఏర్పాటును వివరించే తొలి శాస్త్రీయ సిద్ధాంతాలలో ఒకటి. సూర్యుడు, గ్రహాలు, ఇతర ఖగోళ వస్తువులు ఒక విస్తారమైన వాయు–ధూళి మేఘం నుండి అభివృద్ధి చెందాయని ఇది వివరిస్తుంది. ఈ ఆలోచనను 18వ శతాబ్దంలో ఇమ్మాన్యుయెల్ కాంట్, పియేరీసిమన్ లాప్లేస్ ప్రతిపాదించారు. ఆధునిక గ్రహాల ఆవిర్భావ సిద్ధాంతాలకు ఇది పునాది అయింది. నెబ్యులా అనేది అంతరిక్షంలో కనిపించే వాయువులు, ధూళి , సూక్ష్మ కణాలతో కూడిన భారీ మేఘం. ఇవి ప్రధానంగా హైడ్రోజన్, హీలియం వాయువులతో కూడి ఉంటాయి. నక్షత్రాల పేలుళ్లు లేదా గురుత్వాకర్షణ శక్తి వల్ల వాయు–ధూళి సమాహారం ఏర్పడినప్పుడు నెబ్యులాలు ఉత్పత్తి అవుతాయి. కొన్ని నెబ్యులాలు సమీప నక్షత్రాల కాంతి వల్ల ప్రకాశిస్తాయి. మరికొన్ని కాంతిని అడ్డుకోవడం వల్ల చీకటి మేఘాలుగా కనిపిస్తాయి. కాంట్ 1755లో ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం విశ్వం మొదట చల్లటి, స్థిర కణాలతో నిండి ఉండేది. గురుత్వాకర్షణ వల్ల కణాలు ఢీకొని వేడి ఉత్పత్తి అయ్యింది.. అప్పుడే చలనము ప్రారంభమైంది. ఈ చలనంతో కోణీయ సవరణ ఏర్పడి భ్రమణం మొదలైంది. ఈ భ్రమణం వేగవంతమవడంతో కేంద్రాభిముఖ శక్తి ప్రభావంతో వలయాలు ఏర్పడి, అవి చల్లబడుతూ గ్రహాలు, ఉపగ్రహాలుగా మారాయని ఆయన పేర్కొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి సహకారం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ 25వ వార్డు సిపిఐ కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్‌ను అంగన్‌వాడీ కేంద్రం ధర్మన్న కాలనీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్ ఈవెంట్ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం సిబ్బంది అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాకి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ డిడబ్ల్యుఒ సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా 25వ వార్డుకు కౌన్సిలర్‌గా ఎన్నికైన నర్రా సంధ్య శ్రావణ్, సిడిపిఒ శిరీష పాల్గొన్నారు. అనంతరం నర్రా సంధ్య శ్రావణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పరిష్కారినికి సహకారం అందిస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి కృషిచేస్తానని కౌన్సిలర్ సంధ్యశ్రావణ్ హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం టీచర్ కె.అండాలు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ గోపి కృష్ణ , సూపర్వైజర్ కవిత, హెల్పర్, పిల్లలు, గర్భిణిలు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయ్ హమాలీలకు నూతన వేతన ఒప్పందం జరగాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ హమాలీలకు లారీ అసోసియేషన్ యజమాన్యం లారీ మామూలు పెంచి నూతన ఒప్పందం చేసుకోవాలని శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్త సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్ కరీంనగర్‌లో రాకేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా సివిల్ సప్లయ్ హమాలీలకు ఐదు సంవత్సరాల క్రితం బియ్యం దిగుమతి లోడింగ్ మామూలు లారీ అసోసియేషన్ యజమాన్యం తో రూ.1.40 పైసలు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారమే లారీ మామూలు ఇస్తున్నారు.. కానీ రెండు సంవత్సరాలకు ఒకసారి లారీ మామూలు పెంచాలి .. లారీ మామూలు పెంచాలని అనేకసార్లు విన్నవించినా కూడా ఒక్క రూపాయి కూడా పెంచ లేదనీ, ఇప్పటికైనా లారీ అసోసియేషన్ యాజమాన్యం చర్చలు జరిపి నూతన ఒప్పందం చేసుకోవాలన్నారు. యాజమాన్యం స్పందించకుంటే సివిల్ సప్లయ్ కార్పొరేషన్ గోదాంలలో బియ్యం బస్తాల దిగుమతిని అడ్డుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో వి.సాంబమూర్తి, ఎం.కుమార్, ఏం.తిరుపతి, గట్టయ్య, మల్లేష్, శ్రీనివాస్, మల్లేశం, రాజేష్, దుర్గయ్య, పోషమల్లు, సాయిబాబా, నరసయ్య, బి.శ్రీనివాస్, కదారి శంకర్, గుర్రం నరేష్, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విస్తరణ, ప్రజా పోరాటాలే లక్ష్యం

కౌన్సిలర్ల అభినందన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదరి కూనంనేని





**ప్రజాపక్షం/ఖమ్మం :** పార్టీ విస్తరణ, ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధర్మ యుద్ధం జరిగిందని సిపిఐని ఒంటరిని చేసి ఓడించేందుకు ప్రయత్నాలు జరిగాయని, అధర్మ యుద్ధంలోనూ ధర్మంగా గెలిచామని ఆయన తెలిపారు. సిపిఐ పక్షాన ఏదులాపురం, వైరా మున్సిపాలిటీలలో గెలుపొందిన కౌన్సిలర్ల అభినందన సభ శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నికలు ఒక భాగమన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని పాటించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 41చోట్ల మున్సిపల్, కార్పోరేషన్లలో విజయం సాధిస్తే అందులో 30 స్థానాల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ చేసి గెలిచిందన్నారు. ఐదు చోట్ల కాంగ్రెస్ మద్దతు, ఆరు చోట్ల బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి విజయం సాధించామన్నారు. ఎన్నికల్లో గెలుపు ప్రజలు హర్షించేవిధంగా ఉండాలి తప్ప ఏదో ఒకవిధంగా గెలవాలన్న ఆలోచన ప్రమాదకరమైందని అది ప్రజామోదం పొందదని కూనంనేని తెలిపారు. అధికార యంత్రాంగం సైతం ప్రజాస్వామ్య పద్ధతులను పరిరక్షించేందుకు కృషి చేయాలని, అధికారంలో ఉన్న వారు ఏమి చెబితే అది చేయడం ఉద్యోగ ధర్మం కాదని సాంబశివరావు సూచించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినా గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని ఓటమి నుంచి విజయం వైపు అడుగులు వేయాలని ఆయన అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పట్టుదలతో పని చేసి విజయం దిశగా పార్టీని నడిపించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో గెలుపొందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, వైరా మున్సిపాలిటీలో గెలుపొందిన నల్లమోతు శైలజను కూనంనేని ఘనంగా సన్మానించారు. కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అద్భుత విజయం సాధించిన సందర్భంగా ఖమ్మంజిల్లా నాయకులు కూనంనేనిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో చేరిన సర్పంచ్ సరస్వతి

కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని



**భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావు పేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి శుక్రవారం సిపిఐలో చేరారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్‌గా గ్రామపంచాయతీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా గెలిచిన సరస్వతి ఎమ్మెల్యే కూనంనేని సారథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐలో చేరినట్లు తెలిపారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షుడు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబు పాల్గొన్నారు.

# క్యాతనపల్లిలో కాంగ్రెస్ అరాచకాలు

సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆగ్రహం



**ప్రజాపక్షం /మంచిర్యాల :** క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధికార అహంకారంతో అరాచకాలకు పాల్పడుతోందని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మండిపడ్డారు. శుక్రవారం క్యాతనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికల్లో సిపిఐ, బిఆర్ఎస్ కూటమి 22 స్థానాల్లో పోటీ చేసి 14 వార్డులను గెలుచుకుని స్పష్టమైన మెజార్టీ సాధించిందని తెలిపారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ దొడ్డిదారిన చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపి గడ్డం వంశీకృష్ణ ప్రజాతీర్పును గౌరవించి ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. మెజారిటీ సభ్యులు తమ వైపు ఉన్నప్పటికీ అధికారులు, పోలీసులతో సహకారంతో చైర్మన్ ఎన్నికను రెండుసార్లు వాయిదా వేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ నాయకులు తమ కూటమి సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. 8వ వార్డు సభ్యుడు మునిపై దాడి చేసి బలవంతంగా తమ వైపు లాక్కునే ప్రయత్నం చేశారని, ఎస్‌టి కులానికి చెందిన సభ్యుడిపై దాడి జరుగుతుంటే అధికారులు మౌనంగా ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. ఈనెల 17న జరిగిన సంఘటనలకు సంబంధించిన సిసి ఫుటేజీలను జిల్లా కలెక్టర్ బహిర్గతం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 21వ వార్డు సభ్యురాలు బబ్బర స్వర్ణలతను కిడ్నాప్ ఫిర్యాదు పేరుతో పోలీసులు అడ్డుకోవడం కుట్రలో భాగమేనని విమర్శించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, బిఆర్ఎస్ నాయకులు బాల్క సుమన్ తదితరులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఆ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, కాదండి సాంబయ్య, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, ఏగుడ మొండి, మహిళా సమాఖ్య కార్యదర్శి గాజుల మణెమ్మ, నాయకులు రాజేశం, రాయలింగు, శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్, భాస్కర్, నరేష్, రాజన్న పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలు అభినందనీయం

సిపిఐ 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కారల్ మార్క్స్ కాలనీ 24 వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని శరత్ మ్యాక్సీ విజన్ వారి సహకారంతో ప్రారంభించడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు, 24 వ వార్డు ఇంచార్జ్ వేముల శ్రీకాంత్, కౌన్సిలర్ వేముల జ్యోతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేముల జ్యోతి మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించండం అభినందనీయమన్నారు. 24వ వార్డులో ఉన్న ప్రజలందరూ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదే విధంగా ఇటువంటి వైద్య శిబిరాలు 24 వార్డులో కౌన్సిలర్ వేముల జ్యోతి ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు అశోక్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఇర్ఫాన్, షాబీర్ ఖాన్, సతీష్, చారి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పెంచాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విధుల పట్ల నిబద్ధతతో ఉంటూ, ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతూ కొత్తగా నియమితులైన ఉద్యోగులు జవాబుదారితనంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నందు ఖమ్మం రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందిన 15 మందికి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ నియామక పత్రాలను అందజేశారు. జిల్లా రెవెన్యూ శాఖలో విధులను నిర్వహిస్తున్న 15 మంది నాలుగో తరగతి డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్ కేటగిరీ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించిన సందర్భంగా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది విషయ పరిజ్ఞానాన్ని, విధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. డ్రాఫ్టింగ్, కంప్యూటర్ వినియోగంపై పట్టు సాధించాలని సూచించారు. ప్రజలకు త్వరితగతిన పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజా సేవలో ముందుండాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ డివిజన్ల ప్రతినిధులు, కలెక్టరేట్ యూనిట్ సభ్యులు, పదోన్నది పొందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ. 12 లక్షలు చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం పట్టణంకు చెందిన మేదమెట్ల శ్రీనివాసరావు వద్ద తిరువూరుకు చెందిన కె. రాజేంద్రప్రసాద్ 2016లో రెండు దఫాలుగా రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. అదే రోజు ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో బ్యాంకు చెక్కు ఇవ్వగా ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. మేదరమెట్ల శ్రీనివాసరావు ఆర్. నారాయణస్వామి ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. సాక్ష్యలను విచారించిన అనంతరం ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 12 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు.

## హాస్టల్‌లో విద్యార్థుల ఘర్షణ..

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర శివారులోని నారాయణ జూనియర్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులు ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హాస్టల్ గదిలో ఘర్షణ పడ్డారు. విశాల్ అనే విద్యార్థిపై ఇరువురు విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన విశాల్ రెండు రోజులుగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మద్యం మత్తులోనే విద్యార్థులు విశాల్‌పై దాడి చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. హాస్టల్‌లో పర్యవేక్షణ సరిగ్గా లేదని దీనితో విద్యార్థిపై దాడి జరిగిందని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థులు డ్రగ్స్ తీసుకున్నారన్న విషయంపై పలు అనుమానాలకు తావిస్తుంది. హాస్టల్‌లోకి డ్రగ్స్ ఏవిధంగా వస్తుందన్న దానిపై కూడా విచారణ జరిపితే పలు విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అయితే ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఖానాపురం హవేలీ సిఐ తెలిపారు.

## మతసామరస్యానికి ఛత్రపతి కృషి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మతసామరస్యానికి కృషి చేసిన వారిలో ఛత్రపతి శివాజీ ఒకరని ఆధిపత్య కులాలను కాదని రాజ్యాంగాన్ని అధిష్టించి మరాఠ సామ్రాజ్యాన్ని స్థాపించిన మహోన్నతుడు ఛత్రపతి శివాజీ అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. ప్రస్తుత బిజెపి చెబుతున్నట్లుగా హిందూ సామ్రాజ్య నిర్మాణం కోసం శివాజీ పని చేయలేదని శివాజీ అంగరక్షకులు ముస్లిములేనని కోశాధికారి కూడా ముస్లిం అని ఆయన తెలిపారు. సర్వ సైన్యాధ్యక్షునిగా శివాజీచే నియమితుడైన దౌలత్క కూడా ముస్లిం అని సలాం తెలిపారు. శివాజీని అడ్డుపెట్టుకుని మతసామరస్యాన్ని దెబ్బతీయాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. మతోన్మాదులకు స్థానం లేదని దేశంలో ప్రశాంతత మతసామరస్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వాహిదియా మసీదు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌కె సైదా, ఎండి రెహ్మాన్, యాకూబ్, చానా, షేక్ రెహ్మాన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సి గురకుల హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్‌లోని ఎస్సి గురుకుల హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఫిజిక్స్ పరీక్ష సరిగా రాయలేకపోయాననే మనస్థాపంతో ఒక విద్యార్థిని హాస్టల్ భవనం పై అంతస్తు నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. పరీక్షల ఒత్తిడి కారణంగా ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. హాస్టల్ వార్డెన్, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు కౌన్సిలర్‌ను ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

## సిరిపురం గ్రామంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మండలం సిరిపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో నవశకం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మధిర మండల కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు కె.అప్పారావు, నవశకం ఫౌండర్ మేకల రమేష్, సిరిపురం పాలక మండలి సభ్యులు ఇరుగు పుల్లారావు, పవన్‌కళ్యాణ్, నంద్రు విజయరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జీవితాన్ని తీర్చిదిద్దేది చదువొక్కటే

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చక్కటి చదువులు జీవితాన్ని తీర్చిదిద్దుతాయని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో పూర్వవిద్యార్థులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సరంజన్ కుమార్ అగ్రవాల్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు, పలువురి ఆర్థిక చేయూతతో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువు జీవితాలను మార్చే చక్కటి యంత్రమని, చదువుని నమ్ముకున్న వారు చెడిపోయిన దాఖలాలు లేవని తెలిపారు. పేదవాడిని గొప్పవానిగా మార్చే ఏకైక మార్గం చదువు ఒక్కటే అని ఇక్కడ ఉన్న విద్యార్థులంతా మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందుకుని మరింత ముందుకు సాగాలన్నారు. కళాశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమని, ఇందుకు ముందుకు వచ్చిన ప్రతీ ఒక్కరూ అభినందనీయులన్నారు. యువతరం ఒక్క చదువులకే పరిమితం కాకుండా మన చుట్టు ప్రక్కల పరిస్థితులతో పాటు దేశంలో జరిగే ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, వార్తా పత్రికలు, న్యూస్ ఛానళ్ల ద్వారా విషయాన్ని మరింత లోతుగా తెలుసుకోవాలని, పుస్తక పఠనం అలవర్చుకుంటే తెలివితేటలు విస్తృతంగా పెరుగుతాయన్నారు. యువతరం మేధోశక్తిని పెంచుకోవడం ఎంతో అవసరమని, దేశ భవిష్యత్‌కు యువతపై ఆధారపడి ఉందన్నారు. అధ్యాపకులు సైతం విద్యార్థులకు జ్ఞానాన్ని పంచాలని, చదువుల్లో వెనుకబడిన వారిని గుర్తించి అసరమైన ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కళాశాల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చామని, ఇప్పుడు కూడా నూతన భవనాల నిర్మాణం కోసం రూ.3 కోట్ల 86 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సరంజన్ కుమార్ అగ్రవాల్, విద్యానగర్ సర్పంచ్ శాంతి ప్రియ, జాస్తి రమేష్, కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్, జిల్లా జూ.లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర రావు, టిఎన్‌జిఓస్ జిల్లా అధ్యక్షులు సంగం వెంకటపుల్లయ్యతో పాటు సుమారు 500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఐటిడిఎ పిఓ

వసతులు, సదుపాయాలపై సంతృప్తి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిసరాలు, పుస్తకాలు, అందుబాటులో ఉన్న వనరులు, పని వేళలు, సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఇంతమంచి గ్రంథాలయాన్ని అందుబాటులో ఉండటం అదృష్టమని, విద్యార్థుల భవిష్యత్‌కు ఇది ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు కష్టపడి చదివి, తమకంటూ ఒక ఉద్యోగాన్ని సంపాదించుకోవాలని సూచించారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఈ గ్రంథాలయం మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలైన వెంటనే తనవంతు బాధ్యతగా అవసరమైన పుస్తకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. నిజాయతీగా కష్టపడి చదివే విద్యార్థులకు తాను వెన్నంటి ఉండి అన్ని విధాలుగా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. గ్రంథాలయ చైర్మన్ వీరబాబుతో పాటు సిబ్బంది విద్యార్థులకు అన్ని విధాలుగా తోడుగా ఉండాలని రాహుల్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, గ్రంథపాలకులు జి మణిమృదుల, మధుబాబు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు

66 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు జరుగుతాయని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, కస్టోడియన్స్‌తో డిఐఇఓ కె. రవిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, బందోబస్తు ద్వారానే ప్రశ్నాపత్రాలు రవాణా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొద సంవత్సరం 17,467 మంది విద్యార్థులు, ద్వితీ య సంవత్సరం 17,721 మంది మొత్తం 35,188 మంది విద్యార్థులు హాజరవుతారని తె లిపారు. ఇందు కోసం జిల్లావ్యాప్తంగా 66 ప రీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని తెలిపారు. హా ల్‌టికెట్‌లో ఎటువంటి తప్పులు ఉన్న వెంటనే సంబంధిత డిఐఇఓ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డ్ అబ్జర్వర్ సిహెచ్ హేమచంద్ర, హైపవర్ కమిటీ సభ్యులు ఎం. సింహాచలం, డెక్ సభ్యులు ఎన్.విజయకుమారి, సయ్యద్ యూసఫ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేయటం జరిగింది. వివిధ ఆసుపత్రిల్లో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మధిర, నిధానపురం, రొంపిమళ్ళ, సిద్దినేనిగూడెం, వంగవీడు, మధిర పట్టణానికి చెందిన 20మంది లబ్దిదారులకు రూ.8.49లక్షలు విలువైన చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాణావత్ వెంకటరమణనాయక్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, షేక్.జహంగీర్, కోరంపల్లి చంటి, కర్నాటి రామారావు, ముువ్వ వెంకయ్యబాబు, పత్తేపురపు సంగయ్య, మాగం ప్రసాద్, బహటం శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్యం పనులు చేపట్టాలి..

కార్పొరేటర్ మునిగడప పద్మ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో నెలకొన్న పారిశుధ్య సమస్యను యుద్ధ ప్రాతిపదికన మెరుగు పరచాలని ఆ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం డివిజన్‌వ్యాప్తంగా శానిటేషన్ అధికారులతో కలిసి నెహ్రూ బస్తీ, లక్ష్మీ టాకీస్ ఏరియా, నాగయ్యగట్ట, నేతాజీబస్తీ, బర్మాక్యాంపు, రాజీవ్ గాంధీ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌వ్యాప్తంగా నెలకొన్న పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో పారిశుధ్య అధికారి వీరభద్రాచారి, ప్రభుదాస్, డివిజన్ ప్రజలు కాంపల్లి దుర్గయ్య, డి సత్యనారాయణ, టాటా మ్యాజిక్ సలీం, జి వెంకన్న, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి బిడ్డగా సేవలందిస్తుంది

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలు అందిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులోని శ్రీసాయి బృం దావనం కాలనీలో అభినందన సభను నిర్వహించారు. కౌన్సిలర్‌గా ఎన్ని కైన 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, 30వార్డు కౌన్సిలర్ దండి శ్రీజకు పూల మాలలు వేసి, శాలువలతో సత్కరించారు. అలాగే ఆ కాలనీ వాసి అయిన భగత్‌వీడు తండా సర్పంచ్ భూక్య వసంత లక్ష్మి దంపతులకు సన్మానం చేశారు. తొలుత కాలనీవాసులు మౌలిక వసతులతో పాటు పలు సమస్యలను పరిష్కారం చేయాలని కౌన్సిలర్ శ్రీజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ...ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకైన భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి శ్రీజను గెలిపించడం అభినందనీయం అని అన్నారు. ఏ ఆశలు ఆకాంక్షల కోసమై ప్రజలిచ్చిన ఆశీర్వాదం ఉందో దానిని తప్పక నిలబెట్టుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, కాలనీవాసులు గుడివాడ శ్రీను, సురభి సాయి, సాంబశివరావు, కొప్పుల కిరణ్, ఆంగోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా...**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో 30వ డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. తన గెలుపులో ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేసిన వారితో పాటు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపింది. ప్రజల ఆశలు..ఆకాంక్షలకు అనుగుణంగా తన పని విధానం ఉంటుందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి, వార్డు రూపు రేఖలు మారుస్తానన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా శశికళ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా జూపల్లి శశికళ శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగరాజు ఆమెను సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్, ఎమ్మెల్యే ఆదినారాయణ, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చామని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ మున్సిపాలిటీ నుండి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా వేసవి సీజన్ ప్రారంభమవుతుందని, 22 వార్డుల్లో కూడా ఎటువంటి తాగునీటి ఎద్దడి లేకుండా, పారిశుద్ధ్యం సమ్యలు తలెత్తకుండా చూసుకుంటామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే, వైస్ చైర్మన్ సహకారంతో తమదైన శైలిలో అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనులకు ఇప్పటికే శంకుస్థాపన చేయటం జరిగిందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా రాజకీయాలకతీతంగా తమ పరిపాలన ఉంటుందని అన్నారు. ప్రతిఒక్కరూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధిరను ప్రగతిపథం వైపు నడిపిస్తా

చైర్‌పర్సన్ సుజాత



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజలకు కావాల్సిన వైద్యం, రహదారులు, విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మధిర పట్టణాన్ని ప్రగతివైపు పరుగులు పెట్టిస్తానని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. మధిర మున్సిపాలిటీలో ఏమైనా సమస్యలుంటే ప్రజలు వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేట 3వ వార్డు కౌన్సిలర్ బెజ్జం రాజు 3వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. గత రెండేళ్లుగా అంబారుపేట ప్రజలు మంచినీళ్లు అందక ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కారణం గతంలో కురిసినభారీ వర్షాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ కొట్టుకుపోయిందని, అప్పటి నుంచి మంచినీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకనుగుణంగా వారి సంక్షేమం, మధిర పట్టణ అభివృద్ధి కోసం ఆహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు.

## ప్రతిభను వెలికితీసేందుకే సిఎం కప్ పోటీలు

ఆర్చరీ పోటీలను ప్రారంభించిన సిపి సునీల్ దత్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామస్థాయిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సిఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ క్రీడా పోటీలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. గ్రామీణ క్రీడలను బలోపేతం చేయడం గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. గెలుపొటములు కాకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన 230 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి సునీల్ కుమార్‌రెడ్డి, ఆర్చరీ జిల్లా ప్రెసిడెంట్ సారంగపాణి, కార్యదర్శి పుట్ట శంకరయ్య, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు క్రిస్టఫర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ మేనేజర్ ఉదయ్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రామారావు, ఆదర్శ్‌కుమార్, రంజాన్, సైదేష్, ముజాహీద్, జిల్లా కోచ్‌లు, మేనేజర్లు, ఆర్చరీ కోచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత క్యాంప్ కార్యాలయాన్ని 23వ డివిజన్‌లోని సాయిగణేష్‌నగర్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, తోట పెద్ద వెంకట్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు బానోత్ దివ్య, బానోత్ ప్రసాద్, పూల్‌సింగ్, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు కోసం భూమి పూజ



**ప్రజాపక్షం/కామేపల్లి:** పొన్నేకల్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు నిమిత్తం శుక్రవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విగ్రహ దాతలు ఎం రామారావు, టిజిటిటిఎఫ్ ఎం రవి పాల్గొన్నారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి జి వెంకట్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జీ నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సరస్వతి దేవి ఆశీస్సులు అవసరమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ కోటేశ్వరమ్మ కార్యక్రమాన్ని నిర్వహించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## నిబంధనల మేరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఫిబ్రవరి 25 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను బోర్డు నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఆదేశించారు. శుక్రవారం హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటిండెంట్లు, డిపార్మ్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అదనపు చీఫ్ సూపరింటెండెంట్లతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో 26 థియరీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ 5210, ఒకేషనల్ 793 మంది కలిపి 6003 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5356, ఒకేషనల్ 807 మంది కలిపి 6163 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వెల్లడించారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరీక్షల కమిటీతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్లు నియమించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటిండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, వైద్య సిబ్బంది, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 9240205555ను, మానసిక సమస్యల పరిష్కారం కోసం 14416 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## డిస్కస్ త్రో పోటీలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన సాయి చరణ్



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థి రంగరాజుల సాయిచరణ్ స్పెషల్ నీడ్ ఎడ్యుకేట్ చిల్డ్రన్ వారికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన డిస్కస్ త్రో పోటీలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి సాయిచరణ్, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌ను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి వెన్నంపల్లి శ్రీనివాస్, కంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు గారే కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సతీష్‌లు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ సాధించాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక పద్మావతి, ప్రసాద్ రావు, శ్రీనివాస్, సుధీర్, దయ, సిఆర్‌పి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/మంగపేట:** క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిపించుకోవడానికి మా దళిత నాయకుడు పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చెయ్యాలని ములుగు జిల్లా భారత రాష్ట్ర సమితి నాయకులు నిమ్మగడ్డ ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఏదేమైనా క్యాతనపల్లి మున్సిపాలిటీ లో గెలిచేది బిఆర్ఎస్ పార్టీ నే ఎగిరేది గులాబీ జెండానే మంత్రి వివేక్ చెన్నూర్ లో ఎన్ని కుట్రలు పన్నిన వచ్చే ఎలక్షన్లో కూడా గెలిచేది మా దళిత నాయకుడు బాల్క సుమనే . మీరు ఎన్ని కుట్రలు చేసిన ఎంతమందిని జైల్లోకి పంపిన ఉద్యమ నాయకుడు బాల్క సుమన్‌ని వెంటనే విడుదల చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పుతారు అని నిమ్మగడ్డ ప్రవీణ్ అన్నారు.

## గ్రంథాలయంలో మౌలిక వసతుల కల్పనకు ఏర్పాటు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా గ్రంథాలయంలో మౌలిక వసతుల కల్పన ఏర్పాటు చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ 2026 2027 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన బడ్జెట్ సర్వసభ్య సమావేశము జిల్లా గ్రంథాలయ సంస్థ జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షులు కోట రాజబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ, జిల్లాలోని గ్రంథాలయాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయుటకు నూతన పుస్తకంలు కొనుగోలు చేయుటకు ప్రాముఖ్యత చూపాలని అన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ ల నుండి రావలసిన గ్రంథాలయ పన్నును జిల్లా గ్రంథాలయ సంస్థ జయశంకర్ భూపాలపల్లికి జమ చేయాలని జిల్లా పంచాయతీ ఆధికారులను కోరారు. గ్రంథాలయ పన్ను సకాలంలో చెల్లించినట్లయితే పాఠకులకు మెరుగైన సేవలను అందించుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, విద్యాశాఖ నుండి కృష్ణమోహన్, జిల్లా పంచాయతీ శాఖ మోహన్, జిల్లా పౌర సంబంధ సమాచార శాఖ నుండి రంజిత్, గ్రంథాలయ సిబ్బంది టీ. చంద్రమౌళి పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తాలు శుక్రవారం పదవి బాధ్యతలను చేపట్టారు. నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో వేద పండితుల మధ్య పూజ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతామన్నారు. ఎలాంటి బెషజలం లేకుండా నర్సంపేట మున్సిపాలిటీలోని 30 వార్డులకు అన్ని రకాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా నర్సంపేట పట్టణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు..

# బంజారాలకు రిజర్వేషన్ కల్పించిందే కాంగ్రెస్

### నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





**ప్రజాపక్షం/నర్సంపేట:** బంజారాలకు రిజర్వేషన్ కల్పించిందే కాంగ్రెస్ పార్టీఅని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాదవ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదలు పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట బంజారా బిడ్డలకు రిజర్వేషన్ కల్పించిందన్నారు. స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ బంజారా బిడ్డలను ఎస్టీ జాబితాలో చేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. నూతనంగా ఎన్నికైన గిరిజన సర్పంచులు, కౌన్సిలర్లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజనుల సంక్షేమానికి అనేక పథకాలను ఇప్పటికే ప్రవేశ పెట్టామని, 3500 ఇందిరమ్మ ఇళ్లు గాక నియోజకవర్గంలో ఎస్టిలకు ప్రత్యేకంగా మరో 250 ఇండ్లు అందించామన్నారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్, ఆర్డీఓ ఉమారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నారాయణ రెడ్డి, సేవాలాల్ ఉత్సవ సమితి చైర్మెన్ గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**దీక్షకుంటలో కంఠమహేశ్వర స్వామిని దర్శించిన ఎంఎల్ఏదొంతి మాధవరెడ్డి**

నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి హాజరై భక్తి భావంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, నెక్కొండ మండలం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నారని అన్నారు. సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటూ గ్రామీణ సంస్కృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గౌడ కులస్తుల ఐక్యత, భక్తి భావం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుమల్ చౌహాన్, నర్సంపేట కోర్టు ఏజిపి న్యాయవాది బండి శివకుమార్, దీక్షకుంట గ్రామానికి చెందిన పులి సుధాకర్, కట్కూరి కొండల్‌రెడ్డి( శేషారెడ్డి) మైనార్టీ కాంగ్రెస్ నాయకులు షేక్ షబ్బీర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగం ప్రశాంత్, సీనియర్ నాయకులు చల్లా పాపిరెడ్డి, ఇండ్ల రవి, పత్తిపాక సర్పంచ్ లావుడ్యా సామ్యా నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామారపు కొంగర దినేష్, తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళలను, బాలికలను వేధిస్తే చర్యలు: షీ టీమ్ ఎస్ఐ సునంద




**ప్రజాపక్షం/కురవి:** మండలంలోని గుండ్రాతి మడుగు జెడ్‌పిహెచ్ఎస్ హైస్కూల్‌లో శుక్రవారం షీ టీం భరోసా సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షీటీం ఎస్ఐ సునంద పోక్సో చట్టం పై, మహిళలపై, పిల్లలపై జరిగే నేరాలపై , అవగాహన కల్పించి వాటిని నివారించడంలో షీ టీమ్, ఎహెచ్‌టియు, భరోసా పాత్రగురించి వివరించారు. మహిళల రక్షణ కొరకు షీ టీం బృందం పనిచేస్తుందని ఎలాంటి సమయాల్లో అయినా మహిళలపై, పిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎవరైనా విద్యార్థినిలు లేదా మహిళలపై ర్యాగింగ్, స్ట్రీట్ హరాస్మెంట్, ఫాలో అవ్వడం గానీ, కామెంట్ చేయడం గాని, రాంగ్ కాల్ చేయడం గాని, రాంగ్ మెసేజ్ లు చేయడం గాని, మిస్ బిహేవ్ చేయడం గాని చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని, అలాగే వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, వంటి సామాజిక మధ్యమాలలో గాని ఇంకేవిధంగా నైనా ఇబ్బందులకు గురిచేసిన, అలా చేసిన ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని మహిళకు, విద్యార్థినిలకు న్యాయం జరిగేలా చూస్తూ మరియు మహిళలని, పిల్లలని ఎవరైనా ఏ విదంగాఅయినా ఇబ్బంది పెట్టినా షీ టీమ్ ని నిర్భయంగా సంప్రదించాలని కోరారు. బాధితుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడును అని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలపై ఏదైనా ఆగాత్యానికి పాల్పడితే పోక్సో చట్టం ద్వారా కఠినమైన చర్యలు తీసుకుంటామని మామె హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినిలు కంప్లైంట్ ఇవ్వాలనుకుంటే మహబూబాబాద్ షీ టీం నెంబర్ 8712656935కి,చైల్డ్ లేబర్స్, చైల్డ్ బెగ్గర్స్, మిస్సింగ్ చిల్డ్రన్, స్కూల్ డ్రాప్ ఔట్స్,1098 నెంబర్లుకు పిర్యాదు చేయాలని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె. జానయ్య, స్కూల్ అధ్యాపక సిబ్బంది మరియు 100 మంది విద్యార్థిని విద్యార్థులు, షీ టీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, అరుణ పార్వతి రమేష్ ,ఏ హెచ్ టి యు యూనిట్ ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజ,భరోసా సిబ్బంది జ్యోత్స్న, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో హరీష్ రావుకు కార్యకర్తల స్వాగతం



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా రెడ్యాల గ్రామం బిగ్ టీవి గ్రూప్స్ ఆఫ్ చైర్మన్ వెన్నం విజయ్‌కాంత్ రెడ్డి టిపిసిసి రాష్ట్ర మాజీ కార్యదర్శి రాష్ట్ర కమిటి సభ్యులు వున్నం శ్రీకాంత్‌రెడ్డి ల తండ్రి రాఘవేందర్ రెడ్డి ఈనెల 11 వ తేదీన మృతిచెందగా ఆకుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు వెళ్తున్న క్రమంలో గూడూరు కేంద్రంలోని ఆయనను టిఆర్ఎస్ సీనియర్ నాయకలు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి వేం వెంకటకృష్ణారెడ్డి కార్యకర్తలు కలిసి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా అక్కడ కొద్దిసేపు ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి ఎంతో ఉండేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినంక పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు భారీగా హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చతేదని ఇప్పటివరకు రైతులకు రైతుబంధు పైతం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు, పార్టీ సేవ చేస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. ఈకార్యక్రమంలో కటార్ సింగ్ సురేందర్ భూక్య సురేష్ నాయక్ వెంకన్న రహింభాషకార్యకర్తలు పాల్గోన్నారు.

## మిర్చి నాణ్యతపై రైతులకు అవగాహన ఉండాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్:** మిర్చి నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మిర్చి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోకి మిర్చి రాబడులు, నాణ్యత, ధరల పరిస్థితిపై సమీక్ష నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్టేట్ ప్రెసిడెంట్ రవీంద్రెడ్డి, వేద ప్రకాష్, వెల్ది సాంబయ్య, మార్కెట్ కార్యదర్శి మల్లేశంలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధరలు నమోదవుతున్నప్పటికీ, తేమతో కూడిన మిర్చి తీసుకురావడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గుతోందన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలు, విదేశీ వ్యాపారులు కొనుగోలుకు నిరాసక్తత చూపుతున్నారన్నారు. రైతులు సరైన ధర కోల్పోకుండా నాణ్యతపై దృష్టి పెట్టాలనిసూచించారు. మిర్చి సంచుల బరువు 49 కిలోలకు మించకుండా తీసుకురావాలని, అలా చేస్తే ఎగుమతి, కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు లభిస్తాయన్నారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్కెట్‌కు సరుకు తరలించే ముందు ఇతర మార్కెట్‌లో ధరలు తెలుసుకోవాలి. తేమ, చెత్త లేకుండా శుభ్రంగా ఆరబెట్టిన మిర్చినే అమ్మకానికి తీసుకురావాలి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఎనుమాముల మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు




**ప్రజాపక్షం / వేలేరు :** హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి శుక్రవారం వేలేరు మండలంలోని పలు కార్యాలయాల ఆకస్మిక తనిఖీలో బాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి పలురికార్డులను పరిశీలించి హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్లతో మాట్లాడారు హాస్పిటల్ ఆవరణలోని చుట్టుప్రక్కల పరిసరాలను పరిశీలించి చెత్త చెదారం లేకుండా ఆరోగ్యకేంద్రంను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్యకేంద్రం పరిశుభ్రంగా ఉంటేనే పేషెంట్లు కూడా ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ పేషెంట్లకు సకాలంలో వైద్యం అందించే విధంగా చూడాలని ఇంచార్జ్ డా,నవీన్‌కుమార్‌కు పలుసూచనలు చేశారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో పలురికార్డుల పరిశీలనచేసి భూభారతి పెండింగ్ కేసులతో పాటు ఇతర భూసమస్యలను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహశీల్దార్ హెచ్ కోమిని కోరారు,గొల్లకిష్టంపల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేసి పలురికార్డులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనుప్రకారమే అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొని వంట గదులను పరిశీలించి భోజన నాణ్యతను పరిశీలించి మెనుప్రకారమే విద్యార్థులకు భోజనాలు పెట్టాలని పాఠశాల ఇంచార్జ్‌కి తెలిపారు.కార్యక్రమంలో తహశీల్దార్ కోమి,మండలవిద్యాశాఖ అధికారి మొగిళి చెర్ల చంద్రమౌళి,ప్రాథమికఆరోగ్యకేంద్రం వైద్యాఅధికారి డా,నవీన్‌కుమార్,తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించండి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ, టీజీ ఎమ్ఐడిసి అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో కలిసి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్య సేవలు, సిటీ స్కాన్, ఎమ్మారై, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, నూతనంగా నిర్మిస్తున్న నాలుగో అంతస్తు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న నాలుగో అంతస్తు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీలింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఏసీ ఫిట్టింగ్, తలుపులు, కిటికీలు తదితర సివిల్ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. సిటీ స్కాన్ యంత్రం ప్రారంభమైనప్పటికీ టెక్నీషియన్ కొరత కారణంగా సేవలు అందుబాటులోకి రాలేదని, వాకింగ్ ఇంటర్వ్యూల ద్వారా సిటీ స్కాన్ టెక్నీషియన్ నియామకం చేపట్టి త్వరితగతిన సేవలను ప్రారంభించాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో ఖాళీగా ఉన్న డైస్ భవనంలో ఆఫ్తాల్మాలజీ, సైకియాట్రీ, ఫిజియోథెరపీ, డెంటల్ ఓపీలు ప్రారంభించి రోగులకు సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 5 పడకల డయాలసిస్ సెంటర్ మంజూరైన నేపథ్యంలో గదులను గుర్తించి నీటి, విద్యుత్, ఏసీ తదితర సౌకర్యాలతో నూతన డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటరత్నం, టీజీ ఎమ్ఐడిసి ఇంజినీర్ రవి కిరణ్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రికీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం

### వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జనగామ:** వ్యవసాయ యాంత్రికీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తూ 50 శాతం సబ్సిడీపై యంత్రాలను ఇవ్వడం జరుగుతుందని వరంగల్ ఎంపి కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను పాటించాలన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపి కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. జనగామ జిల్లా పరిధిలోని ఐదు ఒడలాల నుండి 30 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై రోటవెటర్స్, బేయిలర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను లబ్ధిదారులకు అందజేవారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించిన చేపల విక్రయ ముబైల్ వ్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి కావ్య మాట్లాడుతూ రైతులపై ఆర్థిక భారం తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తూ వారికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతుల పట్ల ఎప్పుడు లేనంతగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందు చూపుతో పనిచేస్తుందని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమే కాకుండా రైతులకు రుణమాఫీ, రైతుభీమా, ఎకరాలకు 6వేల ఆర్థిక సహాయం వంటివి చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా ఉండడం లేదని వ్యవసాయ పెట్టుబడి భారం అవుతుందని అన్నారు. అందుకే ప్రభుత్వం వ్యవసాయ లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ పనులకు యంత్రాలు సబ్సిడితో ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ జిల్లాలో 3వేల 320 యూనిట్లు మంజూరు అయ్యాయని, అందులో స్టేషన్‌ఘనపూర్‌లో 1600 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. శుక్రవారం 30 యూనిట్లు మాత్రమే పంపిణీచేయడం జరిగిందని, మార్చి లోపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని, ప్రతి రైతు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పంకేష్‌కుమార్, ఆర్‌డిఓ వెంకన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికాసోని, డిఆర్డిఏ పిడి వాసంతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు మున్సిపల్ కమీషనర్ రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ విజయ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**2050కి సరిపడే విధంగా మున్సిపల్ పనుల డిజైనింగ్**

స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీ పరిధిలో 2050కి సరిపడే విధంగా అభివృద్ధి పనుల డిజైనింగ్ చేసి మున్సిపాల్టీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీ మొదటి సమావేశం చైర్మన్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కడియం కావ్య, శ్రీహరి, జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. తాగు నీరు, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. స్టేషన్‌ఘనపూర్‌ను మోడల్ మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 18 అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. మున్సిపాల్టికి వచ్చిన 50 కోట్లు ప్రాధాన్యత క్రమంలో వినియోగించుకోవాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. వార్డు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని అభివృద్ధి పనుల జాబితా తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఆర్‌డిఓ వెంకన్న, మున్సిపల్ కమీషనర్ రాధాకృష్ణ, వైస్ ఛైర్మన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

‘పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలోనీ సెకండ్ సింగిల్ పాటను విడుదలకు ముస్తాబయింది. ఈనెల 22వ తేదిన ఈ పాటను విడుదల చేయనున్నారు.’



# ‘బూకి’ ఫ్యామిలీకి కనెక్ట్ అయ్యే సినిమా

## నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. కథ మాత్రం బ్రేకప్‌తో మొదలవుతుంది. బ్రేకప్ తర్వాత ఇప్పటి టీనేజర్స్ ఎలా సఫర్ అవుతున్నారు? ఎలాంటి డిప్రెషన్ కి వెళ్తున్నారు? ఆ బాధను ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించడం జరిగింది. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కావడం చాలా ఆనందంగా వుంది. దాదాపు 200కు పైగా స్క్రీన్స్ లో ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. 2012లో నేను తమిళ్ లో బ్యాక్ టు బ్యాక్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండే వాడిని. ఆయన మ్యూజిక్ డైరెక్టర్ గా ఉండే సమయం నుంచి నాకు పరిచయం. ఫస్ట్ హీరోగా చేస్తున్నప్పుడు మా ఆఫీస్ కి వచ్చి హీరోగా పరిచయం అవుతున్నానని చెప్పారు. వారి ఫస్ట్ సినిమా కూడా మేము తెలుగులో రిలీజ్ చేయడం జరిగింది. ఆయనతో మళ్లీ రీకనెక్ట్ అయి మంచి సినిమాలు చేయాలని ప్లాన్ చేసాము. మార్గాన్, భద్రకాళి సినిమాలు చేశాం. ఇప్పుడు బూకి వస్తుంది. అలాగే వందదేవుళ్ళు సినిమా చేస్తున్నాము. అది కూడా మేలో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.విజయ్ అంటోని బ్యాగ్రౌండ్ స్కోరు సాంగ్స్ అద్భుతంగా ఉంటాయి. క్లైమాక్స్ చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకుంటారు. సీన్స్ అన్ని అంత అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్ సత్య దేవ్ తో ఒక సినిమా పూర్తయింది. అది తొందరలోనే రిలీజ్ చేస్తాం. అలాగే 100 దేవుళ్ళు సినిమా మేలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం.

# యస్ఎల్వి సినిమాస్ చిత్రం ప్రారంభం



మా ఊరి ప్రేమ కథ' చిత్రంతో హీరోగా పరిచయం అయిన మంజునాథ్.. తెలుగు చిత్ర పరిశ్రమలో గుర్తింపు తెచ్చు కోవాలని వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు. 'రౌడీ విక్రమ్', 'పక్కా ప్రేమికుడు', చిత్రాలు షూటింగ్ చివరి దశలో ఉండగానే మరొక చిత్రానికి శ్రీకారం చుట్టారు.. హీరో మంజునాథ్. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి క్రియేషన్స్ పతాకంపై నూతన దర్శకుడు అభిరామ్ గంటా దర్శకత్వంలో టాలెంటెడ్ యాక్టర్ మంజునాథ్ హీరోగా వి. లక్ష్మి దేవి నిర్మిస్తోన్న ప్రొడక్షన్ నంబర్ వన్ చిత్రం ఫిబ్రవరి 19న హైదరాబాద్ సంస్థ కార్యాలయం లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి హీరో మంజునాథ్ క్లాప్ నివ్వగా డీవోపీ శేఖర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సన్నివేశానికి చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా గౌరవ దర్శకత్వం వహించారు.

అనంతరం హీరో మంజునాథ్ మాట్లాడుతూ. నేను హీరోగా నటించిన 'మా ఊరి ప్రేమకథ' చిత్రం మంచి హిట్ అయి హీరోగా నాకు మంచి పేరు తెచ్చింది. వెంటనే ‘రౌడీ విక్రమ్‘ సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్రం షూటింగ్ చివరి దశలో వుంది. ఇదిలా ఉండగా మరొక చిత్రం ‘పక్కా ప్రేమికుడు‘ సినిమా లో కూడా హీరోగా చేస్తున్నాను. ఈ చిత్రం తొంబై శాతం కంప్లీట్ అయింది. ఈ రెండు చిత్రాలు అండర్ ప్రొడక్షన్ లో ఉండగానే మరొక సినిమా చేసే అవకాశం వచ్చింది. అభిరాం గంటా చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. ఈ చిత్రంలో నేను ప్యాషన్ డిజైనర్ క్యారెక్టర్ లో నటిస్తున్నాను. అవుట్ అండ్ అవుట్ పక్కా ఫ్యామిలీ ఎంటెర్టైన్మెంట్ చిత్రం ఇది. ఈ చిత్రంలో హీరోగా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత లక్ష్మి దేవికి నా థాంక్స్ అన్నారు. చిత్ర దర్శకుడు అభిరామ్ గంటా మాట్లాడుతూ ఫస్ట్ నేను యూట్యూబర్ ని. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్ చేశాను. ఏప్రిల్ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రంలో ప్రముఖ నటీ, నటులు, నటించనున్నారు. మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం అన్నారు.

# ‘కల్ట్’ ఫస్ట్ లుక్



మాస్ కా దాస్ విశ్వక్సేన్ మరోసారి బౌండరీస్‌ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో కల్ట్‌తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతదేశంలో తొలి స్లాషర్ ఫిల్మ్గా రూపొందుతున్న ఈ సినిమా టాలీవుడ్లో ఇప్పటివరకు చూడని కొత్త ప్రయత్నంగా నిలవనుంది. మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో విశ్వక్సేన్ సూట్ ధరించి, నోట్లో సిగరెట్తో ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. అతని చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలి ఉండగా, అతడు వేసే ప్రతి అడుగుతో రక్తం వ్యాపిస్తూ పోస్టర్కు డార్క్ టోన్ను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ మొత్తం చూస్తే వైలెంట్, స్టైలిష్, బోల్ అనుభూతిని కలిగిస్తూ డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందిస్తోంది. ఈ చిత్ర టీజర్ను నేడు విడుదల చేయనున్నారు.

# అంచనాలను పెంచిన ‘టాక్సిక్’ టీజర్



రాకింగ్ స్టార్ యశ్ బర్త్ డే సందర్భంగా ‘ఇంట్రడ్యూసింగ్ రాయ’ అంటూ తన పాత్రను పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన గ్లింప్స్ ఎంత సంచలనమయ్యిందో అందరికీ తెలిసిందే. కియారా అద్వానీ నాడియాగా, హుమా ఖురేషి ఎలిజబెత్గా, నయనతార గంగగా, తారా సుతారియా రెబెక్కాగా, రుక్మిణి వసంత్ మెల్లిసాగా అద్భుతమైన పాత్రల్లో కనిపించనున్నారు. వారి పాత్రలకు సంబంధించిన పోస్టర్స్కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా శుక్రవారం టాక్సిక్ మూవీ టీజర్ విడుదలై అభిమానులను అలరిస్తోంది. టాక్సిక్ టీజర్ను కన్నడ, హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. యశ్ పాత్రలో కనిపిస్తోన్న మార్పు కేవలం బయట కనిపించే లుక్ వరకే పరిమితం కాలేదు. ఇది మరింత లోతైన మార్పును సూచిస్తుంది. ప్రతి లుక్కు యశ్ ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్, కచ్చితమైన హావభావాలు జోడిస్తూ పాత్రలో పూర్తిగా లీనలమైనట్లు కనిపిస్తున్నారు. అలాగే ఆయన నటనలో కనిపిస్తున్న తీవ్రత, భావోద్వేగాలను గమనిస్తే..ఇవి ఆయన గత పాత్రలతో పోలిస్తే పూర్తిగా కొత్తగా, భిన్నంగా అనిపిస్తున్నాయి. హ 2026 మార్చి 19న రాబోతున్న టాక్సిక్ మూవీపై విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. యశ్, గీతు మోహన్దాస్ సంయుక్తంగా రాసిన ఈ కథని గీతు మోహన్దాస్ తెరపైకి తీసుకు వచ్చారు. ‘టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్’ కన్నడ, ఇంగ్లీష్ భాషలలో ఏక కాలంలో చిత్రీకరించారు. ఇక ఈ మూవీని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, అనేక ఇతర భాషలలో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మించారు.



గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో వైయస్ జగన్, బ్రహ్మానందం ఆత్మీయ కలయిక

# 14 ఏళ్ల తర్వాత అయ్యప్ప శర్మ కొత్త లుక్

టాలీవుడ్ విలక్షణ నటుడు పూడిపెద్ది అయ్యప్ప శర్మ దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన తన సిగ్నేచర్ స్టైల్ను మార్చుకోవడం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో రఫ్ లుక్లో కనిపించే ఈ యాక్టర్, ఇప్పుడు క్లీన్ షేవ్ చేసి పక్కా పోలీస్ ఆఫీసర్లా మారిపోయారు. కన్నడలో తెరకెక్కుతున్న 'పబ్బార్' సినిమా కోసం ఆయన ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అయ్యప్ప శర్మ ఒక పవర్ఫుల్ ఎస్పీ పాత్రలో నటిస్తున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఒకే ఇమేజ్ను మెయింటైన్ చేసిన ఆయన, ఈ క్యారెక్టర్ డిమాండ్ చేయడంతో వెనకాడకుండా తన విజువల్ అప్పీల్ను పూర్తిగా మార్చేశారు. ఈ కొత్త లుక్ చూసి ఆయన అభిమానులు ఫిదా అవుతున్నారు. అయ్యప్ప శర్మ కెరీర్ గ్రాఫ్ గమనిస్తే ఆయన చేసిన విలన్ రోల్స్ ఒక రేంజ్లో ఉంటాయి. ముఖ్యంగా రూరల్ డ్రామాలు, ఫ్యాక్షన్ బ్యాక్డ్రాప్ సినిమాల్లో ఆయన నటన పీక్స్లో ఉంటుంది. ఆ కళ్ళలో ఉండే తీక్షణత, గంభీరమైన గొంతు ఆయనకు సెపరేట్ ఫ్యాన్ బేస్ను తెచ్చిపెట్టాయి. ప్రతి సినిమాలోనూ తనదైన మ్యానరిజమ్తో ప్రేక్షకులను భయపెట్టడమే కాకుండా మెప్పించారు. గతంలో ఆయన చేసిన పాత్రలన్నీ ఒక ఎత్తు, ఇప్పటి ఈ పోలీస్ రోల్ మరో ఎత్తు. 'కేజీఎఫ్' వంటి భారీ చిత్రాల్లోనూ తన ముద్ర వేసిన ఈ నటుడు ఇప్పుడు పొడుగు జుట్టు లేకపోయినా ఆయన ఆహార్యంలో ఆ గంభీరత్వం ఏమాత్రం తగ్గలేదని తాజాగా విడుదలైన ఫోటోలు చూస్తుంటే స్పష్టమవుతోంది.



అయ్యప్ప శర్మ కేవలం నటుడిగానే కాకుండా, తన సోదరులైన సాయికుమార్, రవిశంకర్ల లాగే డబ్బింగ్ రంగంలోనూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'పబ్బార్' మూవీతో ఆయన కెరీర్ మరో టర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మాస్ విలన్గా మెప్పించిన ఆయన, ఖాకీ డ్రెస్ వేసి క్రిమినల్స్ అరాచకాలను ఎలా అడ్డుకుంటారో చూడాలి. ఈ సినిమా ఆయన సెకండ్ ఇన్నింగ్స్కు ఒక గట్టి పునాది వేస్తుందని ట్రేడ్ అనలిస్టులు భావిస్తున్నారు.

---

# సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



చేస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025 పేరుతో యూనివర్సిటీలను దెబ్బ తీసి ఉన్నత విద్యకు పేద వర్గాలను దూరం చేస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్, విదేశీ యూనివర్సిటీలను అనుమతిస్తూ ప్రభుత్వ విద్యలో పీజులు పెంచి అందరికి అందుబాటులో లేకుండా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో 90 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థివ్యతిరేక విధానాలపై నిరంతర విద్యార్థుల పక్షాన నిలుస్తూ ఉద్యమాలు చేస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని, కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల తరగతి గదుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులను రాజకీయంగా ఓట్ల కోసం వాడుకుంటున్నారని తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ విద్యార్థులకు కేంద్రం నుండి తీసుకవచ్చిందేమి లేదని మండిపడ్డారు. నిధులు విడుదలపై ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కూడా గ్యారెంటీ లేకపోవడం విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఈ మహాసభలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు మారయ్యగౌడ్, ప్యాట్రన్ రజినీకాంత్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.సుధాకర్, ఎఐటియుసి రాష్ట్రకార్యదర్శి వై.ఓమయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్ ఇటుకెల రామకృష్ణ, రఘురాం, గ్యార నరేష్ రహమాన్, నాగజ్యోతి, గ్యార క్రాంతి, లెనిన్, రా జు, ప్రవీన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సు బోద్, జిల్లా సహాయ కార్యదర్శి కువాల్, కార్తీ క్, కోశాధికారి అనూష, నాయకులు హాసిని, కిషోర్, నిఖిల్, గౌతం, దిలీప్, ప్రవీన్, సోను, రాజ్, ఆకాష్, కృతిక్ విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం నాణ్యత లోపిస్తే కఠినచర్యలు

## పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం రాజీ పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బియ్యం సరఫరాకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె.సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జ్‌లు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకాలు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

వాదించినప్పటికీ, కాంగ్రెస్ స్పష్టంగా అలాంటి అధికారాన్ని ఐఇఇపిఎ కింద ఇవ్వలేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అందువల్ల ఐఇఇపిఎ చట్టం సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఇవ్వదని కోర్టు తేల్చింది. ఈ తీర్పులో ముగ్గురు న్యాయమూర్తులు విభేదాభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే మెజారిటీ అభిప్రాయం ప్రకారం రాజ్యాంగంలో సుంకాలు నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంది. కార్యనిర్వాహక శాఖ ఆ అధికారాన్ని విస్తరించి ఉపయోగించాలంటే, స్పష్టమైన శాసన ఆధారం అవసరమని కోర్టు అభిప్రాయపడింది. ఇది ‘మేజర్ క్వశ్చన్స్ డాక్ట్రిన్’ అనే న్యాయసిద్ధాంతంతో అనుసంధానంగా ఉంది. దేశవ్యాప్తంగా గణనీయమైన ప్రభావం చూపే విధానాలకు కాంగ్రెస్ స్పష్టమైన అనుమతి ఉండాలనే సూత్రాన్ని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. అయితే ఈ తీర్పు ట్రంప్ విధించిన అన్ని సుంకాలను రద్దు చేయలేదు. ఉక్కు, అల్యూమినియంపై వేరే చట్టాల ఆధారంగా విధించిన సుంకాలు యథాతథంగా కొనసాగుతాయి. కానీ రెండు ముఖ్య వర్గాలలో విధించిన సుంకాలకు ఇది వర్తిస్తుంది. వీటిలో మొదటిది దేశాల వారీగా విధించిన ప్రత్యుత్తర సుంకాలు. ఉదాహరణకు, చైనాపై 34% వరకు, ఇతర దేశాలపై కనీసం 10% వరకు సుంకాలు విధించారు. ఇక రెండవది కెనడా, చైనా, మెక్సికో దేశాల నుంచి వచ్చే కొన్ని వస్తువులపై 25% సుంకం. ఫెంటానిల్ మాదకద్రవ్య ప్రవాహాన్ని ఆయా దేశాలు ఆపలేకపోవడం వల్లే ఈ సుంకం విధించినట్టు ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. కానీ, సుప్రీం కోర్టు ఈ వాదనను తిరస్కరించింది. కాగా, ఈ తీర్పు వల్ల ఇప్పటికే సుంకాలు చెల్లించిన సంస్థలకు రీఫండ్ పొందే అవకాశం ఏర్పడవచ్చు.

# ఎసిబి వలలో కోర్టు సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

రెడ్ హ్యాండ్‌గా ట్టుకున్నట్లు వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య తెలిపారు. గణపురం మండలం కరకపల్లికి చెందిన ఓ రైతు తనకు ఉన్న 14 ఎకరాల భూమిపై పక్కన ఉన్న అతను 1984లో సివిల్ దావా వేశారు. ఈ కేసు పలు దఫాలుగా కింది స్థాయి కోర్టులో కొనసాగి గత సంవత్సరం సెప్టెంబర్‌లో జిల్లా కోర్టు లోకి రావడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదు దారునికి అనుకూలంగా జిల్లా కోర్టు తీర్పును ఇచ్చింది. ఈ తీర్పు కాఫీ కోసం ఫిబ్రవరి 10న అతను కోర్టుకు వచ్చి సర్టిఫైడ్ కాపీ కోసం కోర్ట్ సిబ్బంది రూ.20వేలు లంచం డిమాండ్ చేయడంతో అంత డబ్బులు ఇవ్వలేను అని చెప్పి వెళ్లి పోయాడు. మరుసటి రోజు మళ్లీ వచ్చి స్టెనోగ్రాఫర్‌తో మాట్లాడి 5 వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. దీంతో సదరు బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించగా రైతు వద్ద నుండి డబ్బులు తీసుకుంటుండగా ముగ్గురు కోర్ట్ సిబ్బందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి శనివారం ఉదయం ఎసిబి కోర్టులో హాజరుపర్చనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు రాజు, ఎస్.రాజు, పి.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.387.53 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల మరమ్మతులు వంటి పనులకు ఈ నిధులను వినియోగించనున్నామని, కేంద్ర నిధుల ఆలస్యం కారణంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఇబ్బందిగా మారాయని న్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మిగిలిన పెండింగ్ నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగాలంటే నిధుల సమయానుకూల విడుదల అత్యంత అవసరమన్నారు. ఇప్పటి వరకు విడుదలైన నిధులను సమర్థవంతంగా వినియోగించాలని, ముఖ్యంగా పెండింగ్ బిల్లుల చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే గ్రామాల్లో ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, పారదర్శకతతో నిధుల వినియోగం, ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నదని మంత్రి సీతక్క తెలిపారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com